UNIVERSAL LIBRARY
OU_204205
UNIVERSAL LIBRARY

# గోపదంపతులు

(చరిత్రాత్మక నవల)

గ్రంథకర్త:

వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావుగారు

ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజార్, హైదరాబాద్

స్టాకిస్టు:

పెదమల్లు శ్రీరాములు

సింహా బుక్కుడిపో, రాజమండ్రి.

1954 వెల రు 1-8-0

# గోపదంపతులు.

## ౧ ఆకర్షణము.

ఆంధ్రదేశమునఁ జిరకాలమునుండి చారిత్రప్రాముఖ్యము వహించిన పట్టణములలో విశాఖపట్టణ మొకటి. దానికి రెండు కోసులదూరమున గోపాలపట్టణమను చిన్నగ్రామము గలదు. ఆగ్రామముగుండఁ జెన్నపురినుండి కలకత్తాకుఁబోవు నినుపదారి పోవుచున్నది. అదికుగ్రామమేయైనను దానిసమీపమందున్న చిట్టడవులలోనికలప చింతకాయ మున్నగు వస్తువుల యెగుమతికొంతయందుజరుగుచుండును. కావున,నందొక రైల్వేస్టేషను నిర్మింపఁబడియున్నది. అది విజయనగర సంస్థానములోని పల్లెకావునఁ దఱచుగాఁ దత్సంస్థానోద్యోగులు వచ్చుచుందురు. వారిలో నొకవృద్ధుఁడందే కాఁపురముందురు. ఇనుపదారి దానిగుండఁబోవుటచేఁ దత్సంబంధోద్యోగులును గొందఱుందురు. అప్పుడప్పుడాప్రాంతములఁ బ్రయాణము సేయు వర్తకుల నరికట్టి పాటచ్చరులు కొందఱు బాధించుచుండుటయుఁ గలదు గావున, నందుఁ గొందఱు రక్షకభటులును దదధికారులు కొందఱునుగాఁపురముచేయుచుందురు. వీరుగాక కరణకరణకపరిభృతులే యందలి ఘనుల సంఘములోఁ జేరి యుందురు.

1914 సంవత్సరమున గోపాలపట్టణపు రైల్వేస్టేషను నకు ఆరోగ్యమపిళ్ళగారను తమిలదేశస్థుఁ డొకఁడు మాస్టరుగా నుండెను. అతఁడు మిగులఁ బూర్వాచారపరాయణుఁడు, ప్రజావంతుఁడు. అతనిభార్య సుందరమ్మాళు భర్తకనుగుణ వర్తినియైయుండెను. వారి మతము శైవమతము. వారు తఱుచుగాఁ దమదేశాచారముల ననుసరించి యేవియో యుత్సవములు చేసికొనుచుండురు. ఆయుత్సవ దినములలో నింటఁ బిండివంటలు మెండుగాఁజేసికొని బంధుమిత్రాళితో భుజించుచుఁ దమకుఁ బరిచితులగు తద్గ్రామస్థులం గొందఱినిఁ గూడ విందునకు రమ్మని పిలిచి యాదరించుచుండురు. సుందరమ్మ వినయమును జవిఁజూడని స్త్రీ లాగ్రామమందు లేరు.

ఆగ్రామమునఁ గొల్లలసంఖ్యయెక్కువ. వారిలో అప్పల యప్పలస్వామి యనఁబడువాఁడు మేటి. వానిభార్య గంగమ్మ వానికన్నివిధముల ననుకూలవతియై వర్తించుచుండెను. ఆజాయాపతులు పాలవర్తకము చేయుచుండురు. అక్కడనున్న యుద్యోగులకెల్లఁ బాలును బెరుఁగును గంగమ్మయే యమ్ముచుండెను. కొందఱు గొల్లలు అప్పలస్వామి యింటికివచ్చి పాలు పెరుఁగులు వెలవిగాఁ గొని విశాఖపురికిఁ గొనిపోయి మరల నమ్ముకొందురు. ఈవర్తకములో నప్పలస్వామికాని యతనిభార్యగాని ప్రజల నేమియు మోసముచేసి యెఱుఁగరు. పాలలో నొక్క నీళ్ళచుక్కయైనఁ గలుపరు; పెరుఁగులోఁగూడ నెట్టి కల్తియు లేకుండెను. ఇట్లులుండుటచే వారికి విశేషధనము

మిగులక సుఖజీవనము చేయుటకు మాత్రము మిగులుచుండును. అప్పలసామియు గంగమ్మయు బలముగలవారగుటచేత దినమునకు మూఁడునాలుగుసేరుల పాలు త్రాగుదురు.

ఆయేఁటఁ దమిళుల యుగాదిపండుగువచ్చెను. నాఁడు స్టేషన్‌మాష్టరుగారి యింట మరల నుత్సవము జరుగనున్నది. వారినెయ్యురెండ్రతో విందారగింప రానున్నారు. దక్షిణదేశమునఁ బాలతోఁ జేసికొను పిండివంటలెన్నియో వారు చేసికొన నిశ్చయించికొనిరి. గంగమ్మను నాల్గుకుంచముల క్షీరములను దెమ్మని వారు నియమించిరి. సూర్యోదయమగునప్పటికి గంగమ్మ తనపసులకాపరులచే నాపాలుపట్టించుకొని మాష్టరుగారిగృహమునకేఁగెను. సుందరమ్మ గంగమ్మనుజూచి యత్యానందముతో శుభ్రముగాఁ దోమిన పాత్రలనుదెచ్చి పాలనుబోయించుకొని వానిస్వచ్ఛతను నిర్దుష్టతను నెంతోమెచ్చుకొనెను. గంగమ్మ తన యమాయకత్వమును వెల్లడించుచు నించుకమాటాడి చెన్నపురిని పాలమ్మకులరీతి యెట్లుండునని సుందరమ్మనడిగెను.

సుంద——మా చెన్నపట్టణములో పిండ్లకావులను దీసికొనివచ్చి పాలు పిదికియిత్తురు. మోసముచేయువారు తక్కువగానుందురు. పాలెదుటఁ బిదుకకున్నచో నీళ్ళు గలుపకమానరు. కాని మాయూరిపాలు నీవిచ్చుపాలంత రుచ్యములుగావు.

గంగ——పాలలో నీళ్ళు గలుపనప్పుడు వాని రుచియేఁ

చెడును? నమ్మకముగా నిచ్చినప్పు డక్కడిపాలుసైతము నే నిచ్చు పాలరుచినే పొందియుండవలెను గదా?

సుంద—పాలరుచి యావులుతిను మేఁతనుబట్టికూడ నుండును గదా? ఇక్కడ మీగోవులకు మంచిపచ్చికమేఁత గలదు. చిట్టుపొట్టులు మీరు పెట్టునట్టులు వారు పెట్టరు. మీరు పశువుల కిడునాహారములోఁగల సత్తువ వారిచ్చు నాహారములో లేదు. అక్కడి యావులలో విశేషసంఖ్యలు ఆస్ట్రేలియా మున్నగు పరదేశములనుండి వచ్చినవే. అవికుంచముల కొలఁది క్షీరములనొసంగును. కాని యందు మనదేహమున కుపయోగించు వస్తుచయము చాల తక్కువగానుండును.

గంగ—అమ్మా! ఆయావులకు మనయావులకు రూపములో భేదము లుండునా?

సుంద—రూపములోను భేదముగలదు. అరుపులలోను భేదముగలదు. అవి యిక్కడి గోవులవలె సంబారవములు చేయవు. కీచుకంఠములతోఁ గోయనికూయును. వానిదేహము లిచ్చటివానికంటె నునుపులుగానుండును. వానిమొగములలో లక్ష్మీకళ తక్కువగా నుండును.

గంగ—అమ్మా! చెన్నపట్టణము చాలపెద్దది కాఁబోలును?

సుంద—గంగమ్మా! పెద్దదని నెమ్మదిగానందువా? విశాఖపట్టణము చూచితివిగదా? దానికిఁ బదంత లుండును.

అక్కడనొకపేటలోనుండి మఱియొకపేటకుఁ బోవుటకు నినుపదారులగుండఁబోవు బండ్లు "ట్రామ్సు" అనఁబడునవి గలవు. "మోటారుబస్సు"లకు లెక్కయే లేదు.

గంగ—అమ్మా! నేనాట్రాముబండ్లెప్పుడును జూడలేదు. అవికూడ రైలుబండ్లవలెనే యుండునా? వానిలోనుండి పొగవచ్చునా?

సుంద—అబ్బే! అవిరైలుబండ్లలాగున నావిరిచే నడుపఁబడవు. వానికి "ఎలక్ట్రిసిటీ" యనఁబడు నొకదివ్యశక్తి యాధారమైయున్నది. ఆశక్తిచేతనే పట్టణమంతయుఁ గాంతివంతమగు దీపికలచేఁ బ్రకాశించుచుండును. నగరములోని దీపములన్నియు నొక్కసారియే వెలిగింపఁబడును జుమీ!

గంగ—సుందరమ్మగారూ! నేనాముచ్చటలన్నియుఁ జూచి మఱి చనిపోవలెనని కోరుచున్నాను. నా[illegible] యూడేలునో లేదో! విశాఖపట్టణములో గొప్పవారియిండ్లఁ బెండ్లిండ్లలో వెలిఁగింపఁబడు గ్యాసులైట్లకన్న నచ్చటిదీపము లెక్కువకాంతితో నుండునా? అక్కడిబజారు మిగుల బాగుగనుండును కాఁబోలు!

సుంద—గంగమ్మా! చెన్నపట్టణము వెళ్లుటయెంతపని! మీకొకనెలలో వచ్చునాదాయము వ్యయముచేసికొందురేని, మీదంపతులు ఆపురికిఁబోయి చూచిరావచ్చును. నీవుచూచిన గ్యాసులైట్లకాంతి యక్కడి యెలక్ట్రిక్ లైట్ల కాంతిలో నాల్గవవంతైన నుండదు. ఇఁకనచ్చటి బజారు మిక్కిలి యానందదాయకముగా నుండును. ఈ రాష్ట్రములోఁ గలవిన్నాణపువస్తువుల

లో మేలైనవానినెల్ల నందుఁజూడవచ్చును. నీవాపురమును జూచుట కంతగానిచ్చింతువేని రాఁగల డిశంబరునెలలో మేము వెళ్లునపుడు నిన్నుఁదీసికొని వెళ్ళెదములే. ఆనెలలో „పార్కు-ఫేర్,, అనఁబడు గొప్పసంతజరగును. దానినిజూపి నీముచ్చటదీర్తును లెమ్ము. మాకు „టిక్కెట్టు" లక్కఱలేదు. కావున మాతోఁబాటు నీవును రావచ్చును. మాయింటనే భోజనము చేయుచు నీవుందువు. నేనే స్వయముగా నీకావింతలన్నియుఁ గనఁబఱుతును.

గంగ—అమ్మా! తప్పకవత్తును. ఒకగిత్తనమ్మి యా సొమ్ముతో బయలుదేఱుదును. వింతసరకులేవైననున్నఁ గొని తెత్తును. నేనీపల్లెటూళ్ళవెంబడినుంటినిగాని, మాపెద్దలు చెన్నపట్టణములోనే యుండెడివారు. మాతాత గొన్నాళ్లు చెన్న పట్టణములో నెలకు రు500ల జీతముమీఁదఁ బనిచేసినాఁడు. మాతండ్రికాలములో మాసంసారమంతయుఁ జెడిపోయినది. మాయమ్మకుఁ దినుటకుఁ దిండికూడలేనియవస్థ గలిగినది.

సుంద—అవునఁట. నీమగఁడా కథయంతయు నొక సారిచెప్పియున్నాఁడు. లక్ష్మి చంచలగదా! బండ్లోడలు నోడలుబండ్లునగునుగదా! అదృష్టముబాగుగనున్న నీవుమరల గొప్పదానవగుదువు.

గంగ—నిజమమ్మా! జమీందారులు ఫకీరులుగను ఫకీరులుజమీందారులుగను మాఱుచుండుట మనము చూచు చున్నాముగదా! దేవునిదయయున్న నైశ్వర్యమునకేమిలోప

ము? అమ్మా! చాలప్రొద్దెక్కినది. నేనుబసకుఁబోవలయును. సెలవు దయచేయుఁడు

అనిగంగమ్మ వట్టిచెంబులు పసులకాపరిచేతికందిచ్చి యింటికిఁ బోవుటకై బయలుదేఱెను. ఆమె సుందరమ్మచెప్పిన మాటలువిన్నతర్వాతఁ జెన్నపురిమీఁదనే మనస్సంతయు నిలిపి యుండుటచేతఁ దానాపట్టణవీధులలోఁ దిరుగుచున్నటులే భావించుకొని పరధ్యానముతోనే నడచిపోవుచుండెను. కొంత దూరమేఁగునప్పటికి నామెమగఁడు పొలములోనుండి వచ్చు వాఁడు దారిలో నెదురుపడెను. ఎదుట భర్తయుండుటయు గ్రహింపక యన్యాక్రాంతచిత్తయై గంగమ్మ పోవుచుండుట యప్పలసామిగని మెల్లఁగా వెనుకనుండివచ్చి యామెకన్నులు మూసెను. గంగమ్మ యులికిపడి తాఁకినవానిబట్టి తనప్రియుఁడే యని గ్రహించి “చేయితీయుఁడు. కస్తూరివంటికాఠిన్యముగల మీచేతినిగుర్తింప నెట్టివారైననేర్తురు. నేను గుర్తింపఁజాలనా?” యని మేలముగాఁబలికెను. అప్పలసామి చేతులఁదీసివైచి “మగవాండ్రియందు నాయొడలును, నాఁడువాండ్రలో నీయొడలును మిగులబలిష్ఠములగుటచే మనముతాఁకినప్పుడు మనలనుగుర్తింపనివా రెవ్వరు నుండరు. నీవు నన్నాక్షేపింప నక్కఱలేదు.” అని బదులుపల్కెను.

ఇట్టులాదంపతులు వేడుకనుడులాడుకొనుచు నొకపావు గంటలో నిలుసేరిరి. వారిరువురును స్నానములాచరించి ధౌత వస్త్రములఁగట్టి చల్దులు గుడువఁబూనిరి.

## ౨ స్వప్నములు

అప్పలసామి పూర్వికులెల్లరు విజయనగరములోఁ గాఁపురముండెడివారు. అతనితాత విజయనగరసంస్థానములో "మోతీమహాల్" దగ్గఱ కావలియుండువారిలో నాయకుఁడుగా నుండువాఁడు. అతఁడు మిగులబలాఢ్యుఁడు. అతఁడెందఱినో జెట్టిగాండ్రనోడించి ఖ్యాతిగాంచియున్నవాఁడు. వానికుమారుఁడు, అప్పలసామితండ్రి, శరీరబలమంతగాలేనివాఁడైనను దండ్రిపేరిని జెప్పుకొని పోలీసుశాఖలో నొకయుద్యోగమును సంపాదింపఁగల్గెను. మొదట సామాన్యరక్షకభటుఁడైయైనను నతఁడు (వెంకటేశ్వరులు వానిపేరు) క్రమముగా వృద్ధిఁగాంచి సబ్ ఇన్స్పెక్టరయ్యెను. వెంకటేశ్వరు లాయుద్యోగము చేయుచు విశాఖపురిలోఁ జాలకాలముండెను. ఆపట్టణములోనే యప్పలసామి బాల్యము చాలవఱకుఁ గడచెను. ఆవయస్సులోనే యప్పలసామి విద్యనేర్వవలసినది. కాని యతనికి విద్యలో నభిరుచితక్కువగానుండి శరీరవ్యాయామపుఁగ్రీడలన్న మక్కువ మెక్కువగానుండునది. ఆకారణముచేత నతనికిఁ జదువేమియు నంటలేదు. రెండవఫారములోఁ జదువుచు నతఁడుబడి మానివేసెను. నిరంతరమాతఁడు కలాశాలావ్యాయామోపాధ్యాయునికడ కరుగుచు నతనికడనెప్పుడు కసరత్తుచేయుచుండెడువాఁడు. ట్రిపీజ్ మున్నగు వానిమీఁద వింతవింతపనులను

జేయుటనేర్చికొనెను. ఫుట్బాల్, టెన్నిస్, క్రికెట్ మున్నగు ఖేలనములలో దిట్టయనిపించుకొనెను. అతఁడొక్కఁడే కొడుకగు టచేఁ దండ్రి వానినేమియు ననెడువాఁడుకాఁడు. విశేషించి వాని వ్యాయామమున కనువగు సాత్త్వికాహారమునుగూడ వానికి సమకూర్చుచుండువాఁడు.

పట్టణమును దర్శించుటకు గవర్నరులుగాని మఱియే గొప్పయుద్యోగులుగాని వచ్చినప్పుడు, అప్పలసామినిరావించి యతనిచేఁ గొన్ని బలవినోదపు దర్శనములు జరపించి యానందించుట యాయూరివారి యాచారమయ్యెను. ఇట్టు లప్పలసామి కీర్తివ్యాపించెను. అతఁడెన్నియో బహుమాన పదకములను బడసెను. వాని కిరువదియేండ్ల వయస్సున్నప్పుడు వానితల్లి మశూచికవ్యాధిచే మృతినొందెను. వానితండ్రి మరల నుద్వాహమాడనిచ్ఛింపక కుమారునితో నెటులో కాలముఁ బుచ్చుచుండెను. ఇంట వండిపెట్టువారెవ్వరునులేమి నొకదూరంపుఁజుట్టమైన ముసలమ్మను దెచ్చికొని యామె యింతతిండి పెట్టుచుండఁ దనయుద్యోగధర్మమును యథావిధినెఱవేర్చుచు వెంకటేశ్వరులు కాలక్షేపము చేయుచుండెను. ఆయుద్యోగములోఁ జిల్లిగవ్వయైన లంచముపుచ్చుకొనకుండు స్వభావము గలవాఁడగుటచే, నతఁడు సుతునికి ధనమేమియు నిలువఁజేసి యీయఁ జాలకుండెను. వాని సంపాదనమంతయు సుఖజీవనమునకే వ్యయమగుచుండెను.

పోలీసుఠాణాను దగ్గఱ నొకచిన్నపెంకుటిల్లు గలదు. అందొక స్త్రీ ముప్పదైదేండ్ల యీడుగలది. నవయౌవనవతియగు కూఁతుతోఁ గాఁపురము చేయుచున్నది. ఆయాఁడుదానిమగఁడు దుష్టుల సావాసముఁ జేసి దుర్నీతిపరుఁడై పెద్దలార్జించిన ధనమంతయు వ్యయమొనర్చి కట్టఁబుట్టమును గుడువఁగూడును లేని యవస్థను దెచ్చుకొని గృహధనముతోఁబాటారోగ్యధనము సైతము గోల్పోయి దుర్భరమైన క్షయవ్యాధికి లోనై మృతినొందెను. భర్తగతింపఁగా నాయిల్లాలి కేదారియులేక మానముచంపుకొని గొడేవారనుజమీందారులయింట దాస్యమొనరించుచుఁ గూఁతునిఁ బెట్టుకొని యాయింటనొకభాగ మద్దెకుఁ బుచ్చుకొని కాఁపురముండెను. ఆకూఁతురే మనకథానాయికయగు గంగమ్మ. మనకథానాయకుఁడగు నప్పలసామి కండలు గట్టిన భుజదండములతో విశాలమ్మగు ఱొమ్ముతో నామె యింటిప్రక్క నుండి పోవునపుడు గంగమ్మ పెక్కుసారులు చూచి యిట్టిబలాఢ్యుని వివాహమాడు భాగ్యము గల్గునాయని యూహించుచుండెను. గంగమ్మకూడఁ బచ్చనిమేనిచాయగలిగి సర్వాంగసౌష్ఠవముతో నొప్పుచున్న యువతీలలామయౌట, నప్పలసామియు వీధియరుఁగుపై నిల్చి తనవంక సానురాగముగఁ జూచు నామెను గాంచినప్పుడెల్ల నామె తనకర్థాంగియగు పుణ్యమబ్బునాయని తలఁచుచుండెను.

ఇట్టు లాయువయువతీమణులు కొంతకాలముదాఁక హృదయగతానురాగములను వెల్లడింపఁజాలక యన్యోన్యవీక్ష

ణములతోను, మందహాసవిలాసప్రకటనములతోను నొండొరులఁబరామర్శించుకొనుచుండిరి. గంగమ్మతండ్రి రామస్వామి నాయఁడుకూడఁ దనతండ్రి వెంకటేశ్వరులునాయఁడువలెనే నాయుఁడని పిలువఁబడుచుండుటచేఁ దామొక్కజాతివారమే కావచ్చునని యప్పలసామి యూహించి యొకనాఁడు గంగమ్మతల విరియ నారఁబోసికొని యొక్కతెయేవీధియరుఁగుమీఁదఁ బ్రచారము చేయుచుండఁజూచి „అమ్మాయి! మీకులమేది?" యనియడిగెను. ఆమె ముసిముసినవ్వులునవ్వుచు „మేము గొల్లలము. మీదియేకుల"మని తిరుగఁబ్రశ్నించెను. అతఁడు „మనముభయులము నొక్క కులము వారమే" యనిమాఱ్పలికి, యామెవంక సానురాగముగాఁ జూచు చేఁగెను. ఇట్లు ప్రేమైకవీక్షణములతోఁ గొన్నాళ్ళుగడన నొకనాఁడు „నీతోఁ గొంత ప్రసంగింపఁ దలఁచుకొంటిని. ఎప్పుడవకాశము చిక్కునో తెల్పెదవా?" యని యతఁడుగంగమ్మ నొంటిగ నున్నప్పుడడిగెను. „నాతో నీవుప్రసంగింపఁదగినదేమి యున్నది" యని పలుకక, యాతనియభిప్రాయము తానునుగ్రహించి యందుకు లోనానందించుచున్నదే గావున, గంగమ్మ „రేపుమాయమ్మ దివాణములోనికి వెళ్ళిన తర్వాత నేనొక్కర్తెనే యింటనుందును. మీరెండవేళ భోజనమయినతర్వాత మాయింటికి రావచ్చు" ననివచించెను. అప్పలసామి మోదమంది యింటికేఁగి మఱునాఁడు సంకేతసమయమునకు గంగమ్మయింటికి వెళ్ళినకామెయందుఁగల ప్రేమను వెల్లడించి యామె సమ్మతించునేని తానామెను బెండ్లియాడి యావజ్జీవ

మామెతో సుఖింపఁగోరుచున్నానని తెల్పెను. ఆమెయు నునుసిగ్గుమూలమున మొదట మాఱుపలుకనోడియు వలనాతనిమనోహరాకృతియు విలాసచేష్టలును దన్నాకర్షింప నాతనియభిమతమున కియ్యకొనెను. కాని వారికాపరిణయము సమకూడుటెట్లు? గంగమ్మ తల్లిచాటునను, అప్పలసామి తండ్రిచాటునను బెరుఁగుచున్నారుగదా!

కొన్నాళ్ళా యువయువతీరత్నములు తమహృదయగతానురాగముల డాఁగురించుకొనిరి. వెంకటేశ్వరుఁడు తనకొడుకునకాస్తివచ్చు సంబంధమేదైనఁ జేయవలెనని యూహించుచున్నాఁడు. కానిగోపకులలో మంచియాస్తిగలుగు వారెవ్వరాప్రాంతమునలేరు. గంగమ్మతల్లి మాణిక్యమ్మ బీదికిచెడినది కావునఁ దనకూఁతురు మిగులఁ నందగత్తెయౌటచేఁ దమపూర్వఘనతను నిలువఁబెట్టఁగల గొప్పసంబంధమేదేని కుదుర్పవలెనని కుతూహలపడుచుండెను. జమీందారునిభార్యయు నామె కూఁతుపెండ్లికగు వ్యయము భరింతునని వాగ్దానము చేయుటచేఁ దగినచుట్టరికము కొఱకెదురుచూచుండెను. వధూవరుల పెద్దల కిట్టియభిప్రాయములుంటచేతనే వారు మనోగతభావములను వెల్లడింపక రహస్యముగాఁ గూడి మాటలాడుకొనుచుండిరి.

ఇట్టులొకయేఁడాది గడవఁగా వెంకటేశ్వరుఁడు హఠంబున వాంతిభేదిచే మరణించెను. కొంతపాత్రసామాగ్రియుఁ గొయ్యవస్తువులుకొన్నియు మాత్రమే యతఁడు కొడుకునకు

దిగవిడిచెను. రొక్కమేమియు లేదు. హఠాన్మరణమగుట
చేత నప్పలసామి మఱుచటిదినమునుండియే తిండికిఁ
దడుపుకొనవలసివచ్చెను. పోలీసుసూపరింటెండెంటు అప్పలసా
మిపై ననుకంపఁబూని యతనితండ్రి యింతకుఁబూర్వమొన
ర్చిన సేవకై యొక వేయిరూపాయలుదొరతనమువారి చే నప్ప
లసామికిప్పించెను. ఆమొత్తముపెట్టుబడిగాఁ జేసికొని యప్పల
సామి యేదేని వ్యాపారము చేయవలెనని నిశ్చయించుకొనెను.
కానియన్నిటికన్నను తనపెండ్లిమాట తెమల్చుకొనవలెనని
తలఁచి యతఁడు మరల గంగమ్మతో రహస్యముగా మాటా
డెను. తనవలపును దల్లితోఁజెప్పిన నింకలాభము లేదనియూ
హించి, తనకు ధనముతోఁ బనిలేదనియు, బ్రేమయే ప్రధాన
మనియు నాలోచించి, యొఱుతైన నప్పలసామినే వివాహ
మాడుట యుక్తమని నిశ్చయించుకొని, యతఁడురమ్మనినచో
టికివచ్చి యతనిం బెండ్లియాడి యతనితోఁ గాఁపురముచేయ
వలెనని కృతనిశ్చయు రాలయ్యెను. ఆమెయు నప్పలసామియు
సింహాచలమునకుఁబోయి, యచ్చటికొండమీఁద శ్రీనృసింహ
స్వామియెదుట వివాహవిధిజరపుకొని, యటుపిమ్మట గోపాలప
ట్టణములో నివసించుచు వ్యవసాయవృత్తిచే జీవింపవలయునని
యేర్పాటుచేసికొనిరి.

ఒకనాఁడప్పలసామి గోపాలపట్టణమునకుఁబోయి య
చ్చట పాటిగొల్లలయిండ్లలో నొకటి యద్దెకుఁదీసికొని యా
యూరి కరణముగారి భూమియొకటి సాగుచేయుటకును నేఁడా

దికి రెండువందలరూపాయల సిస్తు నిచ్చుటకును నొప్పుకొని 'ముచ్చిలక' వ్రాసియిచ్చి, యింటికివచ్చి, యొకశుభముహూర్తమునఁ దనసామగ్రియంతయుఁ దీసికొని గోపాలపట్టణమును జేరుకొనెను. అక్కడఁ బ్రవేశించిన యొకవారములోపుననే యతఁడు గంగమ్మను వెంటఁబెట్టుకొని సింహాచలమునకుఁ బోయి పెండ్లియాడి గోపాలపట్టణములో సుఖముగాఁ గాఁపురముచేయ మొదలుపెట్టెను. పాపము తనకున్నయొక్క బిడ్డయుఁ దన్నువిడిచివెళ్లుటచే మాణిక్యమ్మ మిగులదుఃఖపరవశయైయుండెను. కాని నలపువెల్లువ గాఁపుటకుఁ దనవశముకాదనియు, భగవంతునియిచ్ఛయట్లుండఁ దానుదుఃఖించిన లాభములేదనియుఁ దలఁచి యూరటవహించి తన యూఁడిగ మెప్పటియట్ల చేసికొనుచుండెను.

తనతండ్రికి వండిపెట్టుముసలిది యింటఁ బాకకృత్యము లొనరించుచుండ, నప్పలసామి గంగమ్మతో గోపాలపట్టణమున సుఖముగా జీవయాత్రఁ జేయుచుఁ, బోలీసువానికిచ్చిన సొమ్ముతోఁ గొంతపెట్టి మంచిపాఁడిపసువులనుకొని వానిని దానుసాగుచేయు పొలములో జాగ్రత్తగా మేపుకొనుచు, వానిపాలనమ్మి కొంతసొమ్ము సంపాదించుచు, నత్యంతానందముతో నుండెను. నానాఁట నతని గోధనము వృద్ధియై, వాని వర్తకము పెరుఁగుచుండెను. మనకథ ప్రారంభించునాఁటికి నతనియొద్ద నిరువది యావులును బదిగేదెలును గలవు. వానికిఁ బుట్టిన రకరకముల కోడెదూడల నతఁడు మిగులమురిపెముతోఁ బెంచి యావుమంద

లమున జరగిన పశుపక్షిదర్శనములయందు రెండుసారులు బహుమానము లందెను.

అతఁడరుణోదయమున నేలేచి పొలమునకుఁబోయి యచ్చటనే శరీరవ్యాయామమొకింతతడవుసలిపి వ్యవసాయపుబనులు కొన్ని చక్కఁబెట్టుకొని యేడెన్మిదిగంటల కిల్లు సేరును. ఇంటికి వచ్చునరికి భార్య పసువుల మేఁతలు పెట్టి పాల్పెరుఁగులను సిద్ధపఱిచి యమ్మఁదగిన వానినమ్మి స్నానాదికృత్యములు గావించుకొని భర్తతోఁ జద్దిఁ గుడువ సంసిద్ధయై యుండును. అప్పలసామి పొలమునుండి వచ్చి తోడనే తానమాడి యుదికిన మడుగుదోవతులఁ గట్టి యూర్ధ్వాంగితో నాఁడే యుంచుక తడవు తనయిష్టదేవతయగు సింహాచలనృసింహుని బూజచేసి యవలఁ బాలలో రాత్రితోడు పెట్టియుంచిన యన్నమును బ్రియురాలితో ముచ్చటలాడుకొనుచుఁ దినును. అనగ నింటిపనులు కొన్ని సవరించుకొని పదిగంటలకుఁ బసువులను దోలుకొని పొలమునకేఁగి మరల వ్యవసాయకృత్యములాచరించుచుండును. మధ్యాహ్నము పండ్రెండుగంటలకు గంగమ్మ యొకపసులకాపరిచే మగనికన్నముంబట్టించుకొనిఁ పొలములోనికి వెళ్ళును. ఉభయులొకపాకలోఁ గూర్చుండి వేడుకలు చెప్పుకొనుచు నారగింతురు. తర్వాత నించుక సేపక్కడనే విశ్రమించి తెలుఁగుకథల పుస్తకములుకొన్ని చదువుకొందురు. మూఁడుగంటలు దాఁటినతర్వాత గంగమ్మ యింటికిఁబోవును. అప్పలసామి తక్కిన కృషికార్యములు పూర్తిచేసికొని పసువులతోఁబాటు తాను గూడ సూర్యాస్తమయసమయమునకు గృ

హామంజేరును. రాత్రినాదంపతుల ల్పాహారముభుజించి రెం డుసేరులపాలనుద్రాగి శయనింతురు.

ఇట్లు వారిదినచర్య కడుమనోహరమై యానందదాయకమై యుండెను. అప్పలసామి నానాఁట సముపార్జించిన విత్తముతోఁ దానుసాగుచేయుక్షేత్రమును విలిచి దానికిఁదగిన యెరువుఁబెట్టి బలపఱచుచుండెను. గంగమ్మ కాఁపురమునకు వచ్చి యెనిమిదేండ్లయినను బిల్లలు గలుగరైరి. పిల్లలులేరని యాదంపతులు విచారపడుటయునులేదు. గంగమ్మతల్లి నడుమ నడుమవచ్చి కూఁతునినల్లునిఁ జూచి కొన్నిదినములుగోపాలపట్టణములోనుండి మరల విశాఖపురికిఁ బోవుచుండెను. ఇంట వంటఁజేయు ముసలిది యొకనాఁడేవ్యాధియు లేకుండఁగనే మృతినొందెను. భార్యాభర్తలు నొకరిద్దరుసేవకురాండ్రు మాత్రమే యాయింటనుండిరి.

చదువరులారా! మీకీపూర్వగాథయంతయువిశదముగాఁజెప్పియుండుకనిశ్చయము గల్గించితిని. కాని వారిభావిస్వభావములను వెల్లడించునపు డీగాథలన్నియు మనకుపకరించును గావునఁ జెప్పకతీఱనివియయ్యెను. మరలమన నాయికానాయకులతోనుండి సుందరమ్మతో గూడి చెన్నపట్టణపుఁబ్రయాణమునుగూర్చి వారుచేసికొన్న సంభాషణ మాలకింతము రండు.

వారిరువురును గంచుఁగంచములలో నన్నముఁబెట్టుకొని యొకొక్కముద్దయేనోటనిడుకొనుచు నిట్లుమాటాడికొనిరి.

గంగ—నేఁడు సుందరమ్మగారివలనఁ జెన్నపట్టణపు ముచ్చటలెన్నియో తెలిసికొంటినిజుఁడీ!

అప్పల—అవియేవి? నాతోఁగూడఁ జెప్పుము.

గంగ—చెన్నపట్టణములో వీధులలోనే రైలుపట్టాలు గలవఁట. వానిమీఁదఁ బొగలేకుండ నొకదివ్యశక్తిచే నడుపఁబడుబండ్లు పోవుచుండునఁట. అచ్చటిదీపములన్నియు నొక్కసారియే వెలుఁగునఁట. డిశంబరునెలలో గొప్పసంతజరుగునఁట. దానినిజూచియేతీఱవలెఁగాని వర్ణింపనశక్యమఁట. సుందరమ్మగారాసంత కీయేఁడు వెళ్ళెదరఁట. వెళ్లునప్పుడు నన్నుఁగూడఁగొనిపోయెదమనిరి. అప్పుడుమనమిద్దఱము బయలుదేఱి వెళ్ళి యావినోదములన్నియుఁజూచిరావలయునని నాకోరిక. మీరేమందురు?

అప్పల—నేనుగూడఁ జెన్నపురి కెప్పుడును వెళ్లియుండక పోవుటచే నొకసారి చూడఁదగినదే. కాని యచ్చటి నాగరికతను జూచిన, మనముకూడ నటులే యుండవలయునని కోరి చెడిపోవుదుమేమో యని భయపడుచున్నాను.

గంగ—చూచి వచ్చినంతమాత్రముననే చెడిపోవుదుమా? మనకెంతో సొమ్ము వ్యయము కాదఁట. ముప్పాతిక రూపాయలతో నవియెల్లఁ దిలకించిరావచ్చునఁట. మనకట్టి గిత్త నమ్మియైన మనమీయేఁడాసంతచూచుటకుఁ బోవలయును.

అప్పల—మనమంత వెళ్ళవలయుననియే నిశ్చయించు కొన్నచోఁ గట్టిగి త్తనే యమ్మవలయునా? అప్పటికి మన పంట యింటికిరాదా! అందుఁగొంతయమ్ముకొని వెళ్లిరావ చ్చును. సింహాద్రిప్పన్న దయవలన మనకు నొకనూఱు రెండునూర్లు కావలయునన్నఁ జిక్కుపడ నక్కఱలేదు. నీకంత గా వెళ్ళవలయుననియున్న నటులే పోదములెమ్ము. నీకోరిక యీడేర్చుటకన్న నాకేమి కావలయును?

గంగ—ప్రయాణమున కిప్పటినుండియు వలయు వస్తువులను భద్రపఱుచుకొనుచుండెదను. ఆ చెన్నపురినుండి కొన్ని యాత్రలుకూడఁ జేసివత్తము.

అని నాఁటు మొదలు పాలికాఁపులతో మాటాడినను నిరుగుపొరుగు వారితోఁ బ్రసంగించినను జెన్నపట్టణ ప్రయాణమును గుఱించియే యామె ప్రసంగించుచుండెను. రాత్రులందునిద్రలో నందునుగూర్చియే కలలుగనుచుండును. తాను వింతగా సింగారించుకొని పార్కుష్టైరులోఁ దిరుగుచున్నటులే భావించుకొనెను. అచ్చటి నాటకములు సర్కసులు మున్నగు నవి యెల్ల మగనితోఁ గూడి చూచుచున్నటులే యానందించుచుండెను. అందలి విపణివీధుల సొరున కచ్చెరు వొందు చున్నటులే తలంచుకొనుచుండెను. తానొక్కరుకయు నున్న ప్పుడెల్ల నివియే తలంపులు. ఆతలంపులలో నొక్కొకనాఁడు తననిత్యధర్మములం దప్పటయుఁ గల్గుచుండెను. దేనియందైన గాఢమైన వలపున్నప్పు డట్టులేకదా!

## 3. వింతమార్పు.

చెన్నపట్టణములో నూతనముగా నొకసర్కసుకంపెనీ స్థాపింపఁబడినది. దానికి 'స్టార్ సర్కస్' అనిపేరిడిరి. దాని యాధిపత్యము వహించు భాగస్వాము లిరువురు, రామస్వామి మొదలియారు శంభులింగముపిళ్ళగారు లనువారు గలరు. వారు తమకంపెనీ వృద్ధిసేయుటకుఁ బలువిధములఁ బ్రయత్నములు సేయుచుండిరి. శరీరమును స్వాధీనముఁజేసికొని తనవయవముల ననేకభంగులఁ ద్రిప్పఁగల దిట్టరులుకొందఱు, యోగాభ్యాసముఁజేసి యూపిరితిత్తుల నిచ్చవచ్చినరీతిగాఁ బెంచి యెంతటిబరువైన ఱొమ్ముపై మోయుచు నత్యాశ్చర్యకరములగు పనులుచేయువారు కొందఱు, ఏకచక్రి ద్విచక్రి శకటాదులపైఁ జిత్రవిచిత్రగతుల సంచారము చేయఁగల్గువారు కొందఱు, గుఱ్ఱములను నేన్గులను లోఁబఱుచుకొని పలురకములనడలను నడిపించువారు కొందఱు, హ్రస్వదీర్ఘాకారములు గలుగు గిత్తలమొత్తములచే నెన్నియో వినోదములు చేయింపఁగల్గువారు కొందఱు, ఇట్టులెందఱేని నేర్పరులు తత్సంఘమునఁ గలరు.

వారు చూపువినోదములలోఁ బొట్టిగిత్తలచే రేకలా బండ్లను బత్తెఱంగుల లాగించుటొకటి. అందునిమిత్తము కొన్ని బలిష్ఠములగు పొట్టికోడెదూడలు వారుసంపాదింపఁబూని

యొంగోలునెల్లూరు మొదలగుతావుల జరుగుపశువులనంతలకుఁ బోయికొన్నిటినివిలిచిరి. కానియవియేవియుఁదృప్తికరముగాఁబని చేయఁజాలనందునఁ దమయాశయములకనుకూలములగునట్టుల కొట్టకై తమబంధుమిత్రులపేర జాబులువ్రాసి యరయఁ జొచ్చిరి. ఆజాబులలో నొకటి గోపాలపట్టణము స్టేషనుమాష్టరు గారగు నార్ముగము పిళ్ళగారికిని వచ్చెను. శంభులింగము పిళ్ళయు నార్ముగముపిళ్ళయు జ్ఞాతివర్గము లోనివారు. అదిగాక సర్కసుయొక్క యజమానులు, మనయావుల యప్పలసామి చక్కని పొట్టిగిత్తలను బెంచినందులకుఁ బశుప్రదర్శనశాఖవారిచే గొప్పబహుమానము లందియుండెనని, వార్తాపత్రికలలోఁ జదివియున్నారు. ఆయప్పలసామినింగూర్చి స్టేషన్మాష్టరునకుఁ దెలియకపోదని వారూహించియు జాబువ్రాసియున్నారు. ఆర్ముగముపిళ్ళ యప్పలసామియొద్ద మంచిగిత్తలున్నవనియుఁ గావలసియున్న శీఘ్రముగా బయలుదేఱి రావలెననియు సర్కసువారికి బదులువ్రాసెను. ఆజాబుచూచుకొని యజమానులే బయలుదేఱి గోపాలపట్టణమునకు వచ్చి యార్ముగము పిళ్ళయింట బసచేసిరి. వారిలో నీతఁడు తానెఱిఁగినంతవఱ కప్పలసామినిగూర్చియు నతనియొద్దనుండు పశువులనుగూర్చియు నాగోపదంపతుల సౌజన్యాదులఁగూర్చియు సవిస్తరముగాఁ దెల్పెను.

వారు స్టేషన్మాష్టరుని బురస్కరించుకొని నాఁటి సాయంకాలమున నప్పలసామియింటికిఁ బయనమైరి. సేవను

నకు నప్పలసామియింటికిని సుమారొకమైలు దూరమున్నది. ఈనడుమనుండుబాట నిర్మలమైఁ యిర్వంకల భూరివృక్షములతో శోభించునదై, మనోజ్ఞముగా నుండును. ఒకప్రక్కఁ గొన్నికొండలునుగలవు. వారాప్రకృతిసౌందర్యముందిలకించుచు నెమ్మదిగా నడచిపోవుచుండ బాట కెడమప్రక్కనున్న కొండయేఱొకటి వారికి లోచనగోచరమయ్యెను. ఆయేఱుదాఁటి కొండలోయకుఁ బోవలయునన్న నొకవంతెనమీఁదినుండి పోవలయును. ఆకాలువ కీవలనుండు పొలము మనయప్పలసామిది. రాత్రులయందొక చిందుఋపులి కొండమీఁదినుండి యావంతెనమీఁదుగా నప్పలసామిక్షేత్రములోఁ జొచ్చి యందున్న దుక్కిపసువుల నప్పుడప్పు డెత్తుకొనిపోవుచున్నది. ఆవంతెన యాతాయాతజనుల కుపయోగకరముగానున్నను మనకథానాయకునకు నష్టదాయకముగా నుండెను. ఆయేటి నిండ నీరున్నప్పుడు పెద్దవాండ్రుసైతము సులభముగా దానిని దరింపఁజాలరు. ఆచిందుగునుపద్రవముఁ దప్పించుటకై యప్పలసామి యావంతెనను దెగఁగొట్ట నిశ్చయించి తానొక్కఁడే యొకగొడ్డలి చేఁబూని దానిని ఛేదించుచుండెను. ఆసమయముననే సర్కసుకంపెనీవారితో స్టీమనుమోష్ట రాదారిని బోవుట తటస్థించినది. అతఁడు దూరమునుండి యప్పలసామి నానవాలుపట్టి యతఁడువచ్చువఱకు నాఁగుఁడమని బంధువులతోఁ జెప్పి యాఁపి వాఁడుచేయు సాహసకృత్యమును దిల

కించుచుండెను. వాఁడొక పావుగంటలోనే యావంతెనను దెగఁగొట్టెను. తా నేటదిగి సుళువుగా నీఁది వచ్చెను.

అప్పుడా యేటికీవలియొడ్డు నందొక గొల్లపిల్లవాఁడు మేఁతమేసి తిరిగివచ్చిన తల్లిమేఁక నొకచెట్టునకుఁగట్టి, తాను మధ్యాహ్నమే తల్లిపాలు త్రాగకుండ నావలిదరి నొకతరువు నకుఁ గట్టియుంచిన మేఁకపిల్లను దీసికొని వచ్చుటకై విసవిస నడుచుచు వంతెనమీఁదఁ బోవుచుండెను. అప్పలసామి వానిపోకడఁజూచి యాఁగిపోయెను. వాఁడు పరుగుపరుగునఁ బోయి నడుమ వంతెన తెగియుంటఁ గాంచి నెత్తియు నోరు ను గొట్టుకొనుచు నేడ్వసాగెను. తల్లిపాల్గుడుచు వేళయగుట చేతను దన కెదురుగా వంతెనప్పై నిల్చియుండి యెన్ను బంధవిము క్తురాలిని జేయఁజాలక తబ్బిబ్బుపడు తినకాపరిని గుర్తుపట్టిన దగుటచేతను, నడుకిరోరను "మే" యని మూల్గఁజొచ్చెను. బిడ్డకేకవిని యదరిపడి యావలఁగట్టుబడియున్న తల్లిమేఁక యార్వ మొదలిడెను. దానిసల్లనుంగాంచి యప్పలసామి జాలిఁగొని, యాగొల్లపిల్లవానికిఁ దోడ్పడ నిశ్చయించుకొని తెగఁగొట్టఁ బడిన వంతెనమీఁదికిఁ బోయి, యందలి చివరకొయ్యల రెండు చేతులఁ బట్టి వ్రేలాడుచు నొక్కయూఁపున రెండవవైపున విఱిగియున్న కొయ్యకొసనందుకొని, యవలీల నావలిఁగట్టుం జేరి, పిల్లమేఁక కట్టునదలించి, దానిని మూఁపునఁదాల్చి, మరల నా ప్రక్రియనే యీవలియొడ్డునకువచ్చి, గోపార్భకుని భీతిఁ బోఁగొట్టెను.

ఈవింతచర్య యంతయుఁ దిలకించుచు నాదాక్షిణాత్య సోదరులు బాటప్రక్కనిలిచియుండిరి. అప్పలసామి బాహుబలసంపదకును దేహలాఘవమునకును వారు మిగుల నచ్చెరు వొందిరి. అట్టి లాఘవస్ఫూర్తి గలుగువాఁడు తమ సర్కసులోనున్న నెంతలెంతలు వింతలైనఁ జేయఁగల వాఁడగునని తలంచిరి. అట్టివాని కెంతజీతమిచ్చినను నష్టములేదని యూహించిరి. ఆర్మొగమునకప్పు యప్పలసామితో మాటాడి సర్కసులోఁ జేర్చు ప్రయత్న మొనర్తునని చెప్పెను.

ఇట్టులు వారు ప్రసంగించుచుండ నప్పలసామి బాట మీఁదికివచ్చి శ్రేష్ఠమూర్తిగారికి వందనమాచరించెను. అంతవారిట్లు సంభాషించుకొనిరి.

ఆర్మొ—అప్పలసామీ! వీరు నాసోదరులు. చెన్నపురినుండి వచ్చి యున్నారు. నీవలన నొకింత యుపకారము వారికిఁ గలుగ వలసియున్నది. నీతో మాటాడవలయునని తలఁచి నీయింటికే మేమెల్లరమును బయలుదేఱి వచ్చుచుండ దారిలో నీవేకాన్పించితివి. ఇంతకుముందు నీవువంతెనను దెగఁ గొట్టుటయు నవలఁ బెత్రివైఖరిని నీవావలిగట్టునకుఁబోయి మేఁకపిల్లనుగొనితెచ్చుటయు మావారుచూచి యాశ్చర్యపడిరి. నీయట్టి శక్తిసంపన్నుఁడు మదాగ్రసులోనుంటయే తటస్థించు నేని వేలకువేలు గడింపఁగల్గునని వారునుడివిరి. వారియభిప్రాయము సరియైనదేయని నేనును నమ్ముచున్నాను.

అప్పా—అయ్యా! మీకునాయెడఁగల వాత్సల్యముచే నట్లుపల్కుచున్నారు, గానినిజమూహించిన నేనంతశక్తివంతుఁడనా? వారికి నేనుజేయఁదగిన యుపకారమేదియో కలదంటిరి. అది యెట్టిదో సెలవిండు. మీయాజ్ఞ శెప్పఁడును బద్ధుఁడనేకదా?

ఆర్మో—వీరిరువురును జెన్నపట్టణములోని స్టార్ సర్కసున కధిపతులు. వారు వార్తాపత్రికలలో నీకీర్తిని నీయొద్ద మంచి పొట్టిగిత్తలు కలవని తెలిసికొని వానిలోఁ గొన్ని తమ సర్కసున కనుకూలములని తోఁచినవానిని గొని తీసికొనిపోవ లెనని వచ్చియున్నారు. వారు నాకింతకు మున్నెన్నియో జాబులు వ్రాసియున్నారు. వారేవచ్చి చూచుకొన్న బాగుగ నుండునని వ్రాసి వారినే రావించితిని. నీకడనున్న గిత్తలను వారికిఁజూపి వారుకోరునవి యర్హమైన వెలకు వారికిచ్చుటయే నీవిప్పుడు చేయఁదగిన యుపకృతి.

అప్పా—పొట్టిగిత్తలు నాకు వ్యవసాయమునకుఁ బనికి రావుగదా? వానిని బెంచుట కేవల వినోదమునకే యని తమ రెఱింగినదే. మీసెలవుప్రకారము వారుకోరిన నబ్బలను వారి కమ్మెదను. ఇఁక వెలమాటయందురా, వారికిన్యాయమని తోఁచినంత ఇయ్యవచ్చును. పాఁడిపసువులతోఁ బాటు పొట్టి గిత్తలును మాయింటికడనే యుండును గావున, మాయింటికి దయచేసి చూచికొనుఁడు.

రామ—అందునకేగదా మేమువచ్చితిమి ! తిన్నఁగాఁ బోదమా ?

ఆర్నో—పోదమురండు.

అని యందఱును గలసి పల్లెలోని కేఁగిరి. అప్పలసామి యిలుసేరునప్పటికి గంగమ్మ వాడుకపాలమ్మివేసి, పశువులకడఁ దగినంత పచ్చగడ్డి యున్నదో లేదో చూచి లేనిచోటఁ గొంత గొంతవేసి, యింట దీపములు వెలిఁగించి భర్తకై యెదురు చూచుచు వాకిటఁ గూరుచుండియుండెను. నాథుఁడు కొందఱు పెద్దమనుష్యులతో వచ్చుచుంట యామెగని ప్రక్కగది లోనికిఁబోయి తలుపించుక చేరవైచుకొనెను. అప్పలసామి దాక్షిణాత్యులను బెరటిలోనికిఁ దీసికొనివచ్చి గిత్తలను జూపెను. వారాపశువుల సొబఁగుఁజూచి నివ్వెఱపడి చూచుచుఁ దమసర్కారుపని కుపయుక్తములగు వానిని రెంటి నెన్నుకొనిరి. వారా రెంటికిని నూఱునూఱు లిమ్మని చెప్ప నప్పలసామి సంతోషపూర్వకముగా సమ్మతించెను. కాని వానిని దిరుగ నమ్మివే యునెడల నా వెలకే తనకే యమ్మవలెనుఁగాని యితరులకమ్మరా దనిపద్ధతియొకటి యేర్పఱిచి వారిచే సమ్మతిపత్త్రముంగొనెను. ఆయెడ్లకే యప్పలసామి బహుమానమందియున్నాఁడు. అట్లయ్యును స్టేషనుమాష్టరుగారు కోరియుండిరి గావునను, వానిని దగురీతి నుపయోగించుకొన్న వానికీర్తి మఱియు వ్యాపింపవచ్చునని నమ్మియుండినవాఁడు గావునను, నతఁడు మాఱుమా

టాడక వారియందలంచిన స్వల్పమూల్యమునకే యీయ కొనెను.

అంతవారు సావడిలోనికివచ్చి కూర్చుండి యిట్లు ప్రసంగింపఁదొడఁగిరి.

శంభు—మీాధారాళమైన మనస్సును జూచి మేము మిక్కిలి సంతోషించుచున్నాము. మీావంటివారు మాపట్టణములో నుండఁదగినవారు కాని యిట్టిపల్లెలలో నుండఁదగరు. మీావంటివారు గ్రామములో నుండిపోయిన, మీాసహజశక్తులు తుప్పువట్టి మీారు సలుపఁదగిన లోకోపకారము సలుపలేకుందురు.

అప్ప—అయ్యా! లోకోపకారము చేయఁబూనువారెక్కడనున్నను జేయవచ్చును. నేను కేవల ముదరపోషణార్థము వెదకికొనువారిలో నొకఁడనుగాని దేశహితకార్యములొనర్చి ప్రసిద్ధికెక్కఁదగిన గొప్పతనము గల్గువాఁడను గాను.

శంభు—అయ్యా! మీాశక్తి మీారెఱుఁగరు. ఇందాఁక మీారావంతెనఛేదించినప్పుడును, బిల్లమేఁకను గొనితెచ్చిఁ గోపబాలుని కిచ్చినప్పుడును, మీాయద్భుతశక్తి మాకవగతమైనది. దానింగాంచినప్పటినుండియు మిమ్ముమాపట్టణమునకు దీసికొని పోవలయునని కుతూహల పడుచున్నాము.

అప్ప—తమకు నాయందుఁ గల్గిన యవ్యాజప్రేమకు నేను మిగులఁ గృతజ్ఞుఁడను. కాని నాబోఁటివాఁ డీపల్లెటూరి

లోనె యుండుటొప్పు. ఒకవేళ నాకు గొప్ప పట్టణములకు బోవబుద్ధిపుట్టినసునదిసాగుటెట్లు? ఆపోలీసుసూపరింటెండెంటుc కృపవలన నేనింతకడుపునిండc దిండితిని నాభార్యను బోషింపc గల్గుచున్నాను. చెన్నపురికే పోవుదునేని మాబ్రతుకెట్లు?

రామ—సామీ! మీరీడ నెలకెంత సంపాదింతురు?

అప్ప—ఆవులుగేదెలు మున్నగువానివలన దినమునకు రెండురూపాయలు గిట్టును. వ్యవసాయమువలనc దిండికిగింజ లును, బశువులకుc గొంతసౌకర్యమును లభించును. నేను, నాభార్య, సుఖముగాc దినుట కాకూడాయము సరిపోవు చున్నది.

శంభు—మీరుచెన్నపురిలోనే యుండుటకు సమ్మతింతురేని మీకునెలకు రెండువందలచొప్పున నేనే యీయcగలను?

అప్ప—మీరు నాకు రెండువందలిచ్చి నావలన మీరుపొందు నుపకృతియేది? అంతజీతమునకుc దగిన సేవ నేను జేయcగలనా?

శంభు—మాసర్కసుకంపెనీలో మీరుకూడc బని చేయుcడు. మీకు మంచి ఫీట్సు, మేమునేర్పింతుము. మీవ లన మేము కొన్నివేలు సంపాదింపcగలుగుదుము. వానిలో మీకు రెండువందలిచ్చిన మాకేమియు నష్టముండదు.

ఈమాటలన్నియుc జాటుననుండి వినుచున్న గంగమ్మ, భర్తయెటులైనc దద్వేతనమున కీయకొని చెన్నపురికిc గాcపుర

ముమార్చిన బాగుగనుండునని తలంచుచుండెను. ఆమెకు సుందరమ్మ చెప్పినమాటలన్నియు మరల జ్ఞప్తికివచ్చి పురసందరఁ నాభిలాష యభివృద్ధి కాఁజొచ్చెను.

అప్ప—నాకా రెండువందల జీతమెంత కాలమీయఁ గలరు? నేనక్కడికి వచ్చి యొకటిరెండుమాసము లున్నతర్వాత మరల నుద్యోగమువదలి నావ్యవసాయపుఁ బనికి రా గోరినఁ జిక్కులు పడవలసివచ్చును.

శంభు—మీకథమపక్షమైదేండ్ల వఱకైన నాజీతమీయఁగలమని పత్రము వ్రాసియిత్తుము. మఱియు మీజీతమేఁటేఁట నేఁబదిరూపాయల వంతునఁ బెంపుసేసెదము. మే మూహించినటులు మీరీ నూతనోద్యోగములోఁ బ్రవేశించిన తర్వాత మీకీర్తి దిగంతములదాఁక వ్యాపించునేని, మీకీర్తితోఁబాటు మాకంపెనీయును శాశ్వతముగా నిలువఁగలదు. కావున మనయుభయులకీర్తికొఱకు మీరు మాతోఁ బయలుదేఱుటకు సమ్మతింపుఁడు.

అప్ప—నాభార్యతో నాలోచించి మనవిచేసెదను. రేపు మాష్టరుగారియింట మిమ్ముఁ గలసికొందును.

ఆగ్నో—అటులే చేయవచ్చును. గంగమ్మకూడఁ దప్పక యనుమతించును. ఆమెకు నీకన్న నెక్కువ యభిలాషము చెన్నపురపుఁ గాఁపురమందుండును. అది నేనెఱుఁగుదును. మీదంపతు లాలోచించుకొనుటకుఁ బూర్వము నేనో

క్కసారి గంగమ్మతో మాటాడఁగోరుచున్నాను. ఒకసారి యామెను బిలువుము.

అప్పలసామి లోనికేఁగి భార్యను వెంటఁబెట్టుకొని యావలకువచ్చెను. గంగమ్మను దిలకించి సర్కసువారు తమ భాషలోఁ దమలోఁ దాము మాటాడుకొనిరి. భర్తవలెనే భార్యకూడ బలాతిశయము గలదనియు, నెటులో యప్పల సామి నొప్పించి యామెకుఁ గూడఁ గొన్ని 'ఫీట్సు' నేర్పించిన, నామెకూడఁ దమకుఁ జాలనుపయోగకారిణి కాఁగలదనియుఁ, గావున నెంతజీతమిచ్చియైన నీదంపతులను దమతోఁ గొని పోవుటే కర్తవ్యమనియు, వారుభావించుకొనిరి. అంత నాదొరగ ముపిళ్ళెగారిట్టులనిరి.

ఆరొరా— గంగమ్మా! నీభర్తవలన వీరియుదంత మె ఱింగియే యుందువు. వీరు మిమ్ముఁ జెన్నపురికి రాఁగోరుచు న్నారు. మీరందుల కంగీకరింతురేని మీపేళ్ళు భూమిపై శాశ్వతముగా నిలుచు నేర్పాటు జరుగఁగలదు. మీరు సుఖ ముగా ఘనులసంఘములోఁ దిరుగుచు జమీందారులవలె జీ వింపవచ్చును. ఈ వ్యవసాయకష్టము లుండవు. "కార్యేషు మంత్రి" యనిభార్యనుఁగూర్చి పెద్దలుచెప్పుదురు గావున, నీభర్తకు నీవుసదుపదేశమొసఁగి మీసమ్మతిని రేపుదాకఁ దెలియఁజేయుము. మీ శ్రేయస్సును గోరువారిలో నేనొ క్కఁడనని యెంచవలయును.

అనిపల్కి తమిళసోదరులతో లేచి యాగోపదంపతు లనువీడ్కొని పిళ్ళెగారు బసకేఁగిరి.

---

## ౪ ప్రయాణము.

నాఁటి రేయియెల్ల నాగోపాల దంపతులు చెన్నపుర ప్రయాణమును గుఱించియే మాటాడుకొనిరి. అప్పలసామి కా నవనాగరకప్రపంచకములోనికి వెళ్లుట కంతగా మనస్సు పోవుటలేదు. గంగమ్మ మెటులేని చెన్నపురికేఁగి యందలి వినోదములం దిలకించుచు నుండవలయునని కోరుచుండెను. పురజీవనము వలన మానవులకు దుష్టత్వమున కెక్కువయవ కాశముండునని యప్పలసామిసమ్మ వెనుకకు లాగుచుండెను. గ్రామములోనున్న మనుష్యుల సహజశక్తులు మొక్కవోయి వ్యర్థములగుననియు వానిని బెంపుచేసికొనఁగోరినఁ బట్టణజీవనమే ముఖ్యమనియు గంగమ్మతలఁచి చెన్నపురోద్యోగమును స్వీకరింపుమని భర్తను బురికొల్పుచుండెను. వారిరువురు చాల సేపు వాదప్రతివాదముల జరపిరి. గంగమ్మపూర్వులెల్ల నగరములలో నివసించువారగుటచే నామెకు నాగరకజీవనము నందు సహజాసక్తి గలిగెను. ఆయాసక్తిని బురస్కరించుకొని తన బుద్ధివిశేషమునుబట్టి కొన్ని హేతువాదములు కల్పించుకొని యామెవాదించెను. తనకు సహజముగా నుండు గ్రామజీ

వనమున కనువగు వాదము లప్పలసామి చేయుచుండెను. తుదకు గంగమ్మవాదమే గెలువ నప్పలసామి స్టార్సక్సన్ లోఁజేరుటకు సమ్మతించెను. గంగమ్మ యానందమునకు, మేరలేకుండెను.

మఱునాఁ డరుణోదయమున గంగమ్మ యెప్పటివాడుక పాలను నొకగొల్లకుఱ్ఱవానిచేఁ బట్టించుకొని స్టేషనుమాష్టరు గారి యింటికివెళ్ళి సుందరమ్మతో నత్యంతసంతోషమునఁ దన మగనిసమ్మతిని దెలియఁజేసెను. సుందరమ్మ పాలను బుచ్చుకొని భద్రపఱిచి భర్తతో గంగమ్మచెప్పిన యంశములం జెప్పెను. అతఁడా యుదంతమంతయుఁ దమిళసోదరులకెఱింగించెను. వారు సంతోషాంచితస్వాంతులై తమయానందమును వెల్లడించుటకు నప్పలసామియింటికేఁగిరి. అప్పలసామి యప్పుడె పొలమునుండి యింటికివచ్చియుండెను. తమిళదేశస్థులను జూడఁగనే యతఁడు చిఱునవ్వుతో ,, అయ్యా! నా భార్యప్రోత్సాహముచేత నేను జెన్నపురికేఁగి మీకంపెనీలో నుద్యోగముచేయుటకు సమ్మతించితిని. మీరును నేనును మాటాడుకొన్న పద్ధతులన్నియు నొకయొడంబడికపత్త్రముపై వ్రాసికొనుట మేలుగదా? నేఁడాపత్త్రము వ్రాయుపని ముగింతుమేని, రేపటినుండి నేను బ్రయాణప్రయత్నము లొనరించుకొందును. ఒకనెల గడువిత్తురేని యీలోపున నాదూడలన్నియు నమ్ముకొని, నేను సాగుచేయుభూమి యెవరికేని యమర్చముచేసి, నాయితర వ్యవహారములన్నియు సవరించుకొని

ప్రయాణమునకు సంసిద్ధుఁడనై యుందును. మేము బయలుదేఱుతేది తెలియఁ జేయుదును. నాఁటికి మీయనుచరులలో నొక్కని నిక్కడికిఁబంపుఁడు. వానివెంబడి మేము చెన్ననగరమున కేతెంతుము.,, అనిచెప్పెను. వారందుల కంగీకరించి కొలఁదిమాటలతోఁ దమకృతజ్ఞతను వెల్లడించి బసకేఁగిరి.

నాఁటిసాయంకాలము గ్రామకరణమును మధ్యవర్తిగా నుంచుకొనియప్పలసామి తమిళుల కడనుండి యొక యొడంబడిక పత్త్రము వ్రాయించి పుచ్చుకొనెను. తమిళులు తాము విలిచిన గిత్తలం గైకొని యానందముతో నానాఁడే చెన్నపురి కేఁగిరి.

పత్త్రికచేపడినదిమొదలు మనకథానాయకుఁడు చెన్నపట్టణప్రయాణమునకుఁ దగిన ప్రయత్నములుశీఘ్రగతిని జేయఁదొడఁగెను. చుట్టుఁబట్టులనుండు గ్రామములలోఁ దన యొద్దనున్న పసువులనెల్ల విక్రయించెదనని చాటింపించెను. అవియాసీమలోఁగల పాఁడిపశువుల యందు శ్రేష్ఠము లగుటచేత నొకపక్షము ముగియులోపలనే ధనవంతులు వానికడకేతెంచి తగినవిలువనిచ్చి వానినెల్లఁ గొనిరి. కరణముగారికే తన మాన్యమును దానున్నిచ్చు సిస్తుకే యమర్కముచేసి వారియొద్దనుండి సమ్మతిపత్త్రముం గైకొనెను. కరణముగారికి నప్పలసామివంటి రయితు మఱియొకఁడు దొరకునా యని గ్రామస్థులెల్లరుఁ బలుకునట్టి సత్ప్రవర్తనముతో నతఁడు వ

ర్తించెను. కరణముగారును దమకుం గూర్చి మంచిరయితు తప్పిపోవుచున్నందుల కించుక వగచుచుండినను, వానికున్నతోద్యోగము తటస్థించి వాఁడున్నతసంఘములోఁ జరింపనున్నందులకు సంతోషించుచు ముచ్చిలకా పత్త్రము నిచ్చెను.

ఈ పనులన్నియు ముగిసిన తర్వాత నప్పలసామి సర్కసుకంపెనీవారికిఁ దాను బ్రయాణమునకు సంసిద్ధుఁడనై యుంటినని తెలియఁజేసెను. వారు తమకడ లేఖకుఁడుగానున్నయొక యాంధ్రుని చేతికిఁ బ్రయాణవ్యయమునకుఁ దగిన మూల్యమొసంగి గోపాలపట్టణము పంపిరి. గంగమ్మ యూరనున్న పేరఁటాండ్రను, ముఖ్యముగాఁ దనజాతివారలనెల్ల, రావించి వారికిఁ బసుపుకుంకుమలును బండ్లును రవికలగుడ్డలును బంచిపెట్టి వారియొద్ద సెలవుఁ బుచ్చుకొనెను. సాధారణముగా నట్టిజాతులవారు మత్స్యపదార్థములు పుచ్చుకొని యించుకనీతి తప్పి చరించుట గలదు. కాని గంగమ్మకట్టి దురభ్యాసము లెవ్వియు లేవు గావునను, చిన్ననాఁటినుండియు బ్రాహ్మణులవలె శాకాహారములతోఁ బెరిఁగినది గావునను సురాపానమెవ్వరి కొసంగకుండెను. గ్రామములోఁ గాఁపురమున్న ద్విజులునైతము తమయాండ్రను గంగమ్మయింటికిఁ దగవులిచ్చి పంపి యాదరించిరి. ఆమెవియోగ మాయూరిస్త్రీల కెంతో కష్టముగానే యుండెను. ముఖ్యముగా ప్లేషరు మాష్టరుగారి భార్యకు మఱియు దుఃఖకరముగానుండెను. ఆమె గంగమ్మయా

హ్వానమందికొని రకరకముల పిండివంటలు గంగమ్మకుఁ గానుకలగాఁ దెచ్చి యామెనాశీర్వదించి బసకేఁగెను.

గంగమ్మవలెనే యప్పలసామియుఁ బురుషులనెల్ల నాహ్వానించి యల్పాహార దానములచేతఁ విందొనరించి, వారు తన్నింత కాలమాదరించినందులకుఁ దనకృతజ్ఞతనువెలిపుచ్చి యందఱకడ సెలవుఁగైకొనెను. ఎవరికిఁదోఁచినకానుక వారతనికిచ్చిరి. కొందఱుమంచిచేతికఱ్ఱలును, గొందఱుమేలివలువలును మఱికొందఱు ఫలాదులును వానికిఁ దిరుగ బహుమానములుగానిచ్చి గౌరవించి వీడ్కొనిరి.

ఇట్లు గ్రామస్థులనుండి గౌరవముంబడసి యా గోపాలదంపతులు తమయిలువేల్పగు సింహాద్రప్పన్నను సేవించుటకు సింహాచలమేఁగి, స్వామినిసేవించి, మనసార నతనియొద్దఁ గూడ సెలవుఁబుచ్చుకొని, యింటికివచ్చి, యొక శుభముహూర్తమునఁ జెన్నపురికిఁ బయనమైరి.

నాఁడు గొల్లలందఱును రామభజనలతోను గోలాటములతోను, హరిబల్లాటలతోను గుంపులుగుంపులుగా వచ్చి తమమిత్రునివీడ్కొలిపిరి. వీడ్కోలొసంగు మిత్రబృందములతో స్టేషనంతయుఁ గ్రిక్కిరిసిపోయెను. సర్కసుకంపెనీవారి యాంధ్రలేఖకుఁడు మన నాయికానాయకుల సామానంతయు జాగ్రత్తగాఁ దూనిక వేయించి యొకదినమునకుముందే రైలు బండిలోఁ బంపి నాఁడు వారిరువురకు రెండవతఱగతి టిక్కెట్లు

విలిచి యత్యంతగౌరవముతో వారిని బండినెక్కించెను. హిత వర్గము లెల్ల జయజయధ్వానములు చేయుచుండ మన గోప దంపతులు బండిలో నాసీనులైరి. ఆరోగ్యముపిళ్ళెగారు వారి యొద్దికివచ్చి చెరికొక పూలమాలయు వైచిరి. అచ్చట గుమి గూడిన స్నేహితులెల్లఁ గరతాళధ్వనులచేఁ దమ యానందముం దెల్పిరి. నాఁడాయుత్సవముచే బండి నిర్ణీతకాలము దాఁటి కొన్నినిమునము లెక్కువగా నిలువవలసి వచ్చెను. అంత పొగ బండి కూసెను. ఎల్లరును బండికింపుచుక యెడముగా నిలిచిరి. బండి కదలెను. మరల జగాజయధ్వనులు చెలరేఁగెను. కను చూపుమేర దాఁటువఱకు జనసమూహము గోక్కముచ్చునే గోపులవంకఁ జూచుచుండిరి. అవల నెవరియిండ్లకు వారేఁగిరి.

వారెక్కినబండి ప్యాసంజరగుటచేత నన్నిస్టేషనుల కడను నిలుచును. బండి వాల్తేరు వచ్చుసరికి గంగమతల్లి వచ్చి కూఁతుని నల్లుని గలసికొని, వారు దారిలో భుజించుటకు రుచ్యములగు పిండివంటలు కొన్ని కొని తెచ్చియిచ్చి, కూఁతును గౌఁగిలించుకొని యది తనకుఁ గడుదూరస్థురాలగుచుండుటచే నించుకసేపు దుఃఖించెను. తల్లికూఁతులిరువు రొకకొంతతడవు కంటఁ దడిపెట్టుకొనిరి. కూఁతురు తల్లికొక నూఱురూపాయల నోటునిచ్చి ,,అమ్మా! నీకెప్పుడేకష్టము తటస్థించినను మాకుఁ దెలియఁజేయుము. మేము చెన్నపురి చేరినతోడనే మా చిరు నామా తెలియఁజేసెదము" అని చెప్పెను. ఆయిల్లాలు కన్న బిడ్డనువీడి భారముగల్గు మనస్సుతోఁ దనయూడిగములోనికిఁ బోయెను.

గంగమ్మ బొత్తుగా సమాయిక యగుటచేత నామెకా ప్రయాణములోఁ నెల్లదృశ్యము లానందదాయకములుగానే యుండెను. స్టేషనువచ్చి బండియాఁగునపుడెల్ల నామెలేచి యచ్చటఁ బండ్లమ్మువారి కేకలకును, దొందరపాటుతో బండినెక్కు పల్లెటూరివారి కలఁతకునుఁ యాత్రికులవంక విలాసముగాఁ జూచుచుఁ బ్రచారము చేయు యువకులకీవికిని నానందమును నాశ్చర్యమును బొందుచుండెను. ప్రతిస్థలమునం దేదో యొక వింతవస్తువు గొనుచుండెను. బండిబండికడకువచ్చి తిరిపమెత్తు బిచ్చఁగాండ్రకు నెక్కుడు కాని గొప్పగ దానము చేయుచుండెను.

వారు రాజమహేంద్రపురము చేరునప్పటికి మధ్యాహ్నకాల మగుటచేత వారి యనుచరుఁడు వారికిఁ దగిన యాహారముఁ దెప్పించి యిచ్చెను. వారాహారించి యించుక విశ్రమింపఁ బోవునరికే గోదావరీనదిమీఁది వంతెన వారికి గోచరమయ్యెను. గంగమ్మ సంతోషమున కంతులేకుండెను. ఆమె పూర్వాచారపరాయణ యగుటచేతఁ బసుపు, కుంకుమము, పండ్లు, రవికలగుడ్డ, కొన్నిడబ్బులు, భక్తిపూర్వకముగా గోదావరిదేవి కర్పించి నమస్కరించెను.

ఇట్లు వారొక్కొక్క స్టేషనుకడనుండు వింతలంజూచుచుఁ బ్రొద్దుక్రుంకు సమయమునకు బెజవాడఁ జేరిరి. వారచ్చట బండిదిగి యించుకసేపు నడయాడి యందుఁ గొన్నిపూవులును బండ్లును గొని మరల శకట మారోహించిరి. ఆంధ్ర

మిత్రుఁడు క్రిమ్మఱ వారికాహారముం దెచ్చియీయఁగా వారు సుఖముగా భుజించి జామురాత్రి మీఁదాఁక మేలుకొని యవలఁ దమకై యమర్పఁబడియున్న మెత్తలపైఁ బండుకొని సుఖనిద్రఁగాంచిరి. వారుదయముననే లేచి కాల్యంబులఁ దీర్చి యందే యమర్పఁబడిన నీటిలోఁ దానమాడి ధౌతవస్త్రములం ధరించునప్పటికి వారు చెన్నపట్టణ మందలి 'సెంట్రల్ స్టేషన్' లోఁ బ్రవేశించిరి. స్టేషనులోనికి రైలుబండి పోవుటయు నందు మనోహరములైన గాలులు వీఁచు ఎలక్ట్రిక్కుపంకా లమర్పఁబడి యుంటను గంగమ్మగాంచి యత్యాశ్చర్య పడుచుండెను. అప్పలసామికిఁ గూడ నవియెల్ల యెఱుఁగని వింతలేయైనను నతఁడు గభీరహృదయుఁడు గావునఁ బై కేవికారచేష్టయుఁ గన్పడనీయక నూరకుచుండెను.

అక్కడికి సర్కసుయజమానులు వచ్చి గోవిందదంపతులకు స్వాగతమిచ్చి వారినొక మోటారుబండిలోఁ గూర్చుండఁ బెట్టుకొని హైకోర్టుభవనములకు నెదుటనున్న వై. యమ్. సి. యే. వారి యున్నతసౌధమునకడకుఁ దీసికొనివచ్చి యందు మూఁడవ యంతస్తుమీఁద నొక విశాలాగారమందు విడియించిరి. దారిలో ట్రాముబండ్ల రాకపోకలు, మోటారుబండ్ల పరుగులు, రిక్షాల సందడులు, జనసమూహముల సంచలనములు, మన్నగువానినెల్ల గంగమ్మ గాంచి నిర్వచింపరాని యానందమొందెను. ఆమె కొక్కొక్క విషయముంగూర్చి సర్కసు

కంపెనీ యజమానులు విరివిఁగా దెలియఁజెప్పుచు బసకుం గొనిపోయిరి.

ఈరీతిగా నాగోపులోక కుగ్రామమునుండి మహానాగరకా ప్రభావముచే వెలయు పట్టణరాజములోనికిఁ గొంపోఁబడిరి. స్థలభేదము సంఘభేదము వారి భావములకెట్టి మార్పాటు గల్గించునో ముందు గమనింతము.

---

## అనాగరకత.

గంగమ్మయు సప్పలసామియు గోపాలపట్టణములో నున్నప్పుడు ప్రాతఃకాలమున, రాత్రిపాలలోఁ దోడుపెట్టియుంచిన యన్నముం దినునలవాటుఁగల వారని మున్ను వచించియే యున్నాము. చెన్నపురికి వచ్చినతర్వాత వారాయలవాటు విడిచి వెన్నరాచిన రొట్టె యుంచుకతిని కాఫీ త్రాగ మొదలుపెట్టిరి. గంగమ్మ కింటిపనికొంత, వాడుకపాల్పెరుఁగు లిచ్చు పనికొంత, యుండుటచే దేహపరిశ్రమ యించుక గల్గుచుండెడిది. ఇప్పుడట్టి పనిలేకపోటచే సోమరితన మబ్బినది. పరిశుభ్రముల్లైన నేయిమజ్జిగలతో నేపూఁట కాపూఁట కోసితెచ్చిన లేఁగూరలతో దంపుడుబియ్యపు టన్నముందిను నభ్యాసముగల్గువార లిప్పుడు రాలతోను గురుగులతోను గూడిన ఫాక్టరీ బియ్యపు టోగిరమును గంపునేతితోను నిలువమజ్జిగతోను

రుచిలేని శాకాదులతోను దినవలసివచ్చెను. కాని వానిలోనే మేలిసరకును సేకరించుకొని వారు కాలక్షేపముఁ జేయుచుండిరి. వారికే నిత్యమును గాఫీక్లబ్బులలో లభించు హల్వాలు, సేమి యాపాయసము, లడ్డువులు మున్నగునవి యచ్చటఁగలుగు నాహారలోపముం దీర్చుచున్నవి.

ఒకవారము దినములిట్లులా పట్టణజీవనమున కలవడిన పిమ్మట సర్కసుకంపెనీవా రప్పలసామిని సర్కసుశాలలోనికిఁ దీసికొనివెళ్ళి యతనిసోదరోద్యోగులతోఁ బరిచయముం గలిగించిరి. మొదట వ్యాయామక్రీడలం దాఱితేరినవారు చేయు కృత్యములన్నియు నప్పలసామి చూచుచుఁ గొన్నిదినములు గడపెను. ఆవల నొకనాఁడతఁడు తనసోదరులలో నొక్కొక్కఁ డొనర్చు కష్టపుఁబనులనెల్ల నవలీలఁ గరలాఘవ మొప్పఁజేసి యందఱ నాశ్చర్యరసమగ్నులం గావింపఁజొచ్చెను. ఇట్టు లాతఁ డచ్చటి మేటివస్తాదుల నతిక్రమించిన వార్త పట్టణమం తయు నలముకొని యతనింజూడఁ గొందఱును, నతనితోఁబరి చయముగలుగఁజేసికొనఁ గొందఱును, నతనిబసకు రాఁజొచ్చిరి. పట్టణమందుఁ బ్రతిదినము వెలువడి వార్తాపత్రికలో స్టార్‌స ర్కసుకంపెనీవారి భావికార్యక్రమసూచికలో నప్పలసామి చేయు వింతపనులం గొండాడుచు వ్రాయఁబడిన ప్రకటనము లెన్నియో పొడసూపఁజొచ్చెను. ఇంతకుమున్ను కంపెనీలోఁబని చేయు వారొనరించు వ్యాయామఖేలనములందు మనయప్పల

సామికిఁ గ్రొత్తతేవియుఁ గన్పట్టలేదు. అవియెల్ల నింతకు ముందు తాను విశాఖపురిలో సాధన మొనర్చినవే. కంపెనీ వారు విదేశములోని బలశాలు లొనరించు వింతవింతచర్యలం దెల్పు పటములం దెప్పించి యప్పలసామికిఁ జూప నతఁడు వాని నెల్ల సులువుగా సాధనములోనికిఁ దెచ్చుకొనుచుండెను.

సర్కసుయజమానులు తలఁచినరీతిగా నప్పలసామి తమకు సర్వవిధముల ననుకూలుఁడయ్యెను. అప్పలసామి యా యాక్రీడలయందు నానాఁటఁ గౌతూహల మతిశయింపఁ దన పూర్వవృత్తి నెల్ల విస్మరించి యీనూత్నజీవనమునకే యలవాటుపడెను.

ఒకనాఁడు రామస్వామిమొదలియారు మనకథానాయకుని బసకేఁగి యిట్లు సంభాషించెను.

రామ—అయ్యా! మిమ్ముగుఱించి మేము తలఁచిన తలఁపులన్నియు నిక్కువములయ్యెను. తుప్పుపట్టియున్న మీయత్యద్భుతశక్తుల వాఁడి లోకమెఱుంగుకాలము నేఁటికిఁ జేకూరెను. మిమ్ముఁ దెచ్చుకొన్నందులకు మేమును, మాతో వచ్చినందుకు మీరును సర్వవిధములఁ దృప్తిఁ బొందుచున్నామనియే మా తలఁపు. ఏమందురు?

అప్ప—నిజమే. మొదటఁ గొన్నాళ్ళీ నూతనజీవనమించుక భారముగాఁ దోఁచినను నానాఁట నాకెందానందము పొందువనుచున్నది. నా భార్యపట్టణవిశేషములందిలకించుటతోఁ

గొన్ని దినము లెట్లో వెళ్ళఁబుచ్చినది. చిరంతనమైన తనకో రిక యీడేరినదని మిగుల సంతసిసినది. కాని యామెకా యానంద మెంతకాలముండును? చెన్నపట్టణ మిప్పుడామెకుఁ జాలఁ దవడినది. నేనింటలేని కాలమామెకు భారముగాఁ గనఁబడుచున్నది. దానినెట్లు సవరింపఁగలమో తెలియకున్నది.

రామ—నేనందునుగూర్చియే మీతోఁ బ్రసంగింపవలెనని తలఁచి వచ్చితిని. మాపట్టణములోని స్త్రీలెట్లు యథేచ్ఛముగాఁ బాఠశాలలకుఁబోవువారు కొందఱు, క్లబ్బులకేఁగువారలు కొందఱు, ఉద్యోగములకరుగువారు కొందఱు పురుషులతోఁజేరి యుపన్యాసవేదికలపై నిల్చి ప్రసంగించువారు కొందఱు, కాన్పించుచున్నారో మీరును మీయర్ధాంగియుఁ జూచియే యున్నారుగదా?

అప్ప—చూచితిమి. అట్లులేదేని గనుక పాఠశాలకుఁ బంపి నా భార్యకు విద్యనేర్పింపుమందురా?

రామ—ఆమెకు విద్యనేర్పుటకు మీరామెను పాఠశాలకుఁ బంపనక్కఱలేదు. ఆమెకుఁ గావలయువిద్య యింటనే నేర్పింపవచ్చును. మీవలెనే యామెయు భగవంతునిచే శరీరబలము ప్రసాదింపఁబడినది. మీరుచేయు క్రీడలుకొన్ని యామెకు మీరేనేర్పి మీరును నామెయుఁగలసి రంగస్థలమునఁ గొన్నివింతయాటలం బ్రదర్శింతురేని మీకీర్తియు మాకీర్తియు నచిరకాలములోనే యాశాంచలములం దాకును.

అప్ప—అబ్బే! మాదేశమున నాడువారు బయటికే రారు. బీదవారు బయటికివచ్చినను నిట్టి నికృష్టకార్యమునకు సిద్ధపడరు.

రామ—ఇది నికృష్టకార్యమందురా? అంగడిలో దుకాణముంబెట్టి సరకులమ్ము స్త్రీలు మీలోలేరా? మీభార్య పాలవర్తకములో నింటింటికిం బోయియుండలేదా? అంతకన్న నిందు దోషమున్నదా? దోషము గుణము ననునవి మనమనస్సులోనున్నవి గాని మాయాపనులలోలేవు. నిష్కల్మషహృదయముతో దేశహితముంగోరి చేయు కార్యమెట్టిదియుం జెడ్డది కాదు.

అప్ప— ఇట్టిది దేశహితకార్యమెట్లగును?

రామ—స్త్రీలబలలనియుం బురుషులొనర్చు కార్యములు చేయంజాలరనియు నొకదోషారోపణమును లోకులు చేయుచున్నారు. దానిని శ్రీమతి తారాబాయమ్మగారు మున్నగు మహానీయురాండ్రు కొంతవఱకుం బోంగొట్టి, స్త్రీలకుంగూడ దేహపరిశ్రమ మవసరమని నిదర్శనపూర్వకముగాం జూపియున్నారు. మీఱయ్యకొందురేని గంగమ్మ యట్టిప్రసిద్ధ స్త్రీరత్నము కాంగలదు. అప్పుడామె చేయుపని దేశహితకార్యము కాదా?

అప్ప—కావచ్చును. కాని యామెయందుల కొప్పుకొనునో లేదో!

రామ—ఒప్పుకొనకేమి! మీరే గట్టిగాఁజెప్పితిరేని యామెతప్పక యొప్పుకొనును. మీకుఁబ్రీకృతమున నొకవంద రూపాయల వేతన మెచ్చుగానిచ్చుచు, నామె రంగస్థలము నందుఁ బ్రవేశించుటాది మీతోఁబాటామెకును రెండువందల జీతమిత్తును.

అప్ప—అంతజీతమా మెకిచ్చిన, మాకేమి లాభముం డును?

రామ—ఏమిలాభముండునో ముందుముందు మీకే తెలియఁగలదు. నేనిప్పుడు చెప్పనేల?

అప్ప—సరియే. అటులే గావింతము. నేనాస్త్రీస్త్రీ స్త్రీగానున్నను, గ్రీముముగా నామెయే యందుల కిష్టపడు నేమో చూతముగాక!

ఇట్లు భాషించి మొదలియారు వెడలిపోయెను. అప్పల సామి భార్యనుబిలిచి యిట్లు మాటాడెను.

అప్ప—గంగా! చెన్నపుర వినోదములం జూచుట తోఁ దృప్తినొందితివా? ఇంకను వానిని జూడఁగోరుచుం టివా?

గంగ—వినోదములకేమి! ఎన్నేనిగలవు. ఎన్నాళ్ళు చూచినను దనివితీరదు. కాని మీరు వ్యాయామసాధనము కొఱకేఁగునప్పుడు నాకు నిమిషమొక యుగముగాఁ దోఁచును. మీరిచ్చిన కథలపుస్తకములతోఁ గొంతకాలముం గడుపుచుం టిని. కాని కొంతసేపుచదువునరికి విసుగుజనించును. అప్పుడేమి

చేయుటకుం బాలుపోదు. నాకేదేని కొంతపని కల్పింతురేని, యాధారము కలుగదు.

అప్ప — అదియే నేనును దలఁచుచుంటిని. నేనే ముందుగాఁ జెప్పఁబోవుచుండ నీవేయడిగితివి. నీవుకూడఁ గొంత శరీరపరిశ్రమ మున్న చేసియేయుంటివి. ఇటుపైని కొన్ని 'ఫీట్సు' స్త్రీలుచేయఁదగినవి, నీకునేర్పెదను. వానిని నేర్చికొందువేని, నీవు నాతోఁబాటు నెలకురెండువందలు గడింపఁగలవు. అఁతనిపేరుకూడ తారాబాయిపేరువలెఁ జరిత్రయందెక్కును. ఇందునకు నీయభిప్రాయమేమి?

గంగ — నేనా? 'ఫీట్సు'నేర్చుకొనుటా? రెండువందల జీతముగడించుటా? క్రొత్తమాటలాడుచుంటిరి!

అప్ప — క్రొత్తమాటలేమైనను నేను సత్యమేపలుకుచున్నాను. నీవట్లు సాముగరిడీలు నేర్చుకొన్నఁ దప్పేమియులేదు. ఈచెన్నపురిలో గొప్పవారిస్త్రీలుకూడ సభలలో సంగీతము పాడుదురు, ఉపన్యాసములిత్తురు, ఉపాధ్యాయినీత్వముఁగైకొందురు, కర్మాగారములనేలుదురు, పురుషులతోఁ డెన్నిసు మున్నగు నాటలాడుదురు. అట్టిచో నీవేల గరిడీలనేర్వరాదు? ఈమహాపట్టణమందాక్షేపణములుండవు. పల్లెటూళ్ళలో మాలవానికి మైలుదూరముగా నిలిచినచువారు, ఈపట్టణములోఁ బంచమునిపంక్తిని బంచభక్ష్యములను బాహాటముగాఁ గుడుతురు. అందున కెవ్వరును దప్పుపట్టరు? పైగా నది

యొుక సుగుణమందురు. అట్టి యీయూరనిన్ను, గెలిసేయు దురని వెఱవకుము.

గంగ—మనవై పువారలు విన్నసవ్వరా ?

అప్ప—మనవై పువా రచ్చటనున్నప్పుడుండు నునికి వేరు, ఇచ్చటికి వచ్చినతర్వాతి యునికివేరు. తాము తిన్నగా నున్నఁగద, మనల నాక్షేపించుట ! నీకాక్షేపముండదు సరి గదా, విశేషించి మెచ్చుగలుగును. నామాటనిజము.

గంగ—సరే. మీాసెలవుప్రకారము నేర్చుకొందు ననుకొందు. శరీరమింత ముదిరినతర్వాత నాకావిద్యలన్నియు నలవడునా ?

అప్ప—అలవడునో, యలవడదో, నీవేచూచెదవు గాక. నీకు సమ్మతియేకదా ?

గంగ—ఆ ! సమ్మతియే. నాబాగోగుల భారమం తయుమీాదేకదా !

అప్పలసామి మూామఱునాఁటినుండియే యాయాక్రీడ లకుఁ దగిన పరికరములన్నియు సర్కసువారినుండి పుచ్చు కొని బసకుఁగొనివచ్చి భార్యకుఁ గొన్నివింతక్రీడలను నేర్పఁజొచ్చెను. ఆమె వానినెల్ల ననాయాసముగా నేర్చికొని మగనిమెప్పొందెను. ఒకనాఁడా రామస్వామిమొదలియారు తనసోదరునితోను మిత్రులతోను నప్పలసామియింటికివచ్చి గంగమ్మచేయు సాముగరిడీల ప్రదర్శనముం గాంచెను. చూాప ఱులెల్ల నత్యాశ్చర్యపడిరి. సర్కసుయజమానుల యానందము

నకు హద్దులేకుండెను. వారు గోపదంపతులుచేయు వింతపనులం దెలుపు పటములు వ్రాయించి ప్రకటనపత్రికలయం దచ్చొత్తించి పట్టణపుగోడల నలంకరింపించిరి. నూతనసభ్యులతో స్టార్ సర్కస్ మొదటియాట 1915 సం॥ రము జనవరి మొదటి తేదిని హైకోర్టుభవనములకు వెనుకనున్న మైదానమునందుఁ గ్రొత్తగా నిర్మింపఁబడిన గుడారమునందుఁ బ్రదర్శింపఁ బడునని ప్రకటింపఁబడెను. ఆయాటలో గోపదంపతు తేయే వింత యాటలంజూపుకురో విరివిగాఁ దెలుపఁబడెను. ఆయేఁట నచ్చట హైందవదేశీయమహాజనసభ జరుపఁబడెను. తత్సభకుఁ బ్రతిరాష్ట్రమునుండియు వేనవేలు మహాజనులు వచ్చియుండిరి. వారిలో వ్యాయామవిద్యలయందుఁ గుతూహలితులెల్లఁ బై తరగతుల టిక్కెట్లను రెండుదినములకు ముందేకొనిరి. పట్టణములో నెవరు మాటాడుకొన్నను సర్కసునుగూర్చియే, యందలి ప్రధాన నాయికానాయకుల యాశ్చర్యకరములైన చర్యలను గురించియే. ఆయేఁట "పార్కు-ఫే" రనఁబడు సంతకూడఁ గనుమనోహరలీల నేర్పాటుచేయఁబడెను. ఆసంతం జూచుటకేతెంచిన వారిలోఁ బెక్కండ్రయాటను జూడనిచ్ఛించి టిక్కెట్లనుగొనిరి. మొత్తమున నిరువదివేలరూపాయల విలువగల టిక్కెట్లు ముందుగా నమ్ముడుపడెను.

క్రైస్తవసంవత్సరాదినాఁడు మొదటిప్రదర్శనము కడు జయప్రదముగా జరిగెను. అందు మన నాయికానాయకుల వింత చర్యలకు సంతసింపని వారులేరు. మనోజ్ఞవేషములం ధరించి

రంగస్థలము నలంకరించిన యాగోపదంపతులు రతీమన్మథుల వలె నుండిరి. అటఁ జూడవచ్చు ప్రేక్షకుల కధ్యక్షుఁడుగా నియమింపఁబడిన గవర్నరుగారు మన నాయికానాయకులను నదితరసభ్యులను గొనియాడుచు నొక యుపన్యాసమిచ్చిరి. ప్రేక్షకులలోఁ గొందఱు ధనవంతు లాదంపతులకుఁ బదకము లొసంగిరి, కొందఱు రంగస్థలముమీఁదికివచ్చి వారిం దారసించి కరములం గిలించి యూడించుటచేఁ దమమెప్పును తెలియఁ బఱచిరి.

ఇట్టు లాప్రథమప్రదర్శనము ముగిసెను. కర్షకజీవన మొనరించు మననాయికానాయులకు నాగరకత మహోన్నతదశం జేకూర్చి దిగంతవిశ్రాంతయశంబును గల్గించెను. అహా! నాగరకతాప్రభావము!

---

## ౬ దుష్టద్వితయము.

చెన్ననగరభాగ్యలక్ష్మియెల్ల 'చెట్టియార్' లనఁబడెడు జాతివారియందుఁ గలదని చెప్పవచ్చును. అచ్చట సెట్లని కొందఱుందురు. వారు వైశ్యకులజాతులు. వాగిలో నాంధ్రులెక్కువ మందిగలరు. చెట్టియార్లనఁబడువారు వివిధజాతులవారగు శూద్రులు. ఈతెగవారిలో విశేషవిద్యావంతులును, నున్నతోద్యోగులును, గొప్పకర్మాగారముల కధ్యక్షులును బె

క్కుండ్రుగలరు. గొప్పగొప్పభవనములు, వనములు, సత్రములు, చావడులు, చెట్టియార్లవే. వితరణ విషయమునఁగూడ వారు విశేషకీర్తిరమఁ గాంచియుండిరి. దొరతనము వారేఁటేఁట ఘనబిరుదము లా తెగవారికే మిక్కుటముగా నిచ్చుచుండిరి.

వారిలో రామయ్యచెట్టియు నటేశముచెట్టియు మేటులనవచ్చును. వారిరువురును గోటికిఁ బడగనెత్తిన ధనాఢ్యులు. వారికన్యోన్యమైత్రిగలదు. రామయ్య పూనమల్లిబాటమీఁద నిర్మింపఁబడిన సుందరారామహర్మ్యమందు నివసించును. ఆ హర్మ్యమేకాక యతనికిఁ జెన్నపురిలోఁ బెక్కుమందిరములు గలవు. నటేశము సంగంబాకములోని సొంతభవనమందు నివాసముచేయును. ఒకరియింటికి రెండవవారు తఱుచుగాఁ బోయి ముచ్చటించుకొనుచుందురు. ఇరువురునుగలసి ప్రతిదినమున ‘కాస్మాపొలిటన్ క్లబ్బు’, నాఁబడు ఘనపౌరమందిరమున కేఁగి యందుఁ దమ కన్నిటనీడగు మిత్రబృందముతోఁ జేరి వినోదనీలఁ గాలక్షేపము చేయుచుందురు. వారిద్దఱు వ్యసనలోలురు. రామయ్యకు భార్యగలదు. కాని యాదంపతులొండొరులనుమించు నాత్మస్వాతంత్ర్యము నాభిజాత్యమును గల్గువారలగుటచేఁ బ్రకృతమునఁ బరస్పరవిరోధభావములొంది విడిపోయియుండిరి. ఇట్లాతఁడు మూఁడేండ్లనుండి యొంటిగానుంటచే దుర్వ్యసనములలో మొదటిదానికిలోనై చరించు

చుండువాఁడు. భార్యతోఁ గూడియుండునప్పుడుమాత్ర మాత నికా వ్యసనములేదు.

నటేశమునకు భార్యతోఁ గాఁపురముగలదు. అట్లులుండియు నతఁడా ప్రథమవ్యసనమునకు మిక్కిలిచిక్కి పెక్కుతావుల నవమానముంగూడఁ బొందియుండెను. రెండవవ్యసనమగు ద్యూతమం దిరువురును విశేషాసక్తి గలుగువారలే. క్లబ్బులో వారు ప్రత్యహముచేయు పనియదియే. ఆసమయమందే నశుమునను మఁ బానవ్యసనమునకు లోపముచుందురు. మృగయావ్యసనము పూర్వపుమహారాజులకువలె లేదు. కాని వారమాయికాత్మలగు మృగీనయనల చంచలదృక్కాంతులచే నాకర్షింపఁబడి తదాకర్షణప్రయత్న మృగయావ్యసనమున కలవడినవారలే. ప్రధాన వ్యసనచతుష్టయములో నాజీతేరి నవారికిఁ దక్కుంగల వాక్పారుష్య, దండపారుష్యార్థ దూషణములను వ్యసనత్రితయ మప్రయత్నముగనే యలవడునను ట యతిశయోక్తిగాదు.

ఈరీతిగాఁ జరించువారు స్టాంసర్కసువారి ప్రథమ ప్రదర్శనమునకుఁ బోయియే యున్నారని వేరుగ వక్కాణింపనక్కఱలేదు. నాయికా నాయకులకుఁ బదకము లిచ్చి, వారిరువుర పరిచయముంగల్గించుకొను నుద్దేశముతో గ్రీన్‌రూమునందుండు నేపథ్యాగారములోనికేఁగి వారితోఁ గర చాలన వినోదముఁ జర్చిన ప్రముఖులలోఁ బ్రసిద్ధులు వారే. ఆయిరువురిలో రామయ్యచెట్టి సుందరరూపుఁడు. 35 యేండ్ల

వయస్సువాఁడు. లోనియభిప్రాయము లెట్టులున్నను, ఘనులతో భాషించునపుడు మర్యాదగలిగి మాటాడువాఁడు. రెండవయాతఁ డంతయుగ్రఁగాఁడు గాఁడు. అతనివయస్సు సుమారేఁబది. అంతటి వయసుమీఱియుండియుఁ గుఱ్ఱవానివలెఁ బ్రసంగించుటయు నాటలాడుటయు జరిగించుచుండును. ఉభయులలో రెండవవానికి దుష్టబుద్ధి దూరముగాఁబుట్టి కార్యరూపముం దాల్చును. మొదటి వానికట్లుగాదు. అతఁ డించుక యోజించి మఱి చేయును. కాని వానికిని యోజనవలని లాభములేదు. ఫలప్రాప్తికిద్దఱు సమానులే. ఇద్దఱు సమానముగానే మాయాదేవతపన్నిన వాగురలలోఁ బడుదురు.

ఒకనాఁడా మిత్రయుగళము మోటారుబండిలోఁ గూర్చుండి సముద్రపుటొడ్డున వాహ్యాళికై తిరుగుచు నిట్లుమాటాడికొనిరి.

నకే—ఏమయ్యఁడా! రేపుమరల మనస్టార్ సర్కసువారి ప్రదర్శనము కలదఁట. మనము తిరుఁగ బోయి చూతమా?

రామ— తప్పక చూతము. నేఁడేయొక బాక్సు, నేర్పాటు చేసికొందము.

నకే—నేనీపట్టణములోఁ బ్రదర్శింపఁబడిన సర్కసుకంపెనీ ప్రదర్శనములెన్నేని చూచితిని. కాని యీస్టార్ సర్కసువారి ప్రదర్శనముల కవియెల్లఁ దీసిపోవునుజుమీ!

రామ—అన్నా ! ఈకంపెనీలో సామిపిళ్ళయు గంగమ్మాళును లేకున్న, నిదియుఁ దక్కు౦గల వానివలెనే సారరహితమై యుండునుజుమీ !

నటే—నిజమే. వారిరువురిలో గంగమ్మాళునుబట్టియే కంపెనీవారికి ధనము విశేషముగా లభించుచున్నది.

రామ—నీవు సర్కసు చూడఁగోరుటకుఁగూడ నామెను బట్టియే కాదా?

నటే—నేనేగాక. అటుఁ జూడఁగోరవచ్చు వారిలో ముప్పాతికమువ్వీసము లామెను బట్టియే యాకర్షింపఁబడు చున్నారు.

రామ—అన్నా! వార్ధక్యదశలోనున్న గృహస్థుఁడవగు నీకే యట్టియాకర్షణము కల్గినపుడు, నిన్నుఁ దరుణవయస్కుఁడను బ్రకృతముగ బ్రహ్మచర్యావస్థయం దున్నవాఁడనుగదా! ఇఁక నేనాసపమట్లలో పడుటయేమియు లేదుగదా ?

నటే—ఇట్టి విషయములలో వయస్సుతోఁ బనిలేదు. వాంఛయే ప్రధానము. వాంఛ వ్యక్తినిబట్టియుండును. గాని వయస్సునుబట్టిగాదు.

రామ—వయస్సునకును వాంఛకును జాలసంబంధమున్నదనియే నానమ్మిక.

నటే—నీనమ్మకలకేమిగాని, గంగమ్మాళ్ళ కరస్పర్శ నాఁడొసర్చితివిగదా? అప్పుడు నీకెట్టులుండెను ?

రామ--మోటుఁబనులెన్నియో యామెచేయుచున్నను నామెచేయి బూరుగుదూదివలెఁ గడుమెత్తనై నాకనిర్వాచ్యమైన స్పర్శసౌఖ్యమునిచ్చినది. నేనెంత యనురాగపూర్వకముగా నామెవంకఁ జూచినను, ఆమెమాత్రము నావంక నిర్మలదృక్కులనే పఱపుచు వచ్చెను. నాచూపులయర్థ మామె గ్రహించినట్లు తోఁపదు.

సఖు—అది పల్లెటూరుఁబడుచు. దానికి మనచూపుల చొప్పలేమి బోధపడఁగలవు? నీకు దానియం దంత మనస్సు నిలిచియున్న, నేను మధ్యవర్తినై యుండి మీయిరువురకు సంధానమొనర్పఁగలను.

రామ—ఇంతకన్న నాకేమి గావలయును? నీవీకార్యమొనర్తువేని, నీప్రియమిత్రుని ముచ్చటఁ దీర్చినవాఁడవగుదువు. నేను దాఁపక చెప్పెదవినుము. ఏనాఁడు నేనాతిని జూచితినో, యదిదొరంకొని నాచిత్తమామెయందు హత్తుకొనిపోయియున్నది. రేయింబవలా మత్తకాశిని మనోహరరూపము నాకన్నులయెదుటఁ గట్టినట్లు కనఁబడుచుండును. ఎన్నివిధంబుల యత్నించినను, మనంబున కూరట కలుగకున్నది.

సఖు—నీకంతవలపున్నటుల నింతకుముందే మొఱంగించి యుంటివేని, నీసదనమునం దామదవతిని నీపాటికే యరిగాపుగా నిలుపకపోవుదునా? ఇప్పుడైన మించిపోలేదు. నాయొద్దఁగల వశీకరణమంత్రములన్నియుఁ బ్రయోగించి కొలఁది

కాలములోనే నీకామెను గూర్తునులెమ్ము. నీవుమాత్రము నేను జెప్పినటులెల్లఁ జేయుచుండ వలయును.

రామ—నీవు కూరుచుండుమన్నఁ గూరుచుండుదును. నిలువుమన్న, నిలుతును. నీవేమిచేయుమన్నను జేయుదును. మెలఁపుతోమాత్రము కార్యము సాధించుకొనిరమ్ము.

నటే—నేవురాత్రి యాటముగిసినతోడనే మనమిరు వురము నేపథ్యాగారములోని కేఁగుదము. ఏఁగి సామిపిళ్ళను గంగమ్మాళును నభినందించి చెరిరొక యుంగ్రమును బహు మాన మిచ్చివత్తము. వచ్చునప్పుడు నీవు నీచిరునామాచీటిని (అడ్రస్ కార్డు) సామిపిళ్ళ కిచ్చిరమ్ము. రేపటి కిదిచాలును. అటుపిమ్మట నేమిచేయవలెనో యాలవచింతును.

రామ—అటులే గావింతును. నాకోర్కెఁదీర్చుభారము నీది.

ఇంతలో రామయ్యచెట్టి గుమాస్తా, యొకఁ డేదో తొందరపనిమీఁదఁ దన యజమానునితోఁ బ్రసంగింపఁ గోరి రాఁగా, రామయ్య యించుకతడవు నటేశమును సముద్రపు టొడ్డున 'అక్వేరియమ్' అనఁబడు మీనశాలకు సమీపస్థలం బున నిలిచియున్న 'మోటారు' బండికడ దిగవిడిచి తానొక కొంతదవ్వున కేగెను. అప్పుడు నటేశమిట్లు లనుకొనెను. ''వీనికి గంగమ్మమీఁద గట్టివలపు గలిగినది. వీనికిమించిన వలపు నా కును దానియందుఁ గలదని వీఁడెఱుఁగఁడు. కాని మాయుభ యులలో నది వీనినే యెన్నుకొనునుగాని, నన్నెన్నుకొనదని నే

నెఱుఁగుదును. కానిమ్ము ముందుగా వానికై ప్రయత్నించి యవల నేదో విభేదము కల్పించి దానిని నే హరింపఁజూచెదను. నేనీయుపకృతి వీనికొనర్చితినేని వీఁడిఁక కుక్కవలె నా వెంటఁ దిరుగును. కొలఁదికాలము వానిననుభవింపనిచ్చి, యవల శాశ్వతముగా మన మనుభవింపవచ్చును." ఇట్లు లూహించుచుఁ గొంతతడవు పరిచారము చేసి యవల నిట్లు వితర్కింపఁజొచ్చెను— "వీఁడనుభవించుటకో నేననుభవించుటకో యది మనము సన్నిధవలలోఁ బడవలయుఁగదా. పైనైఖరిఁజూడ నొకపట్టునఁ బొంగునట్లు తోఁపదు. దానితో నిత్యము పరిసంగించుచు దానికిఁ బ్రియములైన వస్తువులను నిరంతరము బహుమానములుగాఁ బంపుచు దానిస్నేహము పూర్తిగా సంపాదించి యవలఁ గథఁ బోనికి దిగవలయును. అందుకై మనము కూడ నొకని వై. యస్. సి. యే. భవనమునందుఁ దీసికొని కొంతనాటకమాడవలయును. రేపే తన్మందిరాధికారి కొకలేఖ వ్రాసి మూఁడవయంతస్తునఁ గప్పలసామి వసించు గదులకెదురుగనుండు గదులనగునో నొకగది యద్దెకుఁ బుచ్చుకొనెదఁగాక."

ఈరీతిగా సతతము తనలోఁ దాను బరిసంగించుకొనుచుండ రామయ్య వచ్చి "అన్నా! నేను త్వరితగతిని బసకుఁ బోవలయును. కొంత తొందరపని యున్నది" యనెను. నటేశము, "తమ్ముఁడా! వెళ్ళుదము. కాని యొకటి చెప్పవలసియున్నది. రేపు 'కాఫీ'కి నీవు మా బసకు రమ్ము. అచ్చటినుండి మన

మిద్దఱమునుగలసి యొకచోటికిఁ బోవలయు. ఎచ్చటికని యిప్పు డునన్నడుగకుము." అనిపలికెను. రామయ్య 'సరే' యని సోదరునితో మోటారులోఁ గూర్చుండి తనయింటివంకఁ బోనీమని బండినడుపువాని కాజ్ఞయిచ్చెను. మనోవేగమున మోటారుగరిగెను.

---

౭ అనురాగాంకూరము.

—(o)—

మఱుచటిదినమున ట్రాముబండ్లకెల్ల ముందువెనుకల స్టారుసర్కసు వారి పరిదర్శనప్రకటనముం దెల్పుపటము లమర్పఁబడి యుండెను. వాడవాడలయందు వింతవింత వాద్యధ్వనులతోఁ గరపత్త్రములు పంచిపెట్టఁబడెను. ఒకట్రాముబండి రంభాస్తంభములతోను జూతపత్త్రమాలికలతోనుబుష్పదామములతోను సింగారింపఁబడి యన్నివంకల నాఁటిపరిదర్శనములోఁ జూపఁబడు నంశములు వానిపటములు నంటింపఁబడి యుండఁ బట్టణమంతయుఁ గలయఁదిరుగుచుండెను. సర్కసుకంపెనీవారీనడుమ మైసూరు బెంగళూరుమున్నగు పట్టణములకేఁగి, యందు జయప్రదముగాఁ బెక్కుప్రదర్శనములం జల్పి సుమారాఱునూసములకు మరలివచ్చి, తమ కేంద్రస్థానమగు చెన్నపురియందుఁ గ్రమ్మఱఁ గొన్నినెలలుండి, తా మీనడుమ సేకరించిన క్రొత్తవిద్యలఁ బురియులకు వెల్లడింపఁగోరి కొన్ని

యాట లాడనిశ్చయించిరి. వారు మొదట రెండాటలాడిరి. కానియందు వింతలేవియులేవు. నేఁడు మూఁడవప్రదర్శనము. దీనియందు వారు తమ నూత్నవిద్యాప్రకటనముం జేయ సమకట్టిరి. మనచెట్టియూ గ్లారెండాటలకుంబోయి చూచిరి. నేఁడుకూడఁ జూడఁదలఁచికొనియుంట మున్నెఱిఁగించి యుంటిమిగదా!

నాఁటిప్రాతఃకాలమున రామయ్యచెట్టి కాల్యంబులం దీర్చి నిర్ణీతవేళకు నటేశముచెట్టి భవనమునకు 'కాఫీ'కి వచ్చెను. ఇడ్డెనలు, దోసెలు, రొట్టెముక్కలు మున్నగుపదార్థములందిని యామిత్రద్వయము కాఫీపానముం గావించెను. అవల సువాసనగల తమ్మలను నమలుచు, విలువగల 'సిగరెట్టు'లను వెలిఁగించి చిత్రవిచిత్రగతులఁ బొగవిడుచుచు, మెత్తలమర్పఁబడియున్న మేల్గురిచీలలో వ్రాలి యిట్లు ప్రసంగింపఁ దొడఁగిరి.

రామ—అన్నా! నీయాజ్ఞనువచ్చితిని. కాఫీపానకృత్యము ముగిసినది. ఇఁకమనము చేయఁదగినదేది?

నటే—నా 'కార్' సిద్ధముగానున్నది. దానియందుఁ గూరుచుండి యొకచోటికిఁ బోవుదము.

రామ—సరే. ఆచోటేదో యడుగవలదని ముందేయాజ్ఞాపించితివిగదా? నాకారుండగా మరలనీకారేల?

నటే—నిన్ననేచెప్పితినేని, నీవురాత్రి యందునుగూర్చియే కలలుగందువని యట్లంటిని. కాని మఱియొక రహస్యమే

మియులేదు. మనమిప్పుడు వై. యమ్. సి. యే. భవనము నకుఁబోదము. పోని నీకారే యుపయోగింతము లెమ్ము.

రాము—పోయి యేమిచేయుదము?

నటే—అది యిచ్చటననుగకును. అక్కడికి వెళ్ళిన తర్వాత నేనెవచింతు.

ఇటులుమాటాడి కొన్నినిముసములలోనే వారుకారెక్కి పయనమై పోయిరి. వారు మఱికొన్ని నిముసములలోనే వై. యమ్. సి. యే. మందిరముకడకు వచ్చిరి. వారు తిన్నగా మేడమీఁదికేఁగి మందిరాధికారి కడకరిగిరి. అతఁడు వీరికి భక్తితో స్వాగతమిచ్చి సుఖాసనాసీనులం జేసెను. అప్పుడు నటేశము, ,,అయ్యా! ఇందాఁక నొకగంటక్రింద నేనొకజాబు పంపితిని. అదిచేరెనదా? ” యని మందిరపాలకు నడిగెను. అతఁడు జాబందినదనియు, వానికోర్కెప్రకారము మూఁడవయంతస్తులోనిగది 'కాళీ' చేయించియుంటిననియు, నెప్పుడుగావలసిన నప్పుడందుఁ బ్రవేశింపవచ్చుననియు, మార్వలికెను. ఒకకావలివాఁడు వెంటరా వారాగదియొద్దకుఁ జనిరి. అందుఁ దమకుఁ గావలసిన యాసనాదికములంగూర్చి యలంకరింపఁ గావలివాని కాజ్ఞయిచ్చి వారు వెనుకకుమరలిరి. అప్పుడే గంగమ్మ యెదుటనున్న తనగదెకిటికిలోనుండి వీరివంక నొకసారి చూచెను. వారును వారచూపులతో మరల నామెను జూచుచుఁ గ్రిందికిఁ బోయిరి.

ఆగది బాడిగకుఁ బుచ్చుకొన్నట్టులును, నందుండి తమ కార్యసాధనమునిమిత్తము సతీశము గొంతనాటకమాడింపఁద లంచినట్లును, రామయ్య చెప్పకుండఁగనే గ్రహించెను. ఆగదులవరుస దాఁటిపోవునపుడు కతఁడు వెనుక వెనుకకుఁ జూచుచునే పోవుచుండెను. అద్దెకుఁ జెల్లింపవలసిన మొత్తము సతీశము చెల్లించి తమ్మునితో మరల మోటారుబండి కడకువచ్చి, సర్కసుశాల దగ్గఱకు బండిని బోనిమ్మని సారథికాజ్ఞయిచ్చెను. సర్కసుశాలయొద్దఁ గారునిలిపి, నౌకరుచే నాటకు దగ్గఱగా నుండు 'బాక్సు'నకు 'టిక్కెట్టు' వెలయిచ్చి తెప్పించికొని, యచ్చోటు వాసి, వారు తమతమ యిరువులం జేరిరి.

సాయంకాలమున నెమ్మిరువురును 'కాస్మాపొలిటన్ క్లబ్బు'లోఁ గలసికొనిరి. అందు వారు కొంతసేపు వార్తాపత్రికలం జదివికొని, యవలఁ గొంతసేపు ద్యూతవినోదముం జల్పి, పిమ్మట నొకఁ సెట్టు, టెన్నిసాటనాడి, యాఱుగంట లగునప్పటికి 'క్లబ్బు'వీడి, సర్కసుసాల దగ్గఱకు వచ్చి తమ కేర్పాటు చేసికొన్న 'బాక్సు'నందలి కురిచీలలోఁ గూరుచుండి వేడుక నుడు లాడుకొనుచుండిరి.

నాఁడు సర్కసుశాలయంతయు జనసమూహములచే నిండిపోయెను. మితిమీఱిన జనముండుటచేఁ గలకలధ్వని మిక్కుటముగానుండెను. రక్షకభటుల యదలింపు లతిశయముగా వినవచ్చుచుండెను. నియమితకాలమునకు నాటమొదలు పెట్టఁబడెను. మొదట నల్వురుయువకు లొకబాలికతో

రంగస్థలమునకువచ్చి చిత్రవిచిత్రాకారము లేర్పడునటు లొక
రిమీఁదనింకొకరు నిలువంబడిరి. అవల, గొందఱుబాలికలు
వచ్చి నాల్గుసీసాలమీఁద నొకబల్లకాళ్ళునాలుగును నిలిపి
యాశ్చర్యకరముగా నాటకము జల్పిరి. ఈయాటలన్నియు
నెంతనిపుణముగా నాడఁబడినను మనచెట్టియారు సెదరుఁకు
రుచింపకుండెను వారుకాంక్షించు పదార్థమింకను వారికంటఁ
బడనుంటచే వారు మిగులనాత్రపడుచుండిరి. తరువాత నప్ప
లసామివచ్చి మిగులబరువైన యినుపగుండ్లతోఁ జెండ్లాడియు
నద్భుతమైభరిని జేతులమీఁదను ముఖముమీఁదను దలపైని వానిని
నడిపించియుఁ గొంతసేపు మెప్పుదెచ్చెను. ఈయాటల నించుక
శ్రద్ధతో మనచెట్టియారులు చూచిరి. పిమ్మటఁ గొన్ని హాస్య
ప్రదర్శనములు, జంతుచర్యలు, మున్నగునవి జరగెను. అంత
గంగమ్మయు నప్పలసామియు వింతగా సింగారించుకొని రంగ
స్థలికివచ్చి నిలిచి సలాములు పెట్టిరి. చెట్టియార్లానందముతోఁ
గరతాళధ్వనులు గావించిరి. శాలయంతయు సంతోష నినాద
ములచే సందడించెను. గంగమ్మ నొకపలకపక్క నిలిపి యా
మెదేహమునకుఁ దగులకుండ దగ్గఱగా వాఁడికత్తులను విసరి
యప్పలసామి ప్రేక్షకుల మెప్పు దెప్పరముగాఁ బడసెను. తరు
వాత నతఁడు విల్లమ్ములనుబూని గంగమ్మ దేహభాగములం
దునుపఁబడిన క్రొవ్వువత్తిదీపములను గుఱిచూచి కొట్టి యా
ర్పెను. ఆవల నాగోపదంపతులు (ట్రిపీజ్, నాఁబడు సాధన
విశేషముమీఁద నత్యాశ్చర్యకరములగు (ఫీట్సు, చేసిరి.

గంగమ్మ యొడలికంటియుండు దుస్తులధరించుటచే నామె యవయవస్ఫూర్తి వెల్లడియయ్యెను. ఆమెచేయు వింతపనికెల్ల మనచెట్టియార్లట్టహాసముగావించుచు, 'గూడ్', 'ఎక్సలెంటు,' కాపిటల్, అని కేకలిడుచుండిరి. కడపటఁ గొన్ని క్రూరజంతువినోదములతో నాటముగిసెను.

అప్పుడు రామయ్యచెట్టిలేచి యాంగ్లభాషతో నాఁటి ప్రదర్శనముం గొనియాడుచు మననాయికానాయకుల ఖేలనానైపుణ్యమును శ్లాఘించి వారికిరువురకు స్వర్ణపదకములను గానుకలుగా నొసంగెను. ప్రేక్షకులెల్లఁ జప్పటులుగొట్టి యానందముతో నిండ్లకేఁగిరి. రామయ్యానుటేశముగారులు మాత్రమాఁగి శంభులింగముపిళ్ళగారిని బురస్కరించుకొని నేపథ్యాగారములోనికిఁబోయి కథానాయికానాయకులనుసందర్శించిచెరికొకయుంగరముంగూడబహుమానమిచ్చివారి యత్యద్భుతప్రదర్శనమున కేమిచ్చినను దీఱదని కొనియాడి వారల పీడ్కొని యీవలకు వచ్చుచు రామయ్యతనచిరునామాగల 'కార్డు' సామిపిళ్ళచేతికిచ్చి, గంగమ్మవంక సానురాగముగ వీక్షించుచు బయటికివచ్చెను. అంతవారిద్దఱుఁ దమబసలకరిగిరి. తనచేతి కీయఁబడిన 'కార్డు' చూచి యచ్చెరువొంది యప్పలసామి యిల్లాలితో నిట్టులనెను.

అప్ప—గంగూ! ఇప్పుడువచ్చినవారు చెట్టియార్లు. గొప్పధనవంతులు. కోటీశ్వరులు. వీరు మనప్రదర్శనా కౌశలమునకు మెచ్చియే యిల్లు మనల బహూకరించుచుండిరో,

లేక మఱియొకయుద్దేశముతో నట్లుచేయుచుండిరో తెలియ కున్నది. అంతటిధనవంతులు సాధారణముగా మనబోంట్లతోఁ మాటాడుటకేరారు. వీరిచర్య వింతగొల్పెడిని. ఇప్పుడు వీరిలో నాపడుచువాఁ డొకకార్డు నాకిచ్చినాఁడు. అందు వానిపేరు రామయ్యచెట్టియనియు వానిభవనము రామానందవిలాస మన బడునది పూనమల్లిబాటలో నున్నదనియు వ్రాయఁబడి యున్న ది. దాని నతఁడేల నాకిచ్చెనో తెలియకున్నది.

గంగ—వీరారెప్పుడేని వానిబసకుఁ బోవఁగోరిన, దారి తెలియుట కట్టులిచ్చి యుండవచ్చును. ఇఁక వారు పదకము లిచ్చుట కేవల సదభిప్రాయముతోనే యని నానమ్మకము.

అప్ప—వానియింటికిఁబోవ నాకేమిపని? కాదు. వానికే దోయితరోద్దేశము గలదు. దాని నారయవలెను.

గంగ—నేఁటియుదయమున నతఁడును రెండవవాఁడు ను మనగదుల కెదుటనున్న గదులలో నకుమదానిని బాడిగకుఁ దీసికొని యందేదో సామగ్రి యుంపించి వెడలిపోయిరి.

అప్ప—అలాగుననా? అటులేని గనుఁగొందము.

గంగమ్మ తనవేషము మార్చుకొనుటకు రహస్యాగార ములోని కేఁగెను. అకోటీశ్వరులు తన్నుఁబట్టియేయట్లు బహు మానపరంపర లిచ్చుచుండిరని యామె తలంపకపోలేదు. ఆగోవాంఛ్ల కోరుచూపులయర్థమును గ్రహింపకపోలేదు. కాని యవియన్నియు ననుమానప్రమాణములు. ఆపురుషులు మహాధనాఢ్యులు. వారింతూర్చి చులకనగా నిందమోఁప

రాదు. ఆకారణముచే నామె వారింగూర్చి యేమియుభర్తతోఁ బలుకకుండెను. అప్పలసామికి వారిచర్యయం దనుమానము జనించినదనియు గంగమ్మ గ్రహించెను. కాని యేకారణముచేతనో తాను దాటస్థ్యము వహించియే మాటాడెను. ఆమెకా యిరువురిలో నెవ్వరియెందేని యనురాగ మంకురించెనందుమా? అందునకు సాహసింపలేము. వారిచ్చు కానుకలకాసించి యట్లుండెనందుమా? ఆమె యట్టియాసఁగలది కాదు. ఇట్టిదని చెప్పఁజాలని యొకభావవిశేష మామెనోటికిఁ దాళమువైచినది. అప్పలసామి తలపంకించి యోజనాదృక్కులతోఁ గొంత తడవు కూరుచుండి భార్య యొప్పటి వాడుకదుస్తులతో నెదుటికిరాఁగాఁ దానును దుస్తులమార్చుకొని లేచి సన్నసువారి బండిపై భార్యతో నాసీనుఁడై బసకేఁగి నిదురించెను.

---

## ౮ అనుమానము.

మఱునాఁడు తెల్లవాఱినది. కర్మాగారములలోఁ బనివాండ్రను బిలుచుటకు యంత్రములు పెట్టుకూఁతలు, పట్టాలమీఁద నొండొంటిని దప్పించుకొని భిన్నమార్గములఁ బోవు ట్రాముబండ్లుచేయు కిరకిరారవములు, ‘మోరో’, యని కీఁచు కంఠములతో మజ్జిగనమ్మువారు వేయు కేకలు, మున్నగునవి వినవచ్చుచున్నను, మనకథానాయకుఁడు నిదురనుండి లేవ

లేదు. గంగమ్మ లేచి కాల్యంబులఁ దీర్చి మగనితో గాఫీపు చ్చుకొనుటకు వేచియుండెను. ,,గంగూ! భ్రష్టురాలవై తివా?" యని యప్పలసామి వేసిన కేక ప్రక్కగదిలోఁ గూర్చున్న గంగమ్మకు వినఁబడి యులికిపడి యప్పలసామికడ కేఁగెను. అతఁడింకను నిదురించుచునే యుండెను. నిద్రలోనట్లు కలవరించెను గాఁబోలునని గంగమ్మ యూహించి యతని కెట్టికల వచ్చినదో యని యనుమానపడుచు భర్తను జేతితో మెల్లఁగాఁదట్టి ,,చాలప్రొద్దెక్కినది లెండు" అని లేపెను. అతఁడు తుళ్లిపడి లేచి కన్నులు నులిమికొని భార్యవంకఁ దేఱిపాఱఁజూచి కొంతతడవుండి ,,గంగూ! నాకు నీమీఁదఁ బాడుకల యొకటి వచ్చినదిసుమా?" అనెను. ఆకల యెట్టిదని గంగమ్మ యడుగ నతఁడిట్లనెను. నీవు సర్కసులో 'ఫీటు' చేయుచుండఁగా నిన్నొక ధనవంతుఁడు చూచి మోహించి యేమాయోపాయముచేతనో తనయొద్దకి రావించుకొనినట్టులును, నీవు వానివెన్నాడి చనుచుఁ బోవుచుండ నాకంటఁ బడినట్లును, నేను నివ్వెఱపడి నిన్నుఁజూచి ,,అయ్యో! ఇట్లు చెడిపోయితివా?" యని పల్కినట్లును, కలఁగంటిని. దానినెల్ల గంగమ్మవిని, ,,అందుచేతనే కాఁబోలు మీరు, గంగూ! భ్రష్టురాలవై తివా?" యని పలువరించితిరి. మంచికలలే కనుచున్నారు. రాత్రి యీ చెట్టియార్లను గూర్చి తలపోయుచు నిదురించితిరి కాఁబోలు. మీయభిప్రాయము లెట్టులుండునో వానికనుగుణముగనే మీకుఁ గలలును గల్గునుగదా?" యనెను. అప్పలసామి తలపంకించి

లేచి కాలకృత్యములను నెఱవేర్చుకొని భార్యతో కాఫీపుచ్చుకొని నాఁటియుదయమున వచ్చిన టపాయుత్తరములను వార్తాపత్రికలను జదువుకొనుచుఁ గూరుచుండఁగా శంభులింగము పిళ్ళగారు వచ్చి "సామిపిళ్ళే! మన మొకసారి సర్కసుశాలకుఁ బోవలయును. ఒకతొందరపని గల"దని చెప్పెను. అప్పలసామి దుస్తులుధరించి తనయజమానునితో బయలుదేఱి వెడలెను. వారు మేడదిగి వీధిగుమ్మముకడకు వచ్చుసరికి నటేశము రామయ్యచెట్టిగారులు మోటారుదిగి లోనికి వచ్చుచుండిరి. అప్పలసామి యించుకనిర్వేదముతో వారివంకఁజూడ, వారు తెచ్చికోలువికాసముతో "గుడ్ మార్నింగ్ ప్రొఫెసర్!" అని సమీపించి కరముస్పృశించి, "ఇంత పెందలకడనే యెచ్చటికిఁబోవుచుంటిరి?" అని ప్రశ్నించెను. శంభులింగము పిళ్ళగారు సర్కసుశాలకొక తొందరపనిమీఁదఁ బోవుచుంటిమని మాటువలికి చెట్టియార్లకు వందనమిడి తనకారుమీఁద నప్పలసామి నెక్కించుకొని వెడలిపోయిరి. అప్పలసామి వెనుక వెనుకకుఁ జూచుచునే పోయెను.

నటే—తమ్ముఁడా! నేఁడు నీరొట్టె నేతిలోఁబడినది. సామిపిళ్ళ యింటిలో నుండఁడు. గంగమ్మాళుతోఁ గొంతసేపు ముచ్చటలాడవచ్చును.

రామ—సామిపిళ్ళ మరల బసకు వెంటనేవచ్చునేని మనము కొంచెముసేపు వార్తాపత్రికలం జదివికొని పోవలసి యుండును.

నటే— వారింతలోరారని నానమ్మకము. నేఁడు మన ము బయలుదేఱునపుడు తెల్లనిపాలాపును దోలుకొని యొక గొల్లది యెదురువచ్చినది. మన కార్యము జయప్రదముగా సాగుననియే నాకప్పుడు తోఁచినది.

రామ—తినఁబోవుచు రుచులెందులకు? వెళ్ళుచున్నాముగదా, చూతముగాక!

అని వారిరువురు మేడమీఁది కేఁగి తమగదిలోఁ బ్రవేశించిరి. గంగమ్మ యేదో గృహకృత్యవిశేషమందు నిమగ్నచిత్తయై యుంటచే వారిరాక గమనింపలేదు. తమరాక యామె కెఱిఁగించు నుద్దేశముతో రామయ్య కొంతసే పీలపాటఁ బాడియుఁ గొంతదడవు సోదరునితోఁ బెద్దగొంతు పెట్టి భాషించియుఁ బ్రయాసపడెను. కాని యామెవినలేదు. తుదకు వారేమార్గముం గానకపోవుటచే ‹‹సామిపిళ్ళే!›› ‹‹సామిపిళ్లే!›› యని పిలిచిరి. గంగమ్మ భర్త యెక్కడికో వెళ్ళెనని చెప్పుచుఁ దలుపు తెఱచి చూచెను. చిఱునవ్వుతో రామయ్య యామెవంకఁ జూచెను. ఆమె మరల ‹‹వారు శంభులింగముపిళ్ళగారితో నెచ్చటికో వెళ్ళిరి. వారితో నేమేని పనువమందురా?›› యని యడిగెను.

రామ—(సానురాగముగఁ జూచుచు) ‹‹అవును. మఱచిపోయితిమి. వారు మాకు దారిలోఁ గనఁబడియేయున్నారు. వారెంత సేపటికివత్తురు?,,

గంగ—భోజనసమయమునకు వత్తురు. భోజనము పదిగంటలకు.

రామ—అలాగునా? గడచినరాత్రి మీప్రదర్శనము మిగుల మనోహరముగా నున్నది. దానిని గొనియాడుటకు నాభాష చాలదు.

గంగ—మీరందఱుకు మాయం దవ్యాజకరుణ యుండుటచే శ్లాఘించుచుంటిరి. కాని మేముచేయు పను లంతవింతలుగావు.

రామ—మాయవ్యాజకరుణగాదు. మీయవ్యాజకరుణయే మామీఁదఁ బ్రసరించుటచేత మేముకృతధన్యులమైతిమి. సర్కసుకంపెనీలలో స్త్రీలుచేయు వింతపనులెన్నో కాంచితిమి. కాని మీరుచేయు విన్నాణపుఁ జేష్ట లెచ్చటను జూచియుండలేదు. అందుచేత సర్వదా మీ సుందరవిగ్రహమే మాకన్నులఁ గట్టినట్లుండును.

గంగ—తమసదభిప్రాయమున కెంతయుఁ గృతజ్ఞురాలను.

రామ—కృతజ్ఞత మాటలలోఁ జూపరాదు.

గంగ—మఱి దేనితోఁ జూపగలము? మీరు కోటీశ్వరులుగావునఁ బదకములిత్తురు. మేమేమీయఁ గలము?

రామ—మీరు తలఁచుకొన్నఁ గోటిపదకముల విలువ గలుగు మీమనసే యీయవచ్చును.

అని మరల మందహాసమొనర్చి ప్రేమైకదృక్కులం బఱపెను. గంగమ్మ కిప్పుడు వారి యభిప్రాయము తెల్లఁగా బోధపడినది. ఇఁక వారితోఁ మాటాడరాదని యూహించి, "అయ్యా! నాకు సెలవిండు. నేను బయలు చక్కఁబెట్టుకొన వలసియున్నది." అని తలుపు గొండెము వైచుకొనెను. "ఇంకొకసారి మీదర్శనమునకు వత్తునులెం" డనుచు రామయ్య తనగదిలోనికిఁ బోయెను. సోదరుఁడు కడునిపుణముగా భాషించినందునకు నటేశము మిగుల సంతోషించెను. ఆమె తన మాటలకుఁ గోపము చేయలేదనియు, మనసిగ్గుచేఁ గడపటఁ దలుపువైచుకొన్నదనియు, ముందుముందు తనవశము కావచ్చుననియు, రామయ్య పలికెను. తనవంతుకూడఁ బ్రయత్నము చేసి చూచెదనని నటేశము పలికెను. ఇట్లుసంభాషించుచు వారొక గడియదాఁకఁ గాలయాపన మొనరించి తలుపునకుఁ దాళము వైచి తమ బసలకుం జనిరి. గంగమ్మ లోనికేఁగి గవాక్ష రంధ్రములగుండఁ గోటీశ్వరుల చర్యలు గమనించి, వారిలోఁ దనతో భాషించిన యువకునకుఁ దనపై మోహము జనించినదని కనిపట్టి, తనలోఁ దానిట్లు వితర్కింపఁజొచ్చెను:—

"ఆ యువకుఁడు గడుసుందరాంగుఁడు. లక్ష్మి వాని యింటఁ గాఁపురమేయున్నదని తెలియవచ్చుచున్నది. అట్టి వాఁడు నాపై వలపునిలిపినట్లు తోఁచుచున్నది. నన్ను వశమొనర్చుకొనుటకుఁ బలువితముల యత్నించుచున్నట్లు కనఁబడుచున్నది. పాప మావెఱ్ఱి మోహము చేతనే కాఁబోలు మా

కంపెనీవారి యాటలకెల్లవచ్చి నా కేదోయొకబహుమానము ప్రతిపర్యాయమును ముట్టఁజెప్పుచున్నాఁడు ! నిన్నరాత్రియే యొకవిధమైన యనుమానము నాభర్తకు వారిమీఁదఁ బొడమినది. వారు నాతోనే కొంతసంభాషణము చేయుట గన్నను, దానింగూర్చివిన్నను, దదనుమానము వృద్ధియై యతనిమనస్సు చెడిపోవును. ఇప్పుడేమి సేయుదును? వారిరాకనుగూర్చి నాభర్తతోఁ జెప్పనా? మాననా? చెప్పిన, ననుమానము హెచ్చును. మానిన, వారే తమరాకనుగూర్చి నాభర్తతోఁజెప్పియుందురేని, నాభర్తకు నామీఁదఁగూడ నవిశ్వాసము గలుగవచ్చును. (కొంతతడ వాలోచించి) వారికి నామగనితో మాటాడు పనియేయున్నయెడలఁ దాము వచ్చినట్టులైన నా భర్త కెఱింగింపుమని నన్నుఁ గోరియేయుందురు. కోరలేదు. ఇఁక వారిరాక నాకొఱకే. వారు కేవలము నాకోసమే వచ్చిరి గావున, నాతోసంభాషించినట్లు తెలుపరు. కనుక నేను నా నాథునితో నేమియుఁ బ్రసంగింపకుండుటయే మేలు."

ఇట్లుభావించి యామె గృహకార్యములు చక్కఁబెట్టుకొనుచుండెను. కొంతతడవునకు నప్పలసామి బసకేఁగుదెంచెను. భార్యచూపులలోఁ గలఁత యేమేని పొడచూపునేమో, యాచెట్టియార్లనుగుఱించి యామె తనతోనేమేని చెప్పునేమో, యని యతఁడు కొంతసేపు చూచెను. కాని యేమియు నామె నోటినుండి రాలేదు. ఆమెచూపులలోమాత్ర మొకవిధమైన కలవర మాతనికిఁబొడఁగట్టక పోలేదు. వారిరువురును భోజనము

సేయఁ గూర్చుండిరి. అప్పు డప్పలసామియే యిట్లు మాటాడఁదొడఁగెను.

అప్ప—గంగా ! నిన్నరాత్రి మనకుఁ బదకములిచ్చిన చెట్టియార్లు నేఁడు తమగదిలోనికివచ్చిరా?

గంగ—(కలవరమించుక చెక్కుటద్దములఁదోఁప) వారు గదిలోనికివచ్చి కూరుచుండినటులే నాకుఁ దోఁచినది. వారి పకపకనవ్వులు, పెద్దగొంతుమాటలు కొన్ని వినఁబడినవి. వారు మిమ్ముఁబిలిచినట్లు ధ్వనివింటిని. కాని తలుపుతీయకుండఁగనే మీరింటలేరని జవాబిచ్చితిని. అంతియే.

అప్ప—(తలపంకించి) అటులైన వారు మరలఁ బిలిచిరా ?

గంగ—మరలఁ బిలుచుటేమి ?

అప్ప—వారు దారిలో నాకుఁగనఁబడిరి. నాతోమాటాడిరి. నేనింటలేనని యెఱింగియు మరల నన్నేలపిలువవలయు ? ఇచ్చట వారియుని కేదోదురాలోచన మున్నదనియే తలంతును.

గంగ—(మనస్సు దృఢపఱచుకొని) వారి దురాలోచనములు మనల నేమిచేయఁగలవు ? మీరేమియు భయపడ నక్కఱలేదు.

అప్ప—ఏమో ! ఏమితెలియును ? ఇట్టి మహానగర నివాసమెట్టిముప్పునకు వచ్చినదో ! నెలకునాల్గువందలవంతునఁ

బుష్కలముగా ధనములభించుచున్నను గోపాలపట్టణమం దున్న మనశ్శాంతి యిచ్చటఁ గలుగకున్నది.

గంగ—మీరు వెత్తివెఱపులు పెట్టుకొనవలదు. వారు నాకేమియు నెగ్గుచేయఁజాలరని నమ్ముఁడు.

అప్ప—కానిమ్ము. రోటిలోఁదలఁదూర్చి రోకటిపోటు నకు వెఱవఁదగదుగదా ? మొదట నేనిచ్చటికి రానియ్యకొంట యే తప్పు. వచ్చినతర్వాత నేమివచ్చినను సిద్ధపడవలెను. ఇప్పుడు గతజలసేతుబంధన మొనర్చుటవలన లాభములేదు.

అని పలుకుచుఁ దిండిఁదని లేచెను. గంగమ్మమనస్సు కూడ నయ్యో ! పిరిరాక డాఁగురించితిఁగదా, యని కుందు చుండెను.

---

౯ పరిచ్ఛేదము.

---

ఇట్లు లనుమానమనస్సుతో నప్పలసామియు నానాఁట విశేషాదరభావముతో గంగమ్మయుఁ జెట్టియారుసోదరులను గాంచుచుండిరి. వారు ప్రతిదినము నాగదిలోనికివచ్చి యేవో ముఖ్యరాజకార్యములు కొన్ని నవరించుకొనుచున్నట్లు నటించి యప్పలసామి యింటలేని తఱింగని యిద్దఱు తడవు గంగాబా యితో ముచ్చటలాడుచు నరుదుగా నప్పలసామితోఁగూడఁ

గపటస్నేహవృత్తిని భాషించుచుఁ బోవుచుండిరి. వారికి గంగమ్మతోఁ బరిచయము, చనవు, క్రమముగా స్నేహము, కుదిరెను. వారిలో సతీశ మామెకుఁ గావలసిన పుష్పమాలికలొసంగుచు నామెకోరిన రవికలగుడ్డలను జీరలను దెప్పించి యిచ్చుచు నామెచేరికను సంపాదించెను. రామయ్య విలాసచేష్టలచేత వింతమాటలచేతను నామెకుహృదయరంజనముఁ గావించుచుండెను. ప్రతిదినమామె బజారునకుఁబోయి తనకిచ్చవచ్చిన వస్తువులను గొనితెచ్చుకొనుటకు భర్త మున్నె యామెననుమతించుటచేత, సతికి వానింగూర్చిన యనుమానము లేకపోయెను. ఆమె తనయెదుటనాడు కపటనాటకమంతయుఁగాంచి యతఁడు భాగ్యనిర్దోషినియేయనియు నామెంజెనకి నాదుష్టులవశము గాదనియు నమ్ముచుండెను.

ఈరీతిగాఁ గొంతకాలము గడచెను. డిశంబరునెల వచ్చెను. ఆనెల పదేనవనాఁడు 'పార్కుఫే' రనఁబడు సంత గవర్నరుగారి గంభీర ప్రారంభోపన్యాసముతోఁ బౌరుల యుత్సాహాధిక్యముతో మొదలుపెట్టఁబడెను. ఆయేఁట నచ్చట దేశీయమహాజనసభ జరుగనుండుటచేత నేఁటేఁటకన్న నెక్కువ వినోదములు నిర్మింపఁబడుచున్నవి. ప్రతిరాష్ట్రమునుండియు మహాజను లెందఱో రానై యున్నారనియు, వారింజూచుటకును సభావిశేషములంగనుటకును జెన్నరాష్ట్రమునందు వివిధ మండలమునుండి పెక్కండ్రు ధనవంతులు వత్తురనియు నెంచి సమస్త వస్తువులయందును నాఁడెంపు సరకులన్నియుఁ

దెచ్చి వర్తకులు సంతవీధులలోఁ జెక్కుదుకాణములను నెల కొల్పిరి.

ఈసంత 'మూన్ మార్కెట్' అనఁబడు నంగడికి వెనుక నున్న మైదానములో నేర్పాటుచేయఁబడెను. సంతపట్టునకుఁ జుట్టును గట్టి దడిఁగట్టి కావలివాండ్రను నియమించియు న్నారు. ఆయావరణములోఁ బ్రవేశించుటకొకయణాయరూపాయ పురపాలకసంఘవారికిఁ జెల్లింపవలసియున్నది. దానింజొచ్చు వారికిఁ దొలుత 'మేత్రైన మైసూరుపిత్తడిసామాను' విక్రయించు నంగడికనఁబడును. అందుఁ బలుకరముల పాత్రిసామగ్రి పుత్తడినిగ్గులనుమించు మించులచే వెలయునవి కొన్నియు, వెండి పూఁతపూయఁబడి శుద్ధరజతపాత్రిలేమోయను భ్రమం గొలుపునవి కొన్నియుఁ గననగును. అవల నెడమప్రక్కకేఁగ 'బీడీ' లనఁబడు చిఱుచుట్టలమ్ము నంగడి చూపట్టును. ఆయం గడి యింటికప్పుమీఁద నొకజంత్రపుబొమ్మ యమర్చఁబడెను. ఆబొమ్మ యొకపాశ్చాత్త్య నాగరకుఁడు మహాసంతోషముతో 'బీడీ'గాల్చుచు దానిపొగను విలాసముగా విడుచుచున్నట్లు కనఁబడును. విద్యుచ్ఛక్తిచే నాకీలుబొమ్మ బీడీ మొదట వ్రేళ్ల సందున నిరికించిపట్టును. దాని కాయంగడివాండ్రలో నొకఁడు నిప్పుముట్టించును. ఆబొమ్మ మెల్లమెల్లఁగా 'బీడీ'ని నోటిదరికిఁజేర్చి నోటఁబెట్టుకొనును. అవల రెండుమూఁడుగ్రుక్కల పొగఁబీల్చి విలాసలీల దానిని వదలివేయును.

మఱికొంత దవ్వరుగ నొకకాఫీదుకాణము పలురకముల పటములతోను, నద్దములతోను నలంకరింపఁబడినది కన్పట్టును. దానికి ముంగలనే యొకబల్లమీఁద కాఫీ, టీ, కోకో, మున్నగు పానీయములయు, మిఠాయి, పకోడీ, మున్నగు తినుబడి వస్తువులయు వెలలు తెలుపుపట్టిక వ్రాయఁబడి యుండును. అందుఁజొచ్చువారికి హాయిగ గ్గించుటకు విద్యుచ్ఛక్తిచే వీవఁబడుతాళవృంతములు, చక్కని కురిచీలు, న్యులైనమేజాలు గలవు. పైనిబేర్కొనఁబడిన పానీయములేకాక, యందు ఐస్క్రీమ్, నాఁబడు మంచుఁబానకము, నానాఫలరసాయనమగు ఫ్రూట్ సాలడ్, అనునదియు, 'సేమియా' యనఁబడు పరమాన్నమును దొరకును. ధనవంతులాపదార్థములను గొని ముదితహృదయులగుదురు.

ఇంకఁ గొంతదూరమేఁగ వివిధదేశములనుండి తెప్పింపఁబడిన బట్టలు విక్రయించు నంగళ్ళవరుస యుండును. అందొక్కొక నొక్కొకరీతి భావముం బ్రకటించు చిహ్నముల ప్రేలాడఁగట్టుకొందురు. మఱియుఁ గొంతమేరచన బంగారు వెండి వస్తువుల దుకాణములుండును. అవల గడియారముల యంగళ్ళుండును. అటుపిమ్మట నానాదేశములనుండి వచ్చిన జోళ్ళనమ్ము నాపణములుగలవు. విదేశములనుండి రావింపఁబడిన వింతవిన్నాణపు సరకులెన్నని విక్రయించెడు దుకాణ

ములు పెక్కు గలవు. ఇట్టులా సంతపట్టు చుట్టు విపణివీథు
లమర్పఁబడి యుండును.

మధ్యప్రదేశమందు శ్రీరోపలములచేఁ జిత్రింపఁబడిన
మహారాజుల విగ్రహములు కొన్ని గలవు. అందు వేంకటగిరిమ
హారాజుగారుతదుత్సవమునకు ఘనవిరాళము లిచ్చియుండెను
గావున, వారి దివ్యరూపమందెల్ల శిలావిగ్రహముండెను.
అప్పటి గవర్నగారీసంత జయప్రదముగా జరుగుటకై చాలఁ
బ్రోత్సహించిరిగావున వారి రూపవిగ్రహముం గలదు. ఇట్టు
లుదారగుణాంచితుల దివ్యసుందరవిగ్రహము లెన్నో వారియౌ
దార్యమును జిత్రకారుని రచనాసౌందర్యమును వెల్లడించునవి
యుండుండెను.

వేరొకపట్టున దేశీయ పారిశ్రామిక విద్యావైశారద్య
ముందెల్పు కళావస్తువులు, నేఁతసరకులు, లోహమయపదార్థ
ములు, వ్రాఁతపుల్లలు, (పెన్సిల్సు) సిరాబుడ్లులు, కాగిత
ములు, మున్నగు వస్తువుల ప్రదర్శనశాలలు గలవు. అందెడ
నెడ లలితకళలలోఁ జిత్రలేఖనమందు నైపుణ్యము గలవారు
రచియించిన మనోహరపటము లునుపఁబడిన తావులును గల
వు. అందందుఁ జూపఱుల నేత్రముల కానందముంగొల్పు
జలయంత్రములు, కృత్రిమోపవనములు, నాటకములు, సినీ
మాలు, మొదలగునవి యేర్పాటు చేయఁబడియుండెను.

రేల నాసంతపట్టునను నొకగొప్పదివ్వె చంద్రకాం
తుల నధఃకరించు కాంతులు గలది యెత్తయినతావున నిలుపఁ

బడును. దుకాణములయందే కాక యితరస్థలములయం దును నడుమనడుమ బహుళదీపికలు తారానాథునిసేవించు నక్షత్రములవంటివి యనేకములు గలవు. దీపములన్నియు వెల్గింపబడినవెనుక దాని సౌందర్యము చూచితీరవలయునుగాని వర్ణింప నశక్యము. జాముర్రాత్రి మీరినతర్వాతఁ గాల్పఁబడు బాణసంచులంజూడఁ గన్నులపండు వగును.

వానిలో నొకటివెల్గింపఁగా నాంగ్లభాషతో ప్రేక్షకు లకు స్వాగతము, అను నక్షరశ్రేణి వింతరంగులను కాంతు లతో నేర్పడును. ఇంకొకటికాల్పఁగా రంగురంగుల ముద్దలను నల్దిక్కులకు వెదఁజల్లుచు గిరగిరఁ దిరుగు చక్రమొకటి చలిం చును. మఱియొకటి యగ్నిదరికాల్పఁగావీణియవాయించు ముఁ బద్మాసనముపైఁగూర్చున్న సరస్వతియగును. వేఱొకటి యం టింపఁగాఁగమలాలయయగు లక్ష్మియు నామెకు క్షీరాభిషే కమొసఁగు గజద్వయమును నేర్పడును. మఱొకటి పూవులు కాయలు, పండ్లు, మున్నగువానిచే శోభించు వృక్షరాజము గును. ఇంకఁగొన్ని దశావతారములుగను, గొన్ని పురాణగాథా బోధకమగుదృశ్యములుగను, నేర్పడును. ఇట్టివి పత్తెయింగుల బాణసంచులు కాల్పఁబడినపిమ్మటఁ గట్టకడపట శ్రీసార్వభౌమ దంపతుల విగ్రహముల వెల్లడించునది వెల్గింపఁబడును.

ఇట్టు లానంత యొకనెల జరగును. దానిం దిలకించు టకు సామాన్యజనులేకాక మహారాజులునైతము తమతమ కుటుంబములతో వత్తురు. ఇతరసమయములయం దొరులకు

దర్శనమీయని ధరణీపాలు రాతిరునాళ్ళయం దెల్లరకు బాహా
టముగా దర్శనమిత్తురు. తమ యధికారగర్వమంతయు నుడిగి
సంచరింతురు. దుష్టులగు జారచోరకుల కట్టి మహోత్సవసమ
యము మిగుల నుపకరించునని వేఱుగ వ్రాయనక్కఱలేదు.
కాని వారిహోవడి మాన్పుటకు దొరతనమువారు నియమించిన
రక్షకభటులును, నైచ్ఛిక సేనాసంఘసభ్యులుకొందఱును జాలఁ
దోడ్పడుచుండిరి.

ఇట్టియుత్సవముం జూచుట కొకనాఁడు గంగమ్మయు
సర్కసుయజమానుల భార్యలును గలసివెళ్ళిరి. అప్పలసామి
ప్రతిదినము సాయంకాలముఁ బోయి యూయూవినోదములం
దిలకించియే వచ్చుచుండుటచే భార్యతోఁ గూడి యేఁగలేదు. భా
ర్యకుఁ దోడుగాఁ దనమిత్రుల యాఁడువాండ్రు కలరుగదా
యని యెంచి యతఁడామెను నిర్భయముగా విడిచిపెట్టెను.
నాఁడే మనచెట్టియారుఁలును సంతకేఁగుట తటస్థించినది. స్నే
హితురాండ్రతోఁ గూడిన గంగమ్మ రామయ్య కెదురుపడె
ను. అతఁ డులికిపడి యాఁగి యామె యేదుకాణమున కేఁగిన
నాదుకాణమునకుఁ దానును నటేశముతోఁ బోవఁజొచ్చెను.
ఒకయంగడికడ జనసమ్మర్దము విశేషముగా నుండెను. గంగ
మ్మ చెలికత్తె లెటులో తోసఁ బ్రవేశించిరి. కాని గంగమ్మ
మాత్రమీవల నుండిపోయి యెదుటఁ గనఁబడు వస్తువుల
బేరము చేయుచుండెను. ఆమెతో మాటాడుట కిదియే తగిన
యదనని నటేశము సోదరునితోఁ జెప్ప, రామయ్య, ‘గంగా

బాయి! పార్కుఫేర్ చూడవచ్చితివా?' యని ప్రశ్నించెను. ఇంతవఱకు రామయ్య యామెను వెన్నాడుచుంట యామె యెఱుఁగదు. ఆతఁడట్లు ప్రశ్నింపఁగా నామె యులికిపడి యతని వంకఁజూచి, 'అవునండీ! తమరుకూడ నందుకొఱకే వచ్చితిరా?' యని తిరుగ నడిగెను. రామయ్య, 'అవునటులే' యని మాఱ్వలుకుచు గంగమ్మ దగ్గఱకు వెళ్ళి, "నీబస కెదుటనే ప్రతిదినము నేను సంచరించుచున్నాను, నీతో సావకాశముగా భాషించుటకును నాహృదయగతాభిప్రాయములన్నియు వెల్లడించుటకును దగిన సమయము చిక్కుటలేదు. నేఁ డప్రయత్నముగా నీ వొంటినుండఁ గాంచఁగల్గితిని. నీవు నాయందుఁ గృపవహించి నేఁటిరాత్రిమున నొంటిమై, బాణసంచులఁజూచు నెపమున, నిచ్చటి కేతెంతువేని, నాహృదయమందుఁ జిరకాలమునుండి యిమిడియున్న నాకోరికయొకటి నీతోఁ జెప్పి నాయాశయములనెల్ల నీకు నివేదింపవలయునని కోరుచున్నాను. నామాటలు నీకు నచ్చునేని నన్ననుగ్రహింపవచ్చును; లేనిచోఁ ద్రోసిపుచ్చవచ్చును. వినినఁజాలు" నని పల్కెను. గంగమ్మ యంతయు విని కొంతతడ వూరకుండెను. ఆమెహృదయము డోలాందోళితమయ్యెను. కోటీశ్వరుఁడు తన్ను వలచి రమ్మనుచున్నాఁడు. రానా రాకుందునా యని యొకసారి తలఁచును. ఎంత కోటీశ్వరుఁడైనను నామగనికన్న నాకుఁ గూర్చువాఁడగునా యని యింకొకసారి యూహించును. "ఏల పలుకవు? మౌనమర్ధాంగీకారమని తలఁపవచ్చునా?" యని

యువతియు మరలనడుగ నామె కాలోచించుకొనుట కవకాశము చాలమి నిట్టులనె. "అయ్యా! మీరు మాటాడఁదలఁచుకొన్న మాటలిప్పుడే చెప్పరాదా? రేయి నొంటికత్తెనై వచ్చుటకు నామనఁ డనుమతించునా? నా చెలికత్తెలతో నేను దారిఁ దప్పితినందును. మీ రేదేని యేకాంతస్థలముం జూపుఁడు. అక్కడకేఁగి మాటాడుదము." ఈమాటలువిని రామయ్య నలువలంకులఁ జూచెను. ఎచ్చటఁజూచిన జనులు తండోపతండములుగఁ గన్పట్టుచున్నారు. ఇప్పుడాడిన మాటలే యెవ్వరేని వినియుందురేమో యని యువతియు మిక్కిలి మెల్లని కంఠధ్వనితో మాటాడెను. రామయ్య మహాధని యగుటచేతను, గంగమ్మ వ్యాయామ క్రీడావిశారదలలో నగ్రగణ్య యగుటచేతను, జెన్నపురియందు వారిరువురి నెఱుఁగని వారుండరు. వారొక యేకాంతస్థలమున భాషించుచుండుట యెవ్వరికంటనేని బడినయెడల నింద మోపకమానరు. దాన రామయ్యకుఁ గాకపోయినను గంగమ్మకేని చేటుగలుగును. కావున రామయ్య యేమియుఁ బాలుపోక చూచుచుండెను. అప్పుడు నయువతి యిట్లనియె. "తమ్ముఁడా! మాతమ్ముఁడగు సుందరము చెట్టి పెట్టిన హార్మోనియముల యంగడి యీపక్కనే గలదు. అందు జనులంతగా నుండరు. నేనక్కడికి ముందుగాఁజని యెవ్వరులేకుండఁజూచి మిమ్ముఁ బిలిచెదను. అచ్చటికి రండు. మీరాయిష్టవచ్చినంతసేపు మాటాడికొనవచ్చు" ననెను. రామయ్య ప్రముదితుఁడయ్యెను. గంగమ్మ వెళ్లెయునియె. మాయాపిశాచ

మూమె నప్పుడే యావహించెను. కాని సహజసౌశీల్యము గల దగుటచే దానిని జయింప యత్నించుచుండెను. నకేశము తమ్మునిి యంగడి కేఁగి యొకరహస్యస్థల మేర్పఱిచివచ్చెను. రామయ్యయు గంగమ్మయు నందేఁగి యిట్లు సంభాషించిరి.

రామ—నీ విన్నినాళ్ళు నాయందు దయగలిగి నేను నీతో భాషించుటకు సమ్మతించినందులకు నేను మిగులఁ గృతజ్ఞుఁడను. నీతో మాటాడినకొలఁది, నీ ముఖారవిందముం జూచినకొలఁది, నాకు నీపై నిగ్గు మోహ మతిశయించుచున్నది. నా భార్యకు నాకును బడక, నేనామెను శాశ్వతముగా విడిచిపుచ్చితినని మున్నే పచియించి యుంటినిగదా? నా యపార ధనసంచయము లనుభవించుట కామె నోఁచలేదు. నా హృదయము నీయందు లగ్నమైయున్నది. నీవు నాదండనుండి నన్ను నిరంతర సౌఖ్యవీచికలం దేలించుట కంగీకరింతువేని, నాయాస్తియంతయు నీవశ మొనర్తును. నా దేహమే కాక నా సర్వస్వము నీకర్పించుకొందును. నా యందుఁ గరుణించి యంగీకరింపుము.

గంగ—అయ్యా! మొదటినుండియుఁ దమచర్య గమనించుచుంటిని. తమవంటి మైశ్వర్యవంతుల స్నేహము నాకుఁ గల్గుట నాయదృష్టమే. కాని చిన్ననాఁటినుండియు మనసారఁ బ్రేమించి వరించిన నానాథుని విడుతునేని నాయట్టి ద్రోహిని వేరొక్కతె యుండునా? మీరిట్లు సాహసించి నన్నడిగినందు

లకు నేనన్యథా తలంపను. మన సమాగమము గుహ్యముగా నుంతును. తమరుమాత్రము నాయెడ నాసవీడుడు.

రామ — నీవంగీకరింపకున్న నేనాత్మహత్య కావించుకొన వలసివచ్చును. నేను గన్నుగీటువప్పటికి నాపాదాంతికమునకు వచ్చువాండ్రలు పన్నెండుగు రెందఱున్నను నేనొల్లను. నాకునీతోడి పొందే కావలయును. నీవు నిక్కముగా నాకోర్కె దీర్పకుందు వేని, నా పేరుమచిహ్నముగా నాయాస్తియెల్ల నీపేరవ్రాసి యిచ్చి నేనాత్మహత్య చేసికొందును.

గంగ — మీా రంతటితెగువకు గడంగ నక్కఱలేదు. మీాకు నాపయిం గల్గిన యకారణకరుణకు నేను గృతజ్ఞనని మరల వక్కాణింతును.

రామ — కృతజ్ఞత కార్యరూపముం దాల్పవలయుం గదా ?

గంగ — దానికిప్పుడు నేను జేయునదేమియు లేదు. నే నింకను గొన్నాళ్ళాలోచించినంగాని మీాతో నేమియు మనవి చేయంజాలను.

రామ — ఎన్నాళ్ళంగుమన్నను నాగెదను. నీవుమాత్రము నన్నుం గైకొనకతప్పదు. నీదర్శనము ప్రత్యహముంజేయుచుం దును. ఏనాండు నీవంగీకరించి నావెంటవత్తువో, నాండుజన్మ ముతరించునని భావింతును.

గంగ — సరియే. మూాతములెండు. ఇప్పుడుగాదు.

ప్రతిదినము —

అని యింకను జెప్పఁబోవుచుండ నామె కేదో కంఠధ్వని, భర్తయెలుఁగువంటిది, వినఁబడ నాఁగిపోయెను. అదే మట్టులుంటివని రామయ్య యనుగఁ దన యనుమానముఁ దెల్పెను. రామయ్య యించుక యీవలికి వచ్చిచూడఁ బక్క గదిలో నప్పలసామియు రామస్వామి మొదలియారును హార్మోనియములను బేరమాడుచుంట గాంచెను. అతఁడు కలఁతపడి లోనికేఁగి "నీయనుమానము నిజమే. కిమ్మనక యుండు" మనెను. సర్కసు బ్యాండులోని శ్రుతికుపయోగించు హార్మోనియము వంటి వాద్యమొకటి చెడిపోయినది. వారు క్రొత్తదికొనఁగోరి యిందువచ్చి బేరమాడుచుండిరి. సుందరము చెట్టి లోన గంగమ్మయుంట మఱచి వారికా వాద్యములఁ జూపుచు మాటాడుచుండెను. రామయ్య యొకసారి యీవలకువచ్చి యేఁగుట యప్పలసామి కించుక పొడఁగట్టెను. అవల నతఁడా యగారమంతయుఁ గలయఁదిరుగుచుఁ దక్కుంగల వాద్యవిశేషములం దిలకించుచుండఁ దనభార్యచేతి గాజులచప్పుడు వినఁబడెను. అది భ్రమయని తలఁచెను. రెండవ యగారములోనికిఁబోయి చూడఁగోర, సుందరము చెట్టి 'వల దందెవ్వరు లేవు. నామిత్రులు మాటాడుకొనుచున్నా'రనెను. అప్పలసామి దానిం జూడక మొదలియారుతో నాయుంగడివిడిచి యీవలకువచ్చెను. అప్పుడు 'సామిపిళ్ళె వెళ్ళినాఁడు. ఇఁక భయములే' దనుమాటలు వినఁబడెను. అప్పలసామి కాశ్చర్యముతోఁచెను. మోఁజ నాదృష్టితో నతఁడు మొదలియారుతో మోటారెక్కఁబోయెను

గంగమ్మ బ్రతుకుజీవుఁడా యని యీవలఁబడి నెయ్యురాం డ్రకై నెమక నారంభించెను. వారును నీమెకొఱకు వెదకు చుండిరి. తుదకు మూర్మార్కెట్టులో నందఱుఁ గలసికొనిరి. కొనఁదలఁచుకొన్న సామాగ్రి కొని గంగమ్మ హితురాండ్రతో నింటికేఁగెను.

---

## ౧౦ సమ్మతి

—(o)—

ఇంతకుఁ బూర్వ మప్పలసామి కాచెట్టియార్లమీఁదనే కాని తనభార్యమీఁద నెట్టియనుమానమును లేకుండెను. వా రెట్టి కూళలైనను దనభార్య యగ్నిహోత్రమువలెఁ దాఁకరాని దని యతని నమ్మకము. తనపై నామెకుఁగల ప్రేమ కెట్టిభంగమును గలుగదని యతని దృఢవిశ్వాసము. ఇట్టులుండ, నేఁడతనికి గోచరించినవానిం బట్టిచూడ నతనిహృదయము పరిపరివిధముల నాందోళింపఁజొచ్చెను. అతఁడుబస కేఁగి దుస్తులు మార్చుకొని కాస్మొపోలిటన్ క్లబ్బున కేతెంచెను.

కాస్మొపోలిటన్ క్లబ్బు చెన్నపురిలోఁగల ఘనులెల్లఁ గూడి వినోదలీలఁ గాలముంగడపు భవనరాజము. స్టార్ సర్కసు యజమాను లందుసభ్యులు. వారు మన కథానాయకునిఁ గూడ సభ్యునిం గావించిరి. అతనికిఁ బౌరులలో నున్నత స్థితియందున్న వారితో నెల్ల నీసభ్యతవలనఁ బరిచయము గలి

గెను. అతఁడు తఱుచుగా నక్కడికిఁబోయి 'టెన్నిస్', 'బిలియర్డ్స్' యాడి, కొంతతడవు ఘనులతో నిష్టగోష్ఠిఁ బ్రసంగించి వచ్చుచుండును. అతని కీపురము చేరినతర్వాత నాంగ్ల భాషతో భాషించుట లెస్సఁగా నలవడినది. గంగమ్మకుఁగూడ కొంచెముగా నింగ్లీషుభాషయందుఁబ్రవేశముగలిగెను. సూర్యాస్తమయవేళ కాదంపతులు సముద్రపుటొడ్డునకు వయ్యాళికిఁ బోవుచుందురు.

నాఁడుకూడ నప్పలసామి కడలిదరి కేఁగి యొక యేకాంత స్థలమునఁ గూరుచుండి తలపోఁతకుం జొచ్చెను. ''గాజుల చప్పుడునుబట్టి మనుష్యులను గుర్తుఁబట్టుట కెందఱికి యట్టి గాజు లుండవచ్చును. రామయ్యచెట్టి భార్యకుఁగూడ నట్టి యాభరణములే చేతికుండఁబోలు. కాని యాధ్వనితో నించుకంతయు భేదములేదుగదా! పోనీ; ఆచప్పుడు మఱియొక వనిత వలనఁ గల్గినదనుకొందము. 'సామిపిళ్ళ వెళ్ళినాఁడు. ఇఁక భయములే' దని నాకు వినఁబడిన మాటల కర్థమేమై యుండును? నేను గాక మఱియొక సామిపిళ్ళ యుండునా? నాకీ పిళ్ళబిరుద మీ దాక్షిణాత్యు లిచ్చినది. నాకుఁ బిళ్ళశబ్దము చేర్చి వారుమాత్రమే వ్యవహరింతురు. దాక్షిణాత్యులలో సామిపిళ్ళ మఱియొకఁడు గలఁడేమో! ఎవ్వఁడైయుండును? కాని యిప్పుడు వచ్చిపోయిన సామిపిళ్ళను నేనొక్కఁడనే గదా? సరియే. నన్నూహించియే వారు పలికిరందము. నావలన

భయమెవరికి? ఆమాటలవలన లోపలనున్న స్త్రీ నాభార్యయే కావలయును? అదియే వచ్చిన దనుకొందను. దానితో నాయజమానుల భార్యలు తోడుగా నున్నారుగదా? వారెట్లు దానినొంటిగనె విడుతురు? విడిచినను నది బరితెగి నింటనుంతలోఁ బరపురుషునితో నెట్లు మాటాడ సాహసించును. ఆదుష్టుఁడు నాబసకెదుటనే వాస మేర్పఱచుకొని యుండఁగా, వారికొఱకది యీసంతపట్టున కేలవచ్చును? అదియు నమ్మఁదగదు. దైవము నామనస్సు కలఁచి నన్ను శోధించుటకిట్టి వింతచేయుదములం జేయుచున్నాఁడు" అని తనలోఁదాను బల్కికొని భోజనము వేగిరింటికేఁగెను. గంగమ్మ చూపులలో నెప్పటి శాంతభావము కన్పట్టుకుండెను. ఆమె కపోలదర్పణములందు లజ్జాజనితారుణ్యము మాటిమాటికిఁ బొడసూపి మాయమగుచుండెను. అప్పలసామి. „గంగా! పార్కుఫేర్ వింతలేవేని గలవా?„ యని యడిగెను. „మీరెఱుఁగని వింతలేవియుండు" నని యామె బదులుచెప్పెను. ఆమాటకూడనప్పలసామికనుమాన హేతువేయయ్యెను. అతఁడు తలపంకించి, „నీవు సంతలోఁ దిరుగునప్పుడు మనయజమానుల యిల్లాండ్రుకూడ నుండిరా?" యనెను. „ఉండకేమి! ఒక్కచోటమాత్రము దారిఁదప్పితిమి. మరలఁ గొలఁదికాలము నకే కలసికొంటిమి" అని గంగమ్మ పలికెను. ఈమాటలు కూడ వానిసందేహమునకుఁ దోడ్పడుచునే యుండెను. ఇఁక మనసుండఁబట్టక „నీ వాహాకోమ్మనియముల యంగడికడ నుం

టివా?" యని యడిగెను. గంగమ్మ మొగము వెలవెలఁబోవఁ దలవంచి, „నే నా యంగడినే చూడలే" దని జవాబిచ్చెను. అప్పలసామికి సందేహ నివృత్తి కాలేదు. అతఁడు విశేషముగాఁ బ్రసంగింపక భార్యతోఁ గూడ భుజించి చాలసేపు యోజించుచుఁ గూరుచుండి యవల నిద్రించెను.

ఆమఱునాఁటి రాత్రి మరల సర్కసుప్రదర్శనము గలదు. మన నాయికానాయకు లచ్చెరువుగొల్పు సాములను నేర్చి యోచేసి మెప్పొందవలసియున్నది. మున్నొకప్రదర్శనమున నొక జమీందారుఁడు చూచివచ్చి గోపదంపతుల నైపుణ్యమునకుఁ గడుమెచ్చి వారికి సమువగు విన్నాణపు జిలుఁగు వసనములు బహుమానముగా నిచ్చెను. వానిని ధరించి నేఁడు మనకథానాయకుఁడును నాయికయు రంగస్థలమునకు రాఁదలఁచిరి. వారావేషములతో వారికై యేర్పఱుపఁ బడిన గదిలోఁ గూరుచుండిరి. ఆగదినుండి ముందుగా నప్పలసామి యీవలకువచ్చి కొంతమంది బాలకులతోఁగూడి చేయు ‘ఫీట్సు’ చేయుచుండెను. ఇదియే సమయమని తలఁచి, నటేశ మొక గులాబీపూలగుత్తి చేతఁబట్టుకొని, యందు రామయ్య చెట్టి వ్రాసియిచ్చినలేఖను భద్రపఱిచి, దానిని బట్టుకొని గంగమ్మ గదిలోనికిఁ బోయి, „మారామయ్య దీనిని నీకిమ్మని నన్నుఁ బంచినాఁ" డని చెప్పుచు నిచ్చెను. ఆపుష్పగుచ్ఛము జరీతో మిగుల సుందరముగాఁ గట్టఁబడియుంటఁజూచి, గంగ

మ్మ సంతోషించి, దానిని దసకరకమలములం గీలించి, యా ఘ్రాణించుటకై నాసినాపుటముల దరికిఁ జేర్చునప్పు, డందు నడుమఁ గర్ణికాశోభ నలరు కాగితపు మడత యామెకుఁ గనఁ బడెను. ఇంతలో నప్పలసామి తన 'ఫీటొ' ముగియుటచేత లోనికివచ్చెను. నటేశము మిగులఁ గలవరపడెను. "నీవేల మారహస్యాగారమున కనాహూతుఁడవై వచ్చితి"వని మా గోపశ్రేష్ఠుఁడు నటేశమునడిగి యతనితో వాదప్రతివాదములు జరుపుచుండ, గంగమ్మ యించుక గుండె నిబ్బరపఱచుకొని కుసుమగుచ్ఛ మధ్యమందున్న లేఖను మెల్లఁగాఁ బైకిఁదీసి రైకలోపల దాఁచెను. క్రమముగా నాపురుషులిరువురు వాక్కలహములోనికి దిగిరి. పూలగుత్తి యిచ్చుట కెట్టివానికేని హక్కుగలదని నటేశము మొండివాదముగాఁ బలుక, నప్పలసామి మిగులఁగినిసి, యాగుత్తినెత్తి ముక్కలుముక్కలుగాఁ జీల్చి, నేలఁ బోవైచి, నటేశమును మెడఁబట్టి, యొక్కత్రోపుత్రోసి గెంటెను. అతఁడు చాఁపచుట్టగా నేలఁబడి లేచి రొండలుదులుపుకొని చప్పుచప్పున నావలికి జాఱెను.

అప్ప—గంగా! నీచర్య నాకుఁ గడు వింతగానున్నది. నీవు మేఁకవన్నె పులిలాగునఁ దోఁచుచుంటివి. నాయెడ నకలంకప్రేమ నటించుచు నీవు దుష్టులగు చెట్టియార్లతో మంతనము సల్పుచున్నట్లు కనఁబడుచున్నది. నిన్న సంతలోనీవు దారిఁదప్పునపుడా రామయ్యతోఁగూడి హార్మోనియముల దుకాణములో నున్నట్లు నాకనుమానము గల్గినది. అది నిజమే

యని తోఁచుచున్నది. క్రమముగా నిట్టిస్థితికివచ్చితివా? నీహృదయము దాఁపక తెలుపుము.

గంగ—నామీఁద నిట్టి యపనింద వైవఁదగవా? ఒక గొప్పవాఁడేవో పూలనిచ్చినఁ గైకొనుట తప్పా? నలువురితో దొమ్మరివిద్దెలం జూపుటకు సిద్ధపడినప్పు డీతప్పు తమకుఁ దోఁపలేదా? మీరకారణముగా నన్ను నిందావాక్యములాడిన నే సహింపఁజాలను. మీరెక్కడెక్కడికో పోయి వచ్చుచుండ నే ననుమానపడుచుంటినా? మిమ్ము నే నెట్లు గౌరవింపుచుంటినో, నన్ను మీరును నారీతిగౌరవింపవలసియున్నది.

అప్ప—చెన్నపట్టణపుఁగాఁపురము నీకెట్టి తెగువఁగల్గించినది! ఇంట నొకమూలఁ బడియుండవలసిన నిన్ను బయటికి రానిచ్చుట నాతప్పే. నీ కెంతస్వాతంత్ర్యము నే నిచ్చియున్నను, నీవెన్నఁడేని నన్నెదిరించి మాఱుపలుక తెఱుఁగుదువా? మన కాఁపురమున కేదియో కీడు మూఁడనున్నది కనుక నే నీవిట్టి నుడు లాడుచున్నావు.

గంగ—మీరు నన్నిట్టు లవమానముచేయుట న్యాయమా? నే నాడినమాటలలోఁ దెగువమాటలెవ్వి? నేను దిన్నఁగాఁ బల్కుచుంటిననియే నా నమ్మకము. దోషవాక్యములే నానోట వెలువడెనని మీకుఁ దోఁచిన, నన్ను క్షమింపుఁడు. నేను క్షంతవ్యురాలనుగదా!

అప్ప—క్షంతవ్యత కేమిలెమ్ము. నీవిఁక నాచెట్టియార్లతో నెట్టిసమయములయందైనను బ్రసంగింపరాదనియు,

నాయాజ్ఞలేనిదే నీ యింటివిడిచి వెడలరాదనియు, నెవరేబహు మానమిచ్చినను స్వీకరింపగాదనియు, నిన్ను శాసించుచున్నాను. నాయాజ్ఞ మీఱెదవేని, నిన్నుఁ గఠినముగా శిక్షింతునని నమ్ముము.

గంగ—పంజరములోఁజిలుకవలె బంధింపఁబడి, మీరు దయాపూర్వకముగా నిచ్చినాహారముం దినుచు మీ కింపు గొల్పుటకు మాటలాడుచు నుండవలసిన నికృష్టజీవనమా నాది? నాయెడఁ దమకుఁగల గాఢానురాగమునకీ కఠినశాసనములు తగవు. ఆలోచించుకొనుఁడు

ఇత్తఱి రంగాధ్యక్షుఁడువచ్చి యప్పలసామి (ఫీట్సు), చేయవలసిన వంతు వచ్చినదని తెలియఁజేసెను. వెంటనే యతఁడు తనయగారమును విడిచి యరిగెను. గంగమ్మ చప్పున దివ్వెదగ్గఱకేఁగి నటీశేము తన కందిచ్చిన కమ్మనిప్పి చదివెను. అందిట్లు వ్రాయఁబడియుండెను.

"ప్రేయసీ! నీమగనిరాక మన సంభాషణమున కడ్డంకి యాటచే నిన్న నిన్నర్థించిన వరమునుగ్రహింప నంగీకారముం దెల్పుటకు నీకవకాశము లేకపోయినది. కాని నీ దయార్ద్ర హృదయమునుండి యొకటిరెండు ప్రేమామృతశీతలతరములు నాపరితప్తహృదయముపైఁ బడి యించుక యుపశమన మొసంగకపోలేదు. నేనింక మిక్కిలిగా వక్కాణింప నక్కఱ లేదు. నీవు నాకోర్కెయీడేర్చి నాతనువు నిలుపకతప్పదు. సమ్మతినిఁ దెల్పుట కేసంపిన కుబ్జాకకుసుమములలో నొకటి ధరించి రేపు రంగస్థలమునకు రమ్ము. ఏకారణముచేతనైన

నేనంపిన కుసుమము లుపయోగార్హములు కాకున్న, మఱి యొక గులాబిపువ్వేని ధరించిరమ్ము. నీకొఱ కొకమోటారు కారుతో మీపరిదర్శనశాలయొక్క ప్రాగ్ద్వారముకడ వేచి యుందును. నాకింకను భూమిమీఁద నన్నమేయున్నయెడల, నీకు నాపైఁ గరుణ గలుగకపోదు.

ఇట్లు నీదాసుఁడు,
రామయ్య చెట్టి."

ఈ జాబనెడు సూదంటురాయి మనకథాయిక మనస్సు ను నయున్ను నవలీల నాకర్షింపఁగలిగెను. తన్నారీతిఁ బతిగద్దించుట, పోటుమాటలాడుట, యామెకుఁ గిట్టకుండెను. తాను జేసినది తప్పైనను, తనొరులు తప్పుఁబట్టునప్పు డభిమానవతియగు యువతి సహింపక మఱియుం దప్పుదారులఁబడి చరించుట లోకస్వభావమే కదా! ‹‹నేనొనరించినతప్పు నాకే తెలిసి నేనే దానిని సవరించుకొనవలెఁ గాని, యెంతపతియైనను దానిం బురస్కరించుకొని నన్నుమానముతోఁ జూచుటా! నేనోర్వఁజాల. ఇఁక నెట్టులును మా కాఁపురము సరిపడదు. బందీకృతనై యెట్లుజీవింతును? నేను నిలుచుటకుఁ గూర్చుండుటకుఁ గూడ శాసనములేయఁట. అందునకు నే నొడంబడుదునేని నా కాఁపురము దినదినంపుగండము వేయేండ్లాయువన్నట్లులుండును. రేపు మరల నాభర్తతో గట్టిగా వాదించి నాకు బానిసతనము రాకుండఁ గాపాడుకొన యత్నింతుఁగాక. అది తప్పక

నన్నాశ్రయించునని తోఁచునేని, నేనాసుందరాంగుని యాహ్వాన మంగీకరించి సుఖింతుఁగాక." యని యామె తనలోఁ దాఁ బల్కికొని యవ్వలఁ దానాచరింపవలసిన సేవా ధర్మమును యథావిధి నెఱవేర్చెను. ప్రదర్శనానంతరమున దంపతులుగృహమున కేఁగిరి. ఒకరభిమానపూరితహృదయులు. రెండవవా రనుమానపూరితహృదయులు. ఏదేని భావోద్రేకము గల్గినపుడు మాటలు మిక్కుటముగా రావు. కావున వారు దారిలోఁగాని నింటి కరిగినతర్వాతఁగాని, నాఁటికేమి యు సంభాషించుకొనకుండిరి. అప్పలసామి యనుమానము మిను ముట్టి వింతవింతరూపములం దాల్చుచుండ, గంగమ్మ యభిమానము బహుమార్గములం జరింపఁ జూచుచుండ, రాత్రి చాలవఱకుఁ గడచెను. తెల్లవాఱజామున వారింటుక కన్మూసి నిదురించిరి.

---

## ౧౧ పలాయనము.

ఉదయభానుని కవోష్ణకరస్పర్శచే నప్పలసామి మేల్కాంచెను. అతఁడు పడకపైఁగూరుచుండి తనయిష్టదైవమును ధ్యానించి కన్నులు తెఱచునప్పటి కెదుటఁ గిటికీప్రక్క నొక పురుషవ్యక్తి నడచిపోవుచుండెను. అతఁడు ధరించిన వుట్టములంజూడ నచ్చుమూ రామయ్యచెట్టి తాల్చువానివలెనే తోఁచి యప్పలస్వామి యులికిపడిలేచి తలుపుతెఱచెను. కాని

యాపురుషుఁడు తన్మందిరాధికారియని తెలిసికొన్నతర్వాత నతఁడించుక లజ్జితుఁడై పెడమొగముఁబెట్టితన యేకాంతాగార ములోనికేఁగి యొక వాల్గురిచీమీఁద నాసీనుఁడై తలపోయఁ జొచ్చెను. తనమనస్సును బరిపరివిధముల బాధించు నాచెట్టి యారు స్మృతికివచ్చి యట్టులుండెను. దంతధావనాది కృత్య ములు చేయలేదు. కాఫీ త్రాఁగలేదు. ఊర్ధ్వముఖముగాఁ గొంతసేపు, తిన్ననిచూపుతోఁ గొంతతడవు, అధోముఖము గాఁ గొంతకాలము, మన యప్పలసామి కూర్చుండువాఁడు. కన్నులొక్కొకతఱి మూసికొనుచుండువాఁడు. ఏదోతలమీఁదఁ బ్రాఁకుచుండఁ దుడుచుకొనునట్లు తలఁ దడవుకొనుచుండు వాఁడు. నిబ్బరంపు దృక్కులతోఁ జూచుచు నప్రయత్నము గాఁ గుడిచేతి బొట్టనవ్రేలి గోటిని గొఱుకుకొనుచుండువాఁడు. నడుమనడుమ దీర్ఘనిశ్వాసములం బుచ్చుచుండువాఁడు.

అట్టులున్న మగనిస్థితి గవాక్షరంధ్రములగుండఁ జూచి గంగమ్మ డాయనోడుచుండెను. ఆమెయు నేమిచేయుటకుం దోఁపక కాల్గాలిన పిల్లివలెఁ దిరుగుచుండెను. ఆమెకూడఁ గాఫీ ముట్టలేదు. ఒకసారి పశ్చాత్తాపము, మఱియొకసారి రామయ్య యెడ వ్యామోహమును, నాపెకుఁ గలుగుచుండెను. పండ్రెండు గంటల పిరంగిదెబ్బ వినఁబడెను. ఇంకను నాయకుఁడు లేవ కుండెను. అప్పుడు గంగమ్మ సమీపించి „యేమి యట్టులా లోచనానిమగ్నులై యుంటి" రని యడిగెను. అప్పలసామి

యొక్కనిట్టూర్పు విడిచి “గంగూ! కూర్చుండు” మని తనదగ్గ ఱనున్న కురిచీనిజూపెను. అప్పుడు వారిట్లు మాటాడికొనిరి.

అప్ప—గంగూ! నిన్నరాత్రి నిన్ను శాసించుచుఁగొంత పల్కితిని. నీయందు నాకుఁగలప్రేమ నీకుఁగఠినశాసనములు విధించుటకును సమ్మతింపకుండెను. నీవు నాహృదయశల్య మూడఁబెఱుకవా?

గంగ—ఏమాహృదయశల్యము? అది యూడఁబెఱుకుట యననేమి?

అప్ప—ఏమో నీవేయెఱుఁగుదువు. మరల నానోటఁ బల్కించుచుంటివి. నీకును రామయ్యకును సంబంధ మేమేని కలదా?

గంగ—మీరు క్రమక్రమముగా మితిమీఱి మాటాడుచుంటిరి. నిజముగా మాకు సంబంధమేయున్న మీరు పట్టుకొనఁగలరా?

అప్ప—లేకున్న, వాఁడును వానిస్నేహితుఁడును నీ వెంట సదా తిరుగుచుండు టేమి? వారెందులకిందు గదివుచ్చు కొనియుంట? నీకొకవేళ వానిపై మోహమేయున్న, వాని యం దేగొప్పతనముచూచి దానింగాంచితివి? నీవు కోరునది ధనమా, యకల్మషప్రేమయా?

గంగ—మీప్రశ్నల కన్నిటికిని నేను జవాబుఁ జెప్పఁ జాలను. మి మ్మనుమానపిశాచ మావహించినది. ఇప్పు డేజ వాబుచెప్పినను మీకుఁ దృప్తికలుగదు. నాయునికి మీమన

శ్శాంతికి భంగకరమని తోఁచునేని, నేను మాయమ్మగారి యింటికేఁగెదనులెండు. నా చర్యలెల్ల మీ కవమానహేతువులే యగునప్పుడు, మీతోఁ గాఁపురముసేయుట కష్టమే.

అప్ప—నాకు నీతోడిదే లోకమనుకొనుచుంటిని. స్వర్గసౌఖ్యము నీపొందునందే కలదని యనుకొనుచుంటిని. నీయెడ నాకెట్టి భావముకలదో, నాయెడ నీకును నట్టిభావమే కలదని దృఢవిశ్వాసముతో నుంటిని. అట్టివిశ్వాస మొక్కమారు చెఱచివైచుటయే కాక, నన్నొక్కసారి నరకమునకుఁ ద్రోయఁ జూచుచుంటివే! నే నొనరించిన యపరాధమేమి?

గంగ—మీకుఁ బిచ్చియే యెత్తినది. ఇఁక మీతోఁ బ్రసంగింపఁ జనదు. మీకున్నసందేహము లావలఁ దీర్చెదను. ఇప్పటికే చాలపొద్దుపోయినది. భోజనమునకు లెండు.

అప్ప—సరియే. అటులేగావింతును. నీవులోనికేఁగి యన్నియు నాయత్తపఱుపుము.

గంగమ్మ లోపలికిఁ బోయెను. భర్తపలికిన జాలిమాటలామెకుండె గఱఁగించినవి. తానుజేయునది దోషమని తోఁచినది. ఎటులేని తనమనస్సు గట్టిపఱుచుకొనిరామయ్యను నిరాకరింప నిశ్చయించుకొన్నది. కొంతసేపటికి నప్పలసామి దంతధావనాదికములం దీర్చికొని భుజింపనేఁగెను. ఇరువురును భుజించి యొకింత తడవు విశ్రమించిరి. మధ్యాహ్నము గడచుచుండఁగా నప్పలసామి రంగస్థలికిఁ బోవలసిన పని

వచ్చినది. అతఁడాంటిగా నెప్పుడు బయటికిఁబోవునా యని కనుపెట్టుకొని చూచుచుఁ దత్భవనప్రాంతముల సంచరించు చున్న నటేశము, సామిపిల్లె వెళ్లుటయే తడవుగఁ దాను దన గదిలోఁ బ్రవేశించి గంగాబాయిని బిలిచి రామయ్య పంపి నాఁడని చెప్పుచు నొకవిలువగల మణిమాలను నామెచేతికి చ్చెను. ఆసరము చీఁకటింటఁ బెట్టినను బాలసూర్యునివలెఁ బ్రకాశించు నత్యద్భుత తేజస్సుగలది. కన్నులు మిఱుమిట్లుగొల్పు దానికాంతి కాయింతి యత్యంతాశ్చర్యసంతోషములఁ గాంచెను. ఒక్కనిముస మూదామనువంకఁ జూచెను. ఇప్పుడే యింతటి వలువగల కానుకలిచ్చువాఁడు చేపట్టునేని యెట్టిసొమ్ములనిచ్చునోయనియూహించెను. తా నమూల్యరత్నాభరణాలంకృతమై, చీనిచీనాంబరధారిణియై, బహుదాసదాసీ జనంబులుతన్ను సేవించుచుండ, సమస్తవస్తుసంపదలతోఁ దులఁదూఁగు నొకదివ్యమందిరమున రామయ్యతోఁ గూడి యున్నట్టులు తలంచికొనెను ఇంతాఁకటి జాలి నొక్కయూఁకువఁ బాఱఁద్రోలెను. మాఱుమాటాడక యాసరముంగైకొనెను. చెట్టిగారికిఁ గృతజ్ఞతానందనము లిడితినని మనవిచేయుమని నటేశముతోఁ జెప్పి వాఁకిలిమూసి లోనికరిగెను. ఇఁక నీపిట్ట దొరికినట్టేయని తలఁచి నటేశ మీశుభవార్త సోదరునకుఁ దెలుప నేఁగెను.

నాఁటిరేయి జరుగు సభ సుబోధప్పలస్వామికి "ప్రొఫెసర్" అను బిరుదమునీయఁ బౌరులలో ఘనులు కొందఱు నిశ్చ

యించుకొనిరి. కొందఱు చెట్టియార్లతనికిని గంగాబాయికిని గాంచనపాత్రిల నొసంగ సమకట్టిరి. కావున నాఁటిప్రదర్శనము మిగుల దర్శనీయమై యుండెను. సాలయంతయుఁ జూపఱులతోఁ గిక్కిరిసిపోయెను. అప్పలసామి తనకుఁగల యును మానబాధ లోనడఁచుకొని, లేని యుత్సాహముం దెచ్చుకొని తానొనర్చు వింతసాముఁబనులెల్ల మనోహరలీలఁ గావించెను. అతఁడు కొందఱు యువకులతోఁ జేయుపనులు ముగిసిన తోడనే యప్పటి మైసూరు రాష్ట్రాధిపతులలో నొకఁడగు నొక మహమ్మదీయుఁడు పౌరుషోద్రేకమై సామిపిల్లం గొనియాడుచుఁ గొన్నిమాటలాడి యతనికి 'ప్రొఫెసర్' బిరుదము నొసంగెను. ఆబిరుదచిహ్నముగా నున్నతోద్యోగులలోఁ గొందఱి చేవ్రాలుచే నొప్పు నొక సూర్యకాంత పత్రముకూడ నతనికిచ్చెను.

అవల దంపతులు కలసిచేయు సాముఁబనులు వచ్చెను. ఒక్కొక 'ఫీట్' ముగియు సరికి సభ్యులు జడివానవలెఁ జప్పటులం గురియించుచు వచ్చిరి. ఆవింతపనులన్నియు ముగిసిన తర్వాత వర్తకసంఘమువారు స్వర్ణపాత్రిలను బహుమానములుగా నిచ్చి యాదంపతుల గౌరవించిరి. భర్తతోఁ గలసి చేయు గరిడీల సమయమున గంగమ్మ గులాబీపూవు ధరించి, రంగస్థలమునకు రాలేదు. రామయ్యచెట్టి మనస్సు చివుక్కుమనెను. పదివేలవిలువగల రత్నాలదండయు వృథయేయగునా యని యతఁడు భయపడుచుండెను. అతనిమనస్సు మనస్సులో లేదు. గడియగడియ కావలికిఁబోయి వచ్చి కూర్చుండు

చుండెను. విూసములు నువ్వుచుఁ దల పంకించుచుండెను. అత్తరువాసనచే శోభించు జేబురుమాలు మాటిమాటికి బయటికిఁ దీసి వాసనఁజూచి జేబులోఁ బెట్టుకొనుచుండెను. తఱుచుగా జేబుగడియారముం దీసి గంటలెన్నియయ్యెనో యనిపరికించుచుండెను. అంతేకాని ప్రదర్శనాకౌశలమేమియుఁ బరిశీలింపఁడయ్యెను. అతనియాందోళనము గంగమ్మ కనిపట్టెను. మొదటిదాని కర్థము గ్రహింప లేకపోయెను. అవ్వల గులాబీపూవుమాట జ్ఞప్తికిరాఁగా, నతని మనోవైకల్యమునకు హేతువూహించెను.

పిమ్మట గంగాబాయి యొక్క తెయే కొన్ని 'ఫీట్సు' చేయవలసి యుండెను. ఆమె తనగదిలోనికేఁగి యందు బల్లపై నలంకరింపఁబడియున్న గులాబిపువ్వులలో నొకదాని నూడఁబెఱికి, దానిని వక్షోమధ్యంబున ధరించి రంగస్థలంబున కవతరించెను. ఆమెను జూచినతోడనే రామయ్య నటేశము గారులు కరతాళధ్వనులు చేసిరి. గొప్పవారు చప్పటులు గొట్టినప్పుడు మనమూరకుండరాదని యెంచి తక్కుంగల గతానుగతికులగు లోకులు కరతాళధ్వనులు గావించిరి. ఆమె యప్పుడు ధరించిన విలువవలువల చెలువముం గాంచి చెట్టియారు లట్లు చప్పటులు గొట్టిరని జనులూహించిరి. గొప్పవారు చేయు ప్రతిస్వల్పకార్యమున కేదో మహత్తరార్థమును గొలఁదివారు కల్పించి వారిననుసరించుట లోకసామాన్యమేకదా!

హూణాయులు మీఁద నామె తీఁగపై నేకచక్రశకటమును బలువితముల నడిపించి యెల్లరమెప్పును గాంచి లోనికేఁగెను. అదియే యామెయొనర్చిన కడపటి బలవినోదప్రదర్శనము. ఆమె లోపలికేఁగుటఁ గాంచి చెట్టిగారుసోదరులిరువు రావలి కేఁ బోయిరి.

గంగాబాయి తనరహస్యాగారములోనికేఁగి కాగితమును గలమును దీసికొని వేగముగా నొకకమ్మ యీక్రిందిరీతిని వ్రాసి భర్తయలంకారములు గల బల్లపై నుంచెను.

"అయ్యా! (మిమ్ముఁ బ్రాణనాథా యని పిలువఁజాలను.) మీకు నాయందున్న యనుమానము నన్నే కాక మిమ్ముఁగూడ సర్వకాలసర్వావస్థలయందును బీడించుచుండును. మనయిద్దఱిలో నెవ్వరో యొకరు తెగినఁ గాని యాపీడవదలదు. మీచెట్టఁబట్టి యెంతో సౌఖ్యము పొందఁగలననియు నెంతో గౌరవము గాంచఁగలననియుఁ దలఁచితిని. కాని నాతలఁపులన్నియు నాకాశహర్మ్యములయ్యెను. నేనిఁక మీచెంత నుండఁజాల. ఎందేనిపోయెదను. నాకై మీరు వెదకవలదు. వెదకినను మీకునేను దొరకను. మరల నీశ్వరాదేశమగునేని యెప్పుడో యొక్కుడో మనము కలసికొందుము గాక. మీకు సకలసుఖములొసఁగి దేవుఁడాశీర్వదించుఁగాక.

ఇట్లు నిందితురాలు,
గంగాబాయి."

ఆజాబక్కడనుంచి యామె సర్కసుదుస్తులుసయితము విడువక త్వరితగతిని బాణిద్వారము కడకరిగి, యందుఁ దనకై యాత్రముతో నెదురుచూచుచున్న రామయ్యచెట్టిని గలసికొని, యచ్చటఁ దనకై ద్వారము తెఱువఁబడి నిలుపఁబడియున్న మోటారుబండి నెక్కెను. ఒక్కక్షణములోనే కారుకదలెను. ఈలోపుననే యప్పలసామి తమగదిలోనికి వచ్చిచూడ గంగమ్మ గన్పట్టదయ్యె. విశేషించి యతనిబల్లపై నొకకమ్మ కాన్పించెను. దానిని బ్రచలితహస్తములతో విప్పి చదివెను. అతనిగుండెలో నొక్క పాషాణపాతమైనట్లు లయ్యెను. ఆమె యిప్పుడే యేఁగియుండఁబోలునని యూహించి పాణిద్వారము దగ్గఱకరిగి చూడ నప్పుడే సాగమొదలిడిన మోటారుబండియు నందు రంగస్థలాలంకారములతోనేయున్న గంగాబాయియు నామెచెంతనున్న మఱియొక వ్యక్తియు నతనికి గోచరించిరి. రామయ్యచెట్టి ముసుంగు వైచికొనియుంటచే నతని నానవాలు పట్టలేకపోయెను. ఆమోటారు సర్కసుశాలనుజుట్టి పెద్దబాటకు రావలెను. ఆరాక యొకింతతడవు పట్టునని యెంచి మనకథానాయకుఁడు దుస్తులుమార్చుకొనకుండఁగనే ప్రేక్షకులేఁగుదారిని బరువెత్తి వచ్చెను. అతని వైఖరిఁజూచి సర్కసు యజమానులు, ప్రేక్షకులు, నెల్లవా రాశ్చర్యపడిరి. కాని యతఁడు సింహద్వారముచెంతకుఁ బోయిచూడ, వాయువేగమున మోటారుబండి సాలదాఁటి పోవుచుండెను. అతఁడందాసీనులై యున్నవారి నించుకంతయు గుర్తింపఁజాలకుండెను.

అతనియొడలు నిలువున నీరై యతఁడొక్కసారి కూలఁబడిపోయెను. ద్వారరక్షకులువచ్చి యతనింబట్టుకొని లేవనెత్తి లోనికిఁ గొనిపోయిరి. అతఁ డాఁడుదానికన్నను మిన్నగ నొకమూలఁ గూర్చుండి రోదనము చేయఁదొడంగెను. కారణమేమని యడుగ నతఁడెవ్వరికి మారుపల్కఁడయ్యె. యజమానులు గంగాబాయిని బిలిచి యడుగుదమన్న నామె కన్పట్టకుండెను. వారికిఁ బూర్వవృత్తాంత మేమియుఁ దెలియదు. నేమితలఁచుటకును బాలుపోకుండెను. ప్రేక్షకులలోఁ గొందఱు గోపదంపతుల ప్రదర్శనములం దెక్కు డభిరుచిని సూచించుచు వారిని దఱుచుగా బహూకరించుచు వారిబసకెదుటనే తాము బస కుదుర్చుకొనియున్న చెట్టియార్ల వైఖరి కనిపట్టి యిప్పుడు జరిగినదెల్ల నూహింపఁగల్గిరి. చెట్టియార్లవలెనే గంగాబాయి మీఁదఁ గన్నువైచిన యువకులు కొందఱును నెవఁడో యామెను లంకించుకొని పోయెనని గ్రహింపఁగలిగిరి. ఆనోట నానోట నీవార్త ప్రేక్షకులలో నెల్ల వ్యాపించెను. వారినుండి విన్న సర్కసుయజమానులును నివ్వెఱపడి చూచుచుండిరి.

సర్కసు నిలిపివేయఁబడెను. జరిగిన వృత్తాంతముం గూర్చి పౌరులు పలుతెఱంగులఁ జెప్పికొనుచు బసలకేఁగిరి. సకలవిషయాన్వేషణ తత్పరులు కొందఱందే యుండి సర్కసు వారి నేవేవో ప్రశ్నలువైచుచుండ, శంభులింగముపిళ్లగారీవలికివచ్చి వారికేదో సమాధానముచెప్పి వారిని వదల్చుకొనిరి. దుఃఖప్రవాహము కొంత యాఁగినతర్వాత నప్పలసామి

తనయుపస్థను యజమానులకు నివేదించెను. “అయ్యలారా! పట్టణజీవన మెట్టిచెట్టలం బట్టించునో చూచితిరా? ” యని యతఁడనెను. తెల్లవాఱువఱకెవ్వరును గన్నుమూయ కుండిరి. వెలుఁగు రాఁగానే యెవరియిండ్లకు వారేఁగిరి. శంభులింగము పిల్ల యుప్పులసామిని దీసికొని తనగృహమున కరిగెను.

---

## ౧౨ నూత్నజీవనము.

రామయ్యచెట్టి గంగాబాయిని దీసికొని పల్లవరమునకుఁ బోయెను. పల్లవరము చెన్నపురికి సమీపమందున్న చిన్నపట్టణము. అది సముద్రముకన్న యించుక యున్నతస్థలమున నుండి వినిర్మలమైనగాలితో నుండుటచేత క్షయాది రోగపీడితు లచ్చటికిఁబోయి వైద్యము చేయించుకొందురు. అదిగాక యందుఁ దెల్లవారివి కొన్ని హైందవులవి కొన్ని సుందరమందిరములు గలవు. వానిలో మనరామయ్యచెట్టికి ‘రతీవిలాస’ మనఁబడు సుందరమందిర మొకటిగలదు. అపరమన్మథుఁడగు రామయ్య రతీదేవ్యవతారము లనఁదగు నవయువతీరత్నములతోఁగూడి యిందే కొన్నిదినము లుండుచుండును. ఇప్పుడతనిపాలిట రెండవరతి యనఁబరగిన మనకథానాయికతో నతఁడందే విడిసెను.

ఆభవనము సింగారంపుఁబోత్రివని చెప్పఁదగును. దాని చుట్టును విశాలమగు సుందరారామము గలదు. అందు ముందుగాఁ గొన్ని పలురకములగు పూలమొక్కలు గలవు. కొన్ని

కుసుమవిరహితములై చిత్రవర్ణ శోభిత పత్రములతోఁ బ్రకాశించునవై మట్టికుండ్లయం దమర్చఁబడియున్న పశ్చిమదేశంపు మొక్కలు గలవు. అవియెల్ల సంతతస్తులుగ సమరింపఁబడియుండెను. శైవాలజాతిలోఁ జేరిన కొన్ని చిట్టిమొలకలు ‘భూలోకస్వర్గమునకు స్వాగత’ మను నర్థమిచ్చు నాంగ్లపదామ్నాయమువలె నాటఁబడియుండెను. సింహాద్వారమునుండి భవనముదాఁకఁ దిన్నని బాటయు దానికిరుప్రక్కల సమోన్నతములగు తరురాజములును గలవు. పుష్పవనమునందుఁ జొచ్చుటకుఁ జిలుక బాటలును, నందు విశ్రమించుటకుఁ జంద్రకాంత శిలావేదికలును గలవు. మందిరమునకు వెనుకటితట్టున వివిధఫలవృక్షములు బారులుతీర్చి నాటఁబడియుండెను. అందును విశ్రామవేదికలును వానిపై లతాచ్ఛాదనములును బెక్కులు నిర్మింపఁబడి యుండెను.

భవనమునందలి గోడలన్నియు క్షీరోపలములచేఁ గూర్పఁబడెను. నేలరంగురంగుల స్నిగ్ధమణులచే నలంకరింపఁబడెను. ఇంటికప్పునకు వేసిన బల్లకూర్పు, దానియందుఁ జేయఁబడిన నగిషీపనులు మిగులఁజోద్యములుగ నుండెను. ఆమందిరమందు నిలుపఁబడియున్న పర్యంకములు, తల్పములు, చిత్రవిచిత్రాసనములు, మున్నగు వస్తుజాలమంతయుఁ జాలవిలువగలదై కన్నులకింపగు కాంతులఁ గ్రక్కుచుండెను. సౌందర్యము, లావణ్యము, విలాసము, మొదలగునవెల్ల ముద్దగాఁజేసి

యిందుంచిరేమోయనునట్టి శృంగారముతోఁ దనమ్మందిర ముండెను.

గంగాబాయికిఁ దనచేయందిచ్చి రామయ్య మోటారు నుండి దింపెను. చేసినది మహాదోషకార్య మగుటచేతను, సట్టికృత్యములకామె యింతకుముందలవడి యుండకపోవుట చేతను, నామె తనులత కంపింప శకటమవరోహించి ప్రియుఁడు దారిఁజూప లోనికేఁగెను. హృదయావేగము క్రమక్రమముగాఁ బెంపగుటచేత నామె యొక కురిచీలోఁ గూలఁబడి వెక్కి వెక్కి యేడువసాగెను. “గంగాబాయి! నేను నీకై సర్వము ధారపోయుచుండ నీకేల యీదుఃఖము? ఈరతీవిలాసము నీది. నేను నీదాసుఁడను. నీవెట్టి యపురూపవస్తువుఁ గోరినను నుత్తరక్షణమున నీకుఁ దెచ్చియిచ్చుటకు దాసదాసీజనులను బెక్కండ్రను నియమించియున్నాను. నీవిందున్న ఫాలాక్షుఁడైన నిన్నుఁ గనుఁగొనలేఁడు. నీవుబయటికిఁ బోవనుంకింతువేని యొరులకంటఁ బడకుండ ‘ఘోషాకార్’ లో నిన్నుఁ గొనిపోవు నేర్పాటులు గావించియున్నాను. నీమగఁడుగాని యతని మిత్రులుగాని నిన్నన్వేషింపయత్నించినను లాభముండదు. కొంతకాలమిట్లు రహస్యముగా నుందువేని, పిమ్మట నీవు బాహాటముగా బయటికి రావచ్చును. ఒకవేళ నితరులు నిన్నుఁ జూచినను నీకేమిభయము? ‘నాయిష్టము. నేనుసెట్టిగారిని వరించి వచ్చితి’ ననుము. ప్రకృతమునమాత్రము గుప్తజీవన మొనర్పు” మని యామెను సమీపించి తన చేరుమాలుతో

నామె కన్నీటిని దుడిచి యామె నక్కునఁజేర్చి ముద్దాడి లాలించెను. ఈమాటలచేతను, లాలనముల చేతను, మరల నామె పశ్చాత్తాపము పలాయనమొందెను. మనస్సు కుదురుపఱుచుకొనెను. నూత్నధవునివంక సానురాగముగ వీక్షించెను. అతఁడు మరలఁ జుంబనమొసర్చి బుజ్జగింపఁగా వానికిఁ బూర్తిగా వశమై పోయెను.

నాఁటఁగోలె నామె యందే నివసించుచు రామయ్యతోఁ గాఁపురము చేయుచుండెను. రామయ్య తా నేయపరాధ మెఱుఁగనివానివలె నటించుటకు మఱునాఁడు కొంతసేపు వై. యమ్. సీ. యే భవనములోనికివచ్చి కూరుచుండి సోదరునితో నేదోప్రసంగము జరపి యేఁగెను. ఆనాఁ డప్పలసామి బసకు రానేలేదు. ఆతఁడా సాయంకాలమున 'కాస్మోపోలిటన్ క్లబ్బు' లో రామయ్యను గలసికొనెను. రామయ్యను జూచినతోడనే సభ్యులలో గుసగుసలు బయలువెడలెను. కాని యతఁడెప్పటివలెనే యుండెను. అప్పలసామి కొంతసేపు రామయ్యవంకఁ గోరచూపులుచూచి, యవల "నయ్యా! మీతోఁ గొంతమాటాడవలెను. అవకాశమిత్తురా?" యని యడిగెను. రామయ్య ప్రహర్ష సూచకవదనముతో, "ప్రొఫెసర్! మీకవకాశమీయనా? ఎందువిషయమై నాతోమాటాడఁ గోరుచున్నారు? ఎప్పుడు? ఎక్కడ?" అని యాత్రముతో నడిగెను. వారు సంభాషించుకొనుట చూచి మరల మర్మరధ్వనులు బయలుదేఱినవి. రహస్యమని చెప్పి సామిపిళ్ల వాని గొంతు

పిసికి చంపునని యొకరును, దన యనుమానముఁ దీర్చుకొను టకు సంభాషించును గాఁబోలునని కొందఱును, భార్యను వాని కప్పగించి సిగ్గులేక యింకను వానితోఁ బరిసంగమా యని కొందఱును, ఆగంగాబాయి నెత్తుకొనిపోయినవాఁడు రాము య్యకాఁడు కాఁబోలునని కొందఱును, బలువురు పలుతెఱం గుల భాషింపఁ దొడఁగిరి. రామయ్య యప్పలసామిని దన మోటారుబండిలోనికి రమ్మని పిలిచెను. ఇరువురును గలసి సముద్రపుటొడ్డునకుఁ బోయిరి. అతని వెనువెంటనే కొందఱు జెట్టికాండ్రితో నరేశము మఱియొక కారెక్కి బయలుదేఱె ను. వారొకచోట నాఁగి యిట్లు ప్రసంగింప మొదలుపెట్టిరి.

అప్ప—అయ్యా! నిన్నటిరాత్రి జరిగిన ఘోరకార్య ముంగూర్చి వింటిరిగదా?

రామ—విన్నాను. మిగులఁ దుఃఖించితిని. నేఁటియుదయ మున నావ్యవహారములు సవరించుకొను నిమిత్తము నరేశము పుచ్చుకొన్న వై. యమ్. సి. యే భవనాగారములోనికి వచ్చి కొంతతడవు గూర్చుంటిని. అప్పుడు మీబసకుఁ దాళ ము వైచియుండెను. అదేలయని యచ్చటివారినడుగ వారా వృత్తాంతమంతయుఁ జెప్పిరి.

అప్ప—నిన్నటి సర్కసునకుఁ దమరు రాలేదా?

రామ—(అనుమానించుచు) వచ్చితిని. కాని చివర దాఁక నుండలేదు. నిద్దురకునై ముందుగనే బసకుఁ బోయి తిని.

అప్ప—తమకుఁ గోపమువచ్చునేమో యని శంకించు చున్నాను. అయినను జెప్పెదవినుఁడు. నాభార్యగుణము చెడఁ దీసినవాఁడు మీసోదరుఁడగు నటేశము చెట్టియే. లోకులందఱును దామే వానిని బురికొల్పి యిట్టి ఘోరకార్యము లెన్నియో చేయించుచుంటిరనియు నిన్నటి దుర్నీతికూడఁ దమదే యనియుఁ జెప్పుకొనుచున్నారు. మీరే యాదుష్టకార్యమొనర్చినను, మిమ్ము నే నేమియుఁ జేయఁబూనలేదు. కాని, మీవంటి వారికట్టిది తగదని మాత్రము మనవి చేయఁదలఁచుకొని మిమ్ము నిటకు రావించితిని.

రామ—స్వామిసిబ్బా! మీరు చాలఁ బొరపాటు పడుచున్నారు. మాగుణము మీరుగాని లోకులుగాని కనిపట్టి యుండలేదు. లోకులు కాకులు. వారామమాటలకు మేముత్తర వాదులము గాము. మిమ్మెంతగాఁ గొండాడుచు మీదంపతుల నన్నివిధముల బహూకరించిన మేము, మీ కెగ్గు దలఁతుమా? అదివట్టిమాట. ఈపురమున దుష్టులెందఱో కలరు. వారిలో నెవ్వరీపని చేసిరో కనుఁగొనవలసి యున్నది. నేను నా మిత్రులతో మీకు సర్వవిధముల సాయపడెదను. రామ రామ! ఎంతమాటాడితిరి! నేనా? ఇట్టి పనిచేయుటా? నాభార్యలేదా? ఆమె నొరులు కొనిపోయినచో నాకెంత కష్టముగా నేనుందునో నెఱుఁగనా? అమ్మతోడు. నేనెట్టి పాపకార్యమును జేసి యెఱుఁగను.

అప్ప—(నొచ్చుకొని) అయ్యా! అటులేని క్షమింపుఁడు. నే నీవియోగదుఃఖమును శాంతచిత్తముతో ననుభవింతును. పూర్వజన్మమున నే నేదంపతులనో విడఁదీసితిని. ఇప్పుడు దానికిఁ బ్రతిఫల మనుభవింపక తప్పదు. నా గృహమందలి యీదుశ్చరిత మొరులతోఁ జెప్పికొనుటయుఁ దగదు. నే నీపురికి నీవియోగదుఃఖ మనుభవించుటకే వచ్చితిని. (అని కంటఁ దడిపెట్టెను.)

రామయ్య యాఱితేరిన దుష్టుఁడు. వానికేమియు జాలి కలుగలేదు. అప్పలసామి భుజముమీఁదఁ దట్టుచు లేవనెత్తి మరల నతనిని బండిలోఁ గూర్చుండఁబెట్టుకొని యతఁడు బయలుదేఱి దారిలో సామిపిళ్ళను వానిబసకడ విడిచి తాను మిత్రబృందముతోఁ గూడి పల్లవరమునకుఁ బోయెను.

అప్పలసామి నాల్గుదినములవఱకు బయటికిరాకుండ నింటిలోనే కూర్చుండి దుఃఖించుచుండెను. సర్కసుకంపెనీవారు సామిపిళ్ళకేకాక తమకుఁగూడ గొప్పనష్టము సంభవించినదని చెప్పి యతనిని బలువితముల నోదార్చి, మఱియొక స్త్రీ గంగాబాయిస్థానములోఁ బనిచేయుటకు దొరకునేమోయని ప్రయత్నము చేయుచుండిరి. ఈపని జరిగినతరువాత నొకనెలదాఁక సర్కసే పడలేదు. సామిపిళ్ళకు మునుపటి చుఱుకుఁదనమే పోయెను. పిచ్చివానివలె నతఁడు కనఁబడుచుండె. అతఁడింతకుమున్ను సంపాదించుకొన్న మొత్తమైదువేలుగలదు. దానినతఁడు 'బ్యాంకు'లో వేసికొని యుండెను. అతఁడు ప్రతి

దిన మొకింతసేపు 'క్లబ్బు' లోనికిఁబోయి యచట నొక్కచోటను సందిగ్ధముగాఁ గూరుచుండి యేదో తలపోయుచుండెను.

ఒకనెల దినములైన తర్వాత మరల సర్కసు మొదలుపెట్టిరి. కాని సామిపిళ్ళకు మునుపటివలె సాగలేదు. అతఁడు 'ఫీట్సు' చేసినపుడు జనుల కరతాళధ్వను లంతగా లేవు. అతనిని జూచి సర్కసునకు వచ్చువారు లెక్కకుఁ దక్కువగా నుండిరి. సర్కసు వా రతనిపై ఖరిఁజూచి యించుక విసుగుకొన నారంభించిరి. అతనికిఁగూడ నా సేవ మిగుల భారముగాఁ దోఁచుచుండెను.

ఇట్లుండ స్టార్ సర్కసు కంపెనీవారు నిజామురాష్ట్రమునకుఁబోయి కొన్ని యాట లాడఁ దలఁచినట్లు సామిపిళ్ళకుఁ దెలియవచ్చెను. స్థలము మార్చుటచేఁ గొంత మనశ్శాంతి గలుగునని సామిపిళ్ళ యూహించి కొంకట సంతోషించెను. కాని మరల దీర్ఘముగా నాలోచింపఁగాఁ దనప్రియురాలు తాను బరస్థలమునఁ నున్న దొరకుట యసంభవమనియు, నిందే యున్న నేనాఁటికేని లభింపవచ్చుననియు నతఁడూహించి, తాను హైదరాబాదునకుఁ బ్రయాణము కాఁజాలనని యజమానుల కెఱింగించెను. వారు రాకతప్పదని నిర్బంధ పెట్టిరి. అప్పలసామి యెంతకును సమ్మతింపకున్న తుదకు వారితో వాగ్వాదముకూడఁ గొంతసలిపి తనయుద్యోగమును వదలుకొనెను.

తమిళులు కేవల స్వార్థపరులు. తమ కుపయోగించునంతవఱకే చేతనాచేతనపదార్థములపట్ల వారాదరముఁ జూపు

దురు, కాని యవలఁజూపరు. ఆపత్తులో నున్నవారిని జూచి జాలిపడి యాశ్రయమిచ్చువారు వారిలో స్వల్పసంఖ్యాకులు మాత్రమేయుందురు. ధనమే పావనముగాఁ దలఁచిచరింతురు. తమ కంతకీర్తిఁదెచ్చి, ధనముం గూర్చియున్న సామిపిళ్ళ, పరిశ్రమ మే కారణముచేతనైన వారి సేవయుం దించుక యాదా సీన్యము వహించినంతమాత్రముస, వారారీతి నతనిఁ జెందనా డుట తగదు. కాని యది వారిలోపముగాదు. ఆలోపము వారి సంఘమందే గలదు. మనపిళ్ళవై. యమ్. సి. యే. నుండి (ఆంధ్రభవన్'అనఁబడు పూఁటకూళ్ళయింటికి బసు మార్చి యందే భుజించుచుఁ బ్రతిసాయంకాలమున క్లబ్బునకు మాత్రము పోవుచుఁ గాలక్షేపము చేయుచుండెను.

---

## ౧౩ ఆర్తరక్షణము.

గంగాబాయి యఖండవైభవ మనుభవించుచు రామయ్యచెట్టితోఁ గాఁపురము చేయుచుండెను. మొదటఁ గొన్ని నాళ్లామె కప్పలసామి కెట్టికష్టములు వచ్చియుండునో యనుజాలియుఁ దనదుర్నీతికి లోకులెట్లు నిందింతురోయను సంకోచమును, బాధగల్గించినను, గ్రమముగా నామె కాభావములన్నియుఁ దానుబొందు నపూర్వసౌఖ్య స్వాతంత్ర్యములవలన మాఱిపోవుచుండెను. ప్రతిమానవునకును గల వ్యక్తిస్వాతంత్ర్యము తనకును గలదనియుఁ బురుషుఁడు తనకిష్టములేని

స్త్రీ నేరీతి విసర్జించునో యటులే స్త్రీయుఁ దనకిష్టములేని పురుషుని విసర్జింప వచ్చుననియు, భూమిపై జన్మమెత్తినందునకు సార్థకతసౌఖ్య మొందుటగాని బానిసయై నికృష్టత యనుభవించుట గాదనియు నామె నేర్చుకొని యప్పలసామి విషయమైన చింత నానాఁట విడిచిపెట్టెను.

ఉదయమున గంగమ్మ లేచుసరికిఁ బైఁడిపాత్రిలో నిర్మలోదక మందిచ్చునది యొకతె, పండ్లుదోముకొనుటకుఁ గుంచెయుఁ బండ్లపొడియుఁ జేతికిచ్చునది యొకతె, కూర్చుండుటకాసనమమర్చునది యొకతె, తలకుఁ బరిమళింపుఁ దైలము నిచ్చునది యొకతె, స్నానమునకు నీళ్లిచ్చి యొడలుసబ్బుతోఁ దోమి తడియార్చునది యొకతె, కట్టుటకు మేల్దుకూలముల నొసంగునది యింకొకతె, కాఫీమొదలగు నాహారవస్తువుల నిడునది వేఱొకతె, ఇట్టులెందఱో సేవకురాండ్రామెను సర్వదా సేవించుచుందురు. భోజనమునందామెకుఁ బ్రీతిదిన మెన్నియో యపూర్వ భక్ష్య విశేషములఁదయారుచేసి బంగారు పళ్లెరములం బెట్టి యిత్తురు. ఆమె నూత్నధవునితో నున్నపుడు తప్ప నితరసమయములం దెల్ల నామెకడిగట్టియై వర్తించు దాసీజనములు పెక్కండ్రుందురు. సాయంకాలమునం దామెచేటికలతోఁ దద్భవనావరణమునందే నిర్మింపఁబడియున్న 'బాడ్మింటన్' 'టెన్నిస్' మొదలగు నాటలు కొంత తడవాడి యువల 'ఘోషాకా' రెక్కి వారిధితీరమునకు 'షికారు'గాఁ బో

వును. ఆమె మేనునిండ రత్నాభరణములే; యామె కట్టుబట్ట లన్నియు బంగారు జరీతో నిండినవే!

ఈరీతిగా గంగాబాయి యొక మహారాజ్ఞివలె ననంతైశ్వర్య మనుభవించు చుండుటచేఁ దాను మొగటదైన సాక్షిగాఁ బెండ్లియాడిన మగనిమాటగాని, కని పెంచి పెద్దదానినిగాఁ జేసిన తల్లిమాటగాని యామె స్మృతికిరాకుండెను. భాగ్యదేవత నిముసములో నెట్టివారి కన్నులైనఁ గప్పివేయునుగదా?

రామయ్యచెట్టితోఁ గాఁపురము చేయుటకు మొదలిడిన యొకయేఁడాదికి గంగాబాయి కొకకూఁతురుపుట్టెను. గంగమ్మ గర్భవతియై యున్నప్పుడు రామయ్య యనేకవిధములైన సూడిద లామెకుఁ గొని తెచ్చి యిచ్చుచుండువాఁడు. ఏడవమాసమునఁ దమిళాంధ్ర దేశాచారములనుబట్టి చేయు సీమంతోత్సవ మత్యుత్సాహముతోఁ జేయించినాఁడు పురిటికిఁ బ్రసిద్ధి వహించిన యాంగ్లేయ వైద్యురాండ్రను బిలిపించి చికిత్సఁ జేయించినాఁడు. బిడ్డపుట్టిన తర్వాతఁ దల్లిబిడ్డల కేలోపమును రానీక కాపాడినాఁడు. జాతకర్మాదికముల నత్యంత వైభవముతో నడిపించినాఁడు. బిడ్డకు ముద్దుముచ్చటలనెన్నివిధములనో తీర్పించినాఁడు. శిశురక్షణమునందుఁ గ్రమశిక్షనొందిన దాదుల నెందఱినో తనశిశువును బెంచుటకై నియమించియున్నాఁడు ఆబాలికకొఱకు రకరకముల దుస్తులు, త్రోపుడుబండ్లు, అలంకారములు, ఆహారపదార్థములు, ఆటవస్తువులు, మున్నగునవి తెప్పించినాఁడు. మూఁడవనెల ముద్దకుడుములనియు,

నాఁటివసనెలయరిసెలనియుఁ, దొమ్మిదిపనెలతోఁటవిందులనియుఁ బండ్రెండవనెల పంక్తిభోజనములనియుఁ, బేరులఁబెట్టి యెన్నెన్నో పిండివంటలతో మిత్రబృందమునకు విందులు సలిపించినాఁడు.

ఇట్టులా నూత్నదంపతులు రతీమన్మథులవలె, రంభానలకూబరులవలె, నూర్వశీపురూరవులవలె, వసంతవిలాసముతో, నత్యంతప్రేమతో, మహానందముతో రెండువసంతములు గడపిరి. వారిబిడ్డకు మొదటియేఁడు నిండఁగానే వారు వర్ధంత్యుత్సవమని పేరుపెట్టి 'కాస్మాపోలిటన్‌క్లబ్బు' సభ్యులనెల్లఁ దోఁటవిందునకుఁ బిలిచిరి. దానికెల్లరును వచ్చిరి గాని యప్పలసామి రాలేదు. అతఁడేయుత్సవములోను బాల్గొనుట మానెను.

అప్పలసామి ఆంధ్రభవనములో 'గాఫీ' భోజనము, మున్నగునవి గావించుచు, మధ్యాహ్నము మూఁడుగంటలకే క్లబ్బునకుఁ బోయి యేదోయొక క్రీడలోఁ బ్రవేశించి ప్రొద్దుక్రుంకువఱకు నాడి యవలఁ గడలియొడ్డునకుఁ బోయి చల్ల గాలిననుభవించి యెనిమిదిగంటలకిలుసేరును. తఱచుగా క్లబ్బులో నేవియో విందులు వచ్చుచుండును. వానిలో నొక్క దానియందును సహా పాల్గొనకుండెను. వానికి నేఁటికిని దన భార్య రామయ్యగారొద్దనే యున్నదనిగాని, యొకస్త్రీశిశువును గన్నదని గాని తెలియదు. నానాఁట వాని కామెయెడ

నాసయుఁదగ్గుచుండెను. ఎప్పుడేని కనఁబడదా యని యతఁడూహించు నూహాలన్నియు వట్టివగుచుండెను.

గంగమ్మశిశువునకు శకుంతలయని పేరిడిరి. ఒకనాఁడు బిడ్డకు సుమారు పదునెన్మిది మాసముల యీడు వచ్చినప్పుడు, రామయ్య ప్రియురాలితోను బిడ్డతోను బిడ్డదాదితోను బట్టణములో 'వైట్వే లైడ్లాఁ. ఆర్, అండ్ సన్సు, అనుసంగళ్ళంగోఁ గొన్ని వస్తువులు కొనుటకును, అనియుండవలెను. 'డియాంజలిస్,లోఁ గొందఱుమిత్రులతోఁ గూడి యల్పహారములు పుచ్చుకొనుటకును బయలుదేఱిరి. వారు కొనఁదగిన వస్తువులు కొనుచుండఁ బిడ్డపోరుపెట్ట నారంభించెను. దాని నూరార్చుటకు వారొక వింతత్రోపుడు బండిని గొనియిచ్చి దానియందాశిశువును గూర్చుండఁబెట్టి యొకగంటదాఁక నందందుఁద్రిప్పి తీసికొనిరమ్మని దాదితోఁ జెప్పి, తాముకావలయునవెల్లఁగొని 'హోటల్' లోనికి విందుఁ గుడువఁ బోయిరి.

ఈలోపున దాది బిడ్డబండి త్రోసికొని 'మౌంట్రోడ్' లో నొకప్రక్కగాఁ బోవుచుఁ గొంతదవ్వేఁగి 'స్పెన్సరు' వారి యంగడికి దగ్గఱనుండు వంతెనకడఁ దనప్రియుఁ డొకఁడు కనఁబడఁగా, బిడ్డను బండినుండి క్రిందికిదింపి, యొక చెండు చేతికిచ్చి యాడుకొమ్మని చెప్పి, తానును దనప్రియుఁడును సమీపముననే నిలిచి, సరసాలాపము లాడుకొనుచుండిరి. వారావేడుకమాటలలో లోకమే మఱచియుండిరి. బిడ్డ బంతిని దొరలించుకొనుచు దవ్వేఁగియుంటయు వారు గ్రహింపకుండిరి.

ఆబంతి వంతెన కొకప్రక్క నడుగుననున్న యినుపకమ్మిలకు నడుమఁ బడినది. శిశువు నిలువుఁ గమ్మిలలోనుండి తూఁతి యడుగునఁ బడియున్న కంమకము నందికొన యత్నించుచుఁ గాలుజాఱి క్రిందిప్రవాహములోఁ బడిపోవుచుండెను. కాని యది తొడుగుకొన్న చొక్కా,యందొక యినుపకొమ్మునకుఁ దగులుకొనుటచే, నది క్రిందికి వ్రేలాడుచుఁ గారు కారున నేడ్చుచుండెను. పిల్లయవస్థ కొంచెమేని దాదిగాని దాని యుపనాయకుఁడుగాని యెఱుంగకుండిరి. బిడ్డ విలవిలఁ దన్నుకొనుటలోఁ జొక్కా యంతకంతకుఁ జినుఁగుచున్నది. దానిని బోవువారెందఱో యాశిశువును జూచి గుంపుగూడి చూచుచుండిరి. కాని యెక్కరును సాహసించి దానిని రక్షింపరైరి. క్రింది ప్రవాహముఁజూడ నగాధజలమయమై యున్నది. బిడ్డను గాపాడఁజూచినఁ దమప్రాణముకూడఁ గోల్పోవలసి వచ్చునేమో యని వారిభయము. ఇట్టులుండ నాదారిని మనయప్పలసామి పోవుచుండెను. అతఁడాగుంపును జూచి యందేమున్నదో కనుఁగొనఁ బోయెను. ఆపదయందున్న బిడ్డనుజూచి యుత్తరక్షణముననే ప్రవాహములో దుమికి యీఁదుచు బిడ్డ వ్రేలాడుచున్న వంతెనకంబము కడకు వచ్చి, కంబముపైకిఁ జేతులతో నెగఁబ్రాకి, యొకక్షణములోఁ బడిపోనున్న బిడ్డను పైకిఁదీసి, వినోదముఁ జూచుచు నిలిచియున్న వారిలో నొకని కందిచ్చి, తాను మరల సురక్షితముగా నీఁది బయటికి వచ్చెను. ఇంతలో దాదియు నెత్తియు నోరును గొట్టుకొనుచు వచ్చి, మ్రొ

త్సమఖంబునుండి వెలువడిన బిడ్డనెత్తుకొని లాలించి దాని ప్రాణముం గాపాడిన యాపురుషునిఁ గొనియాడి, దానిని దల్లిదండ్రులయొద్దకుఁ గొనిపోయి యప్పగించి, జరిగిన కథయంతయుఁ జెప్పెను. వారును దాము లేచిన వేళ మంచిదగుటచే నాపత్తునుండి వెలువడి తమబిడ్డ తమకు దక్కినదని సంతోషించుచుఁ దమ శిశువునకుఁ బ్రాణదానముచేసిన యపూర్వపురుషుని వేనోళ్లఁ బొగడుచు నింటికేఁగిరి.

ఆర్తసంరక్షకుఁడగు నప్పలసామి నెవ్వరును గుర్తింపలేదు. అతఁ డాంతరంగికదుఃఖముచేఁ గుంగి కృశించిపోయి యుండెను. అతఁడును దానొక సత్కార్యమును నాఁడు చేయఁ గల్గితిని గదా యని సంతసించుచుఁ దనదారిని బోయెను. కాని యతఁడా బిడ్డ యెవరిబిడ్డయో యరయనేలేదు. రక్షణోద్దేశము గలవారికి రక్షించుటే ప్రధానముగాని యితరవిషయము లారయఁ బనిలేదు. ఆర్తియందున్నవారు శత్రుపుత్రులైనను మిత్రపుత్రులైనను వారి కొక్కరూపే. అట్టి యకారణకారుణ్యము గల యార్తత్రాణపరాయణులు తమనామరూపములు గోప్యములుగా నుంతురు. అప్పలసామిని „నీవెవరవు? మాబిడ్డను గాపాడినందులకు నీకుఁ దగిన బహుమాన మిప్పింతును. నీవేవీధినుందు"వని దాది యడిగినప్పు డతఁడు „నేనెవఁడనైన నేమి? ఒక మనుష్యుఁడను నోరెఱుఁగని కూన యొకటి యాపద నొందుచున్నది. దానిని గాపాడ యత్నించుట మానవమాత్రునికెల్లఁ గర్తవ్యమే. కావున నాకును గర్తవ్యమే యైనది. నాథ

ర్మము నేను నెఱపితిని. ఇందుఁ గొనియాడఁదగిన దేదియులేదని
నాకేమియుఁ బ్రత్యుపకారము వలదు." అనిపలికి తనదారిం
దానుబోయెను.

ఆహా! యట్టి సౌశీల్యముగల పురుషపుంగవుని వీడి
కేవల బాహ్యాడంబర పరుఁడగు నెకధనికుని మాయలకులోనై
గంగాబాయి తనకుఁ దనజాతికిఁ దుడిచివేయరాని మచ్చఁ
దెచ్చినదిగదా! ఆతని తత్త్వమే యామెకు బోధపడియున్న,
నట్టి మాయా వాగురలఁబోఁ బడకపోవునుగదా!

---

## ౧౮ తోఁటవిందు

—(o)—

గంగాబాయి కూఁతురు మృత్యుదేవతవాతఁ బడక
తప్పింపఁబడుటచేత మరల జన్మించినదని భావించి తలిదం
డ్రులు గొప్పయుత్సవముం జేయ సమకట్టిరి. దేవాలయము
లలోఁ బూజాభిషేకములు గావించిరి. బీదలకన్నదానము
చేసిరి. మిత్రులకు బంధువులకు గొప్పతోఁటవిందొకటి చేయఁ
దలఁచి పట్టణమంతయు నాహ్వానపత్రికలతో నింపివైచిరి.
కాస్మాపోలిటన్ క్లబ్బు సభ్యులతోఁ బాటు మనయప్పలసామి
కిని నాహ్వానమందెను. ఈవిందు గొప్పదగుటచే నిదివఱకు
దేనికిని బోవకున్నను దీనికైనఁ బోయి కన్నులవేడుకయైనఁ
దీర్చికొందమని తలఁచి యప్పలసామి పోవ నిశ్చయించు
కొనెను. ఆవిందును నడపువాఁడు తన్ను మోసముఁ జేసినవాఁ

డనికాని, యావిందు తన్నుఁదోసిపుచ్చి యొరునితోఁ గాఁపురముఁజేసి కన్న తన యిల్లాలిబిడ్డకై యనిగాని యతఁడెఱుఁగఁడు.

వింధ్యపూర్ణమల్లి బాటమీఁదనున్న 'రామానంద విలాస' మను భవనమందలి పుష్పవనములోఁ జేయఁ బడు చుండెను. ఆవనములోఁ జెట్టుచెట్టునకు నమర్పఁబడియున్న విద్యుచ్ఛక్తిచోదకతంతులచే దీపములు వెల్గింపఁబడెను. కొన్ని గోళాకారముగను, మఱికొన్ని చతురస్రముగాను, వేఱొకకొన్ని యష్టభుజ పీఠాకృతిగను గురిచీలు నిలుపఁబడి పరిత్యాసనసమూహమధ్యమందు నొక్కొక్కరకము మేజా బల్ల యుంపఁబడెను. ఒక్కొక కురిచీకెదుట బల్లమీఁద నెన్నియో వెండిపళ్ళెరములు, పాత్రములు, వివిధ రుచ్యాహార వస్తువులతో నింపఁబడినవి పెట్టఁబడి యుండెను. చలువ మడుఁగులఁ గట్టి మూర్తీభవించిన నిర్మలదేవతలనఁదగి యున్న వారెందఱో వడ్డనచేయుటకు సిద్ధముగానుండిరి. అందు హైందవులలో శాకాహారులెల్ల నొకప్రక్కను, దొరలును మాంస భక్షకులగు నితరహైందవులును, వేఱొకప్రక్కను నాసీనులై యుండిరి. తత్రత్యఘనులసంఘములో శాసననిర్మాణసభా సభ్యుఁడగు నొక పాశ్చాత్యుఁడు నాఁటిసమావేశమున కధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడెను.

సాయంకాల మాఱుగంటల కంద ఱాసీనులయిరి. అధ్యక్షులు లేచి రామయ్యచెట్టిని గూర్చియు నతని యాదా

ర్యవిశేషముం గూర్చియు, నతని బిడ్డకుఁ గల్గినయాపత్తునుగుఱించి యు, దాని నొకమహాసీయుఁడు తప్పించుటను గూర్చియు, నాంగ్లమున నుపన్యసించి తమత్సవాగత సభ్యులపక్షమున రామయ్యకుఁ గృతజ్ఞతావందనముల ర్పించుచు విందుం బ్రారంభింపఁజేసెను. నందనవనములోఁ గూర్చుండి యమృతాహార మాహరించు దేవతానిచయములం బోలియున్న యా సభ్యులెల్ల విందుఁ గుడువనారంభించిరి. మనోహరమైన గీతములను 'గ్రామోఫోను' పాడుచుండఁ, బైనుండి 'ఎలక్ట్రిక్ పంకాలు' చల్లని తెమ్మెరలను వీఁచుచుండ, నతి రుచ్యపదార్థముల భక్షించుచు విందు లమందానందమందిరి. దొరలు మున్నగువారు పుష్టిదాయకములై తమోగుణవర్ధకములగు మాంసంపువస్తువులు సరాయములు మొదలగునవి గైకొని యొడలుమఱచి నేలం బొరలఁదొడంగిరి. రెండవప్రక్కఁ గూరుచుండి యెట్టి యాహారముం గైకొనక కేవల వినోదము కొఱకే వచ్చియున్న మనయప్పలసామి యాతీరుం గాంచి యచ్చెరువొందుచుండెను.

విందు ముగియుటకు ముందు రామయ్య లేచి వచ్చిన వారికెల్ల వందనము లర్పించి తనబిడ్డక్షేమమునకై దైవముం బ్రార్థించువాఁడని యందఱ నర్థించెను. అతని యుపన్యాసములో నిట్టులకూడ వచించె. "నాకూతు ప్రాణములు కాపాడిన యాపురుషపుంగవుఁ డెవ్వఁడో తెలియరాకున్నది. అతని యాకారముఁజూడ ఘనసంఘములోఁ జేరిన వాఁడనియేతోఁచు

చున్నదని మాదాది చెప్పుచున్నది. వీరిలో నెవ్వరేని వాని నెఱింగియుందురేని నాకుఁదెల్పిన, నేను వానిని దగినవిధముగా బహూకరింతును. నాభార్య వాని కాళ్ళమీఁదఁబడి వాఁడేమి కోరిన నది యిచ్చును.” ఈమాటలు వినియుఁ దానే యారక్షకుఁడనని యెఱింగియు మన యప్పలసామి మాటాడకుండెను. ఆహా! యేమి వానిసౌశీల్యము! ఏమి వానియుపకారగుణౌన్నత్యము!

పురుషులకిట్టివిందు తోఁటలో జరగుచుండ భవనమందలి మధ్యాగారమున స్త్రీలకు గంగమ్మ మఱియొకవిందు నడపెను. దాని కడియారులోనున్న దివ్యజ్ఞానసమాజసభ్యురాలగు నొక విదుషీమణి యధ్యక్షతవహించెను. బిడ్డ గంగమ్మవలె సుందరియాటచే నందఱు దానినెత్తుకొని ముద్దాడి దాని యాయురైశ్వర్యాభివృద్ధికై ప్రార్థనలుజరపిరి. వారిలో నెవ్వరును బురుషులుండు తావునకురాకుండుటచే నప్పలసామికి గంగమ్మ కనఁబడకుండెను. ఆమెయుఁ బురుషులలోఁ దన మొదటిమగఁడు కూర్చుండియున్నాఁడని యెఱుఁగకుండెను. ఆమె యాతనిని విస్మరించినదనియే చెప్పవచ్చును.

విందుముగిసెను. ఒక్కొక్కఁడుఁడే వచ్చి రామయ్యకరముంబట్టి యాడించి యేఁగుచుండెను. దొరలు కొందఱు హిందువులుకొందఱు తప్పఁద్రావినవారు లేవలేక తమ్ములేవఁదీయఁ బోవు సేవకులఁ గొట్టుచుఁ దిట్టుచుఁ బొరలుచుండ నప్పలసామి వారిలో నొక్కొక్కరిని గట్టిగాఁ బట్టుకొని వారివారిబండ్లలోఁ

గూలవేయుచుండెను. తనబంట్లవలన వానింగూర్చివిని తనక ష్టసాయపడిన యాపురుషుని బహూకరింప రామయ్యరాఁగా నతఁడు శాన్నిపకుండెను. అతఁ డెవ్వరితో నేమియుంజెప్పక తనదారిని దానుబోయెను.

ఈవిందు జయప్రదముగా జరగుటకై నటేశము కూఁడఁ జాలఁదోడ్పడెను. కాని యతఁడొకవిధమైన యాశ్లోనే పనిజేసెను. రామయ్య యట్టియఖండసౌఖ్య మా గంగమ్మతో ననుభవించుట యతనికిఁ గిట్టకుండెను. కొన్నాళ్ళమాత్రమే రామయ్య గంగమ్మ ననుభవింపవలెననియు నవల నామె తనవశము కావలయుననియు, నతని సంకల్పము. అది యీడేఱునట్లు తోఁపక యతఁడీసుతో వర్తించుచుండెను. ఏదేని భేదోపాయముం బ్రయోగించి యా దంపతులను విడఁదీయ యత్నించుచుండెను.

మిత్రులెల్లఁ జనినతర్వాత రామయ్యయు నటేశము ను నొకగదిలోఁ గూరుచుండి యిట్లు ప్రసంగించిరి.

నటే—తమ్ముఁడా! నేఁటివిందు బహువినోదలీల జరగినది. కానియొక్కఁడనో పల్లెటూరిలోఁ బాలమ్ముకొను గొల్లదియొక్కతె, యించుక యంగసౌష్ఠవముంగలిగి దొమ్మరవిద్దెలలో నాఁకితేఱి నిన్నాకర్షించుటయు, నీవు దానివలలోఁ బడిపోయి యదియమ్మనాఁ డబ్బనాఁ డెఱుఁగని యఖండైశ్వర్యములు నీవలనఁ బొంది తనబిడ్డక్షేమమునకై మహారాజులోనర్చు విందు నీచేతఁ జేయించుటయుఁ జూడ నాశ్చర్యము

గొలుపక మానదుసుమా! నిన్నుదైవసాక్షిగాఁ బెండ్లియాడినది, నీవిప్పుడు వలచినకాంతకన్న నెన్ని మడుంగులో యందము గలది, కలిగినన్ను నిన్నుఁ దప్ప నన్యునెఱుంగనిది, యాగర్భ శ్రీమంతురాలు అట్టి నీయిల్లాలి కిట్టివైభవములు లేకపోవుట మాత్రము బాగుగలేదుసుమా ?

రామ— అన్నా ! నీవుచెప్పినది నిజమే. కాని నాత ప్పేమిగలదు ? ఆమెకు నాభావములు పనికిరావే ! నా కన్నిట వ్యతిరేకమేకదా ! ఆమెనసిగా నున్నన్నినాళ్లు నేను బరస్త్రీము ఖము చూచితినా ? నీవు చేసికొన్న భార్యను మోసగించి పాడుపోకడలు పోవుచుంటివి గాని, నేనెన్నఁడేని యట్టులుంటి నా ? నాకు సరిపడనప్పుడు తప్పుదారులం బట్టవలసివచ్చెను.

నరే—తప్పుదారులని నీవే యొప్పుకొనుచుంటివిగదా! ఇకనైన వానిని మానుటొప్పు. నామాటయందువా! పైపో కడ లెన్నియున్నను, భార్యను బెందనాడుట లేదే ! గంగాబా యిని విడిచిపెట్టుమని నేను జెప్పను. ఆమెను బల్లవరములోనే యుంచి యామెతో నెడనెడ సుఖింపవచ్చును. ఇక్కడ నీభా ర్యనుంచి యామెతోఁగూడ సఖ్యత వహించియుండుము.

రామ—అదియెన్నటికి సరిపడదు. గంగాబాయిని విడు చుట నాప్రాణమును విడుచుటే. ఆమె నుపేక్షించుట నన్నునే నుపేక్షించుకొనుటే. నాప్రేమ రెండుభాగములుగాఁ బంచి యీయ వలనుపడదు. నాప్రేమరాజ్యమేలు రాణి యొక్కతె యే గాని పల్వురుగారు. అదియే గంగాబాయి.

నటే—ఇట్టి నీతివాక్యములు పల్కువాఁడవు, నీవేగంగమ్మ గర్భవతిగానుండఁగా మైలాపురములోనున్న మధురవాణి యింటికేఁగుచు దానితోఁ గొన్నిమాసములు సుఖింపలేదా?

రామ—అది ప్రేమచేఁగాదు, కామోద్రేకముచేఁగాని. నేనుమడిఁ గట్టుకొంటినని చెప్పను. ఆవేశ్యాసంపర్కము తాత్కాలికముగాఁ దెచ్చుకొన్నదే కాని శాశ్వతముగా నిల్పుకొనఁ దలఁచినది కాదు. అదియు నీవలననే సమకూడినదికావున, నాపాపము నీయదే కాని నాదికాదు.

నటే—అట్లైన మధ్యమధ్యంబున నట్టి తాత్కాలికవు బేరముల కడ్డులేదందువుకాఁబోలు? సరే. నీయిష్టమెట్లో యటులేగావింపుము. నేనిఁకఁ బోవలయును.

ఇప్పుడు రామయ్యతో వాదించినలాభములేదనియెంచి నటేశములేచి తనబసకుఁ బోయెను. రామయ్య ప్రియురాలి కడకుఁ బోయెను. కాని యతఁడామెతో మాటాడుటకు వీలు చిక్కలేదు. ఏలయన గంగమ్మయు నొకముసలామెయు మఱి యిద్దఱు యువతులును గూడి యేదో మాటాడుకొనుచుండిరి. రామయ్య తన పడకగదిలోనికేఁగి యించుకతడవు మేను వాల్చెను.

ఆరోగ్యముపిళ్ళగారి యత్తమామలు చెన్నపురమందే యుండిరి. మామగారికి 'బ్యాంకి' లో నొకగొప్పయుద్యోగము గలదు. ఆయనకూడ క్లబ్బులో నొకసభ్యుఁడుగావునను, బట్టణమందున్న గొప్పయుద్యోగులలో నొకఁడగుటచేతను రామ

య్యచెట్టిచే నాహ్వానింపఁబడెను. ఆతఁడును భార్యయు విందారగించిరి. అతనిభార్యయూసుబ్బులక్ష్మమ్మతోనామెకూఁతు లిరువురును విందునకేతెంచిరి. ఇప్పుడు గంగమ్మ మాటాడు చుంట యాస్త్రీలతోనే. వారు, రామయ్యచెట్టిభార్య యెవ్వతెయో యనుకొనిరి. కాని పరికించి చూడఁ దనపెద్దకొమరితయగు సుందరమ్మకు గోపాలపట్టణములోఁ బరిచయురాలగు గంగమ్మయేయని సుబ్బులక్ష్మమ్మ గుర్తింపఁగలిగెను. ఆవిందారగించు సమయమున గంగమ్మనుజూచి "అమ్మా! ఇంతకుమున్ను మిమ్మెక్కడనో చూచితినని తోఁచుచున్నది. మీ రెప్పుడేని గోపాల పట్టణములో నుంటిరా? " యనియనెను. గంగమ్మ యుంటినని మారుపలుకుచు నావల భాషించుకొందమని నిలిపివైచెను. విందుముగిసి యందఱేఁగినతర్వాత గంగమ్మ వారిని దీసికొని లోపలిగదిలోనికిఁబోయి యిట్లు భాషింపఁదొడఁగెను.

గంగమ్మ—అమ్మా! మీరు గోపాలపట్టణ మెప్పుడు వచ్చితిరి.

సుబ్బు—మాయమ్మాయి, సుందరమ్మ, స్టేషన్‌మాష్టరుగారి భార్య యచ్చటనే యున్నది గావున, నేనాయూరికిఁ దఱచుగాఁ బోవుచుందును. ఒకప్పుడు మిమ్మచ్చటఁజూచినట్లు జ్ఞాపకమున్నది.

గంగ—అవునమ్మా. చూచియేయుందురు. మేము గోపాలపట్టణములోనే యుండువారము. (అని సిగ్గుచేఁ దల వంచుకొనెను.)

సుబ్బ—మాకునచ్చటఁ బాలిచ్చు గంగమ్మ మీకే మేని చుట్టమా ?

గంగ—(లజ్జచే నిఁకనుం దలవంచియే) అమ్మా! అని ర్భాగ్యురాలను నేనే. నాభర్తకును నాకును గొన్నివివాదము లురాఁగా నేనీచెట్టిగారి యండనుండి జీవించుచుంటిని. నాయు నికి నాభర్తకుఁ దెలియదనియే నానమ్మకము. మీరును నన్నుఁగూర్చి యెవ్వరికిని జెప్పకుందురుగాక యని కోరు చున్నాను.

సుబ్బ—అమ్మా ! నేనెవ్వరితోఁజెప్పుదును ? నాకే మికావలయును ? ఏదెట్లయినను, నీవు సుఖముగా మనుచుం టివి. పండువంటి బిడ్డను గంటివి. నాకుఁ జాలసంతోషముగా నున్నది. అమ్మా ! నీభర్త నీ కనుకూలుఁడేగదా !

గంగ—అమ్మా ! అనుకూలుఁడే. కాని హృదయము నకేదో యావేదనయే సర్వదా కలుగుచుండును. ఆనందము లేకున్నది.

సుబ్బ—ఎక్కడికక్కడికే సరిపెట్టుకొనవలయును. చిం తల నొందరాదు.

గంగ—తమబసయెక్కడ?

సుబ్బ—తిరువళక్కేణిలోని వీరరాఘవమొదలియారు వీధియందు 111వ యింటి యందు మేము వసింతుము. ఎప్పు డేని (షికారు, గా మాయింటి కొకసారి రాఁగోరుచున్నాను.

గంగ—తప్పకవత్తును. మీదయ కెంతయుఁ గృతజ్ఞురాలను.

ఇట్లుసంభాషించి యాస్త్రీలు తమబసకేఁగిరి. పాలమ్మ గంగమ్మ, సర్కసుతో సాముగరిడీలుచేయు గంగమ్మాళయి దేశదేశముల వ్యాపించుకీర్తి సంపాదించుట, యవల నొక కోటీశ్వరుఁజేపట్టి గంగాబాయియై యఖండైశ్వర్యము లనుభవించుట, యెట్లు తటస్థించెనోగదాయని వారు పల్కుకొనుచు భగవంతుని వింతచెయిదముల కత్యాశ్చర్యము పడుచుఁ బోయిరి. వారు వెళ్ళినతర్వాతఁగూడ గంగాబాయి చాల సేపు చింతాసాగరమున మునిఁగియే యుండెను. అయ్యెడఁ బ్రియుఁడువచ్చి "ప్రియా! ఇప్పుడు నీకుఁ దృప్తికలిగినదా?" యని యడిగెను. తానట్లు చింతతోనుంట ప్రియునకుఁ గష్టముగాఁ దోఁచునని యెంచి గంగాబాయి లేని సంతోషముఁ దెచ్చుకొని యతనితోఁ దనకంతయుఁ దృప్తికరముగానున్నదని పలికెను. "నేఁటివిందునకు నీమగఁడుకూడ వచ్చినట్లు నాకుఁ బొడఁగట్టినదిసుమీ!" యనియు నతఁడు పల్కెను. గంగమ్మ యాతురముతో "మీరుమాటాడలేదా?" నేనిచ్చటనుండుట యాయన యెఱుఁగునా?" యని ప్రశ్నించెను. "నేనుమాటాడలేదు. దూరమునుండి చూచితిని. నీయునికి యేమియు నతనికిఁ దెలియదు. తెలిసిన నల్లరిచేయఁడా?" యని మాఱు పల్కి భార్యతో శయనాగారములోనికిఁ బోయెను.

# ౧౫ పునస్సమాగమము

రామయ్యచెట్టి పెండ్లిభార్య, జానకమ్మ తేనాంపేటలోఁ దండ్రిగారి గృహమున నున్నది. ఆమెతండ్రి హైకోర్టువకీలుగా నుండి చాలధనమార్జించి చనిపోయెను. అతనికి నల్వురుపుత్రికలును నొకపుత్రుఁడును బుట్టిరి. వారిలో జానకియే పెద్దది. మగపిల్లవాఁడందఱికన్నఁ జిన్నవాఁడు. ఇంకను గళాశాలలోఁ జదువుకొనుచున్నాఁడు. ఆపిల్లవానికిఁ దల్లియే సంరక్షకురాలుగా నున్నది. వానితోఁబాటు జానకమ్మకూడఁ బుట్టినింటికడ నుండెను. జానకమ్మ కన్నియు సుగుణములే. ఒక్కయాభిజాత్యగర్వము మాత్ర మతిశయముగా నుండుటచే మగనియడుగులకు మడుఁగులొత్తుచు జీవించుటకుమాత్ర మొల్లకుండెను. అతనియెడ నుచితగౌరవము చూపకపోలేదు. కాని యతనికది చాలకుండెను. ప్రతిదిన మాదంపతు లెందునకో యొకందునకు వాక్కలహములోనికి దిగుచుండువారు. అది క్రమముగా ముదిరి యొకనాఁడతఁడు భార్యను వీధిలోనికి గెంటి తలుపువైచుకొనెను. ఆయవమాన మామె సహింపఁజాలక పతినేమియు బ్రతిమలాడక తిన్నఁగాఁ దల్లి కడకేఁగెను. తల్లికామె యెంతమాత్రము భారముగా నుండలేదు. తనకిప్పుడిద్దఱుకొడుకులని సంతోషించుచునియు నామెపట్ల కూఁతు నాదరించుచుండెను. ఇట్టులైదేండ్లు గడచినవి. ఇరుగుపొరుగుననుండు నమ్మలక్కలు పదేపదే యామెను భర్తకడకుఁ బొమ్మనియుఁగాఁపురము నిల్పుకొనుమనియు నుపదేశించుచుండిరి.

అవల భర్తదుర్నీతియు నామెకుఁ దెలిసెను. కాని యామెయభిమానము నైచ్యమున కొడిఁగట్టి తనయుం దేతప్పులేనిదే భర్తపాదములపైఁ బడుట కొప్పుకొనకుండెను.

రామయ్యతో నట్లుసంభాషించి నటేశ మామరునాఁడు తెనాంపేటకుఁబోయి జానకితోను నామెతల్లితోను రామయ్య యునికినిగూర్చి సవిస్తరముగఁ దెలియఁజేసెను. తనయల్లుఁడారీతి నొకగొల్లదానిని జేపట్టి యిల్లు గుల్లఁజేసికొనుచుంట విని జానకితల్లి మిగుల దుఃఖించెను. ,,అమ్మా! నీయభిమాన మొకింతతడ వావలఁబెట్టి నీవు నీభర్తకనుకూలముగా మాటలాడుచు నతనితోఁ గాఁపురము చేయకున్న బోలెఁడాస్తియు బొగ్గులగును. మే మెంతాదరించినను నీకత్తింటిగౌరవము పుట్టినింట రాదని నమ్ము,, మని యామె కూఁతునకు బోధఁజేసెను. కూఁతురును, ,,అమ్మా! తప్పుడు నన్నేమిచేయుమందువు?,, అని తల్లినడిగెను. అప్పుడు నటేశ మడ్డుపడి యిట్లనియె. ,,తల్లీ! నీవునేఁడు నీసర్వాభరణములను దాల్చి వేశ్యకన్నను మిన్నగ నలంకరించుకొని యొక ఫొటో, తీయించుకొని నాచేతికిమ్ము. దానిం బురస్కరించుకొని నేనొకనాటకమాడి నీమగఁడు నీపాదములచెంతకు వచ్చునట్లు చేసెదను. నీవు నేఁటినుండి బీచ్,కిఁ బ్రతిసాయంకాలమున వాహ్యాళికై వచ్చుచుండుము. నీభర్తకు నిన్నుఁజూపి నీయం దతని కనురాగముం గల్గింతును. కొలఁదిదినములలో నే నాగొల్లదానిని దఱిమివేయించి నీయింటికి నిన్ను రావింతును.,,

ఈపలుకులువిని జానకియుఁ దల్లియుఁ జాలసంతసించిరి. అతని యుపదేశప్రకార మాచరింతుమని వాగ్దానముఁజేసిరి. ఆమాటఁబుచ్చుకొని సతీశ మింటికిఁ బోయెను. రామయ్య గంగమ్మను విసర్జించినఁ దాను గైకొనవచ్చునను దుర్బుద్ధిచే తనే వాఁడిట్లు లాయిల్లాలికిఁ దోడ్పడుచుండెఁగాని సదుద్దేశము తోఁగాదు.

రామయ్యచెట్టికి గంగాబాయిమీఁద మొదటఁగలిగినంత వలపిప్పుడు లేదు. ఆమె గర్భవతిగానుండ మధురవాణి, యనఁబడువేశ్యతో నతఁడు చరించియుంట మున్నెఱింగింపఁ బడెఁగదా? గంగమ్మకు బిడ్డపుట్టినతర్వాత దాని సంరక్షణము నకై కొంతకాలము వినియోగింపవలసి వచ్చుచుండెను. మునుపటివలె సర్వదా ప్రియునిచెంతఁ గూర్చుండి యతని కింపునింప ననువుపడకుండెను. ఆయమయెడల రామయ్యకించుక నిర్వేదము గల్గుచుండెడిది. కాని మొదటఁ దనహృదయవాటి కను నాటుకొని యున్న గాటంపు వలపుటలుఁగును బెఱుక నతనికి వశముకాక యెటులో తృప్తిపడుచుండువాఁడు. బిడ్డ పుట్టినతర్వాత గంగాబాయి యొడలిచాలును నించుక తగ్గిపో వుటచేత రామయ్యకు మునుపటియంతటి మమకారమామె యందుఁ గాన్పింపకుండెను. అది యప్రయత్నముగా నానాఁట క్షీణించుచుండె.

ఎటులో బిడ్డకు రెండేండ్లు నిండువఱకు వారికాఁపురము తిన్నఁగాజరిగిపోయెను. అవల గంగమ్మ మరల గర్భిణియ

మ్యెను. మూఁడవనెల గర్భంబున నామెకుఁ జాల జబ్బుచేసెను. డాక్టరుదొరసానులు వచ్చి చికిత్సఁజేసిరి. కాని లాభము లేకపోయెను. గర్భమునిలువక చెడిపోయెను. ఆమెమాత్రము విశేషప్రయాసముమీఁద బ్రదికెను. మిగుల నీరసస్థితిలోనుండి యామె బలముగలుగుటకు మందులు పుచ్చుకొనుచుండెను. ఐదాఱుమాసములామె పథ్యపానములు జాగ్రత్తగాఁ జేయుచు మఁదు పుచ్చుకొనవలసియున్నది. ఇప్పట్ల మరల రామయ్య మనస్సు చలింపనారంభించెను. కాముకుఁడౌటచే మరల నన్యకాంతలఁ గాంక్షించుచుండెను.

ఇదియే తగినసమయమని యెంచి నటేశము జానకి ఫోటో పట్టుకొని రామయ్యకడకు వచ్చి, కొంత తడవేవేవో మాటలాడి, యవల ఫోటోలు వానిసొగసు మున్నగు నంశములఁగూర్చి భాషించి కడపటఁ దనజేబులోనున్న జానకిపటముంజూపి, ,,ఇది యెవ్వరిదో యెఱుఁగుదువా?" యని యడిగెను. రామయ్య యాపటమునందలి స్త్రీ సౌందర్యమున కాశ్చర్యపడి, ,, అన్నా! ఎవ్వరీవేశ్య? ఈమనపట్టణముననే యున్నదా?,, యని ప్రశ్నించెను.

నటే—ఈమె యీపట్టణమందున్న వేశ్యయే.

రామ—ఎక్కడనున్నది? నేఁడు మనముదాని యింటికైపునఁ బోవుదుమా?

నటే—వేశ్య యైనంతమాత్రమున మనకు లభించు ననుకొంటివా? దాని యింటివైపునఁ బోయినచో దాని ప్రియు

లెవ్వరైన మనలఁ జూచి కినియవచ్చును. మన మనమానము నకుఁ బాలుకావలసివచ్చును. వలదు. దానియింటికిఁబోవలదు. అది ప్రతిసాయంకాలమున ‘బీచ్’కి షికారువచ్చును. అచ్చట నొక్కతెయే యున్నవేళఁ గనిపట్టి పట్టుకొనవలయును.

రామ—అట్లయిన నేఁటిసాయంకాలమే పోవుదము. శుభస్య శీఘ్రమ్మని పెద్దలందురు.

నటే—నేఁడువలదు. రేపుపోవుదము. నేఁటికి నేనేఁగి నిన్నుఁగూర్చి యుపోద్ఘాతముగాఁ గొంతపల్కివత్తును. ఒకవేళ నదిదారికి నీకు లోఁబడుననుకొనుము. అది సవతిపోరు సమ్మతించునా? అప్పుడు గంగాబాయి మాటయేమి?

రామ—అప్పటికొలఁదిఁ జూచుకొందములే. గంగాబాయి స్వస్థపడునప్పటి కెట్లులైన నాఱునెలలు పట్టునుగదా? అందాఁక నామెకుఁ దగినసొమ్మిచ్చి యెక్కడనో యుంచి యా వేశ్యతో గంగాబాయిని వదలివేసినటులే తెలియఁజేయవచ్చును. ఆఱునెలలు దాఁటినపిమ్మటమాట యప్పుడే యాలోచించుకొనవచ్చును.

నటే—సరే. ఆలాగుననే చేయుదము. రేపుసాయంకాలమున మాయింటికి రమ్ము. అక్కడినుండి క్లబ్బునకేఁగి యచ్చటినుండి బీచ్‌కిఁ బోవుదము. నీవును లెస్సఁగా సింగారించుకొనుము.

రామయ్యవల్లెయనెను. నటేశము గృహమునకరిగెను. మఱునాఁటి సాయంసమయమున రామయ్య విలువగల బట్టలు

గట్టి దేహమునిండ నత్తరులు పూసికొని తలకు సువాసనతై
లము రాచికొని ఠీవితో బండినెక్కి బయలుదేఱెను. నటేశ
మును సఖుఁడును గూడి కొంతసేపు క్లబ్బులో నాటలాడికొని
యినుఁడస్తమించిన వెనుక వయ్యాళి కేఁగిరి. తిరువళిక్కేణి
ప్రక్కనున్న సముద్రపుటొడ్డున నద్దమువలె స్వచ్ఛమగు
బాటప్రక్క మోటారునాఁపించి యందు విలాసలీల జానకి
కూర్చుండియుండెను. ఆమె భర్తృవియోగము గల్గిన యీ వై
దేశ్యలోఁ గొంచెముగా బలిసి వేషాంతరమందుంటచే
నానవాలు పట్టఁజాలనిరీతిగా నుండెను. సహజసౌందర్యము
గలదగుటచేతను, ప్రకృతము స వేశ్యవలె నలంకరించుకొన్న
దగుటచేతను బాటనేఁగు గోవాండ్లెల్ల నామెవంక విలాస
ముగాఁ జూచుచుఁ గారుకడకువచ్చి మాటాడ కుతూహల
పడుచుండిరి. నౌకరు వచ్చినవారినెల్లఁ జీదరించి వెడలఁగొట్టు
చుండెను. కొంతసేపటికి మన చెట్టియారు సోదరులు వచ్చిరి.
వారి నడ్డపెట్టవలదని జానకి చోదకునతో మెల్లఁగాఁ బలికెను.
వారకారు బాటకు రెండవప్రక్క నిలుపఁబడెను. నటేశము
చిఱునవ్వుతో రామయ్యను వెంటఁబెట్టుకొనివచ్చి, "సుందరీ!
నిన్న నేను బ్రశంసించిన రామయ్యచెట్టి యీతఁడే. ఈతఁడొక
కోటీశ్వరుఁడు. మహారాజుల కప్పుకావలయునేని చెన్నపురిలో
నీతఁడే యీయవలెను. నీసౌందర్యము నీరూపపటమందుఁ జూచి
యతఁడు నిన్నువలచి నీచెట్టఁ బట్టవచ్చి యున్నవాఁడు" అని
పలికెను.

జాన—(నునుసిగ్గు నటించుచు) అయ్యో! కాముకుల వలపుల నేనెఱుఁగుదును. తొలుత వలపులొలికింతురు. ఆవలఁ గికురించి మఱియొక కాంత చెంతకుఁ బోవుదురు. తుమ్మెదకొక పుష్పమును విటకాండ్రకొక వెలఁదియు నిర్ణయముండునా?

రామ—మోహనాంగీ! నేనట్టివాఁడనుగాను. నే నేవనితను జేపట్టినను దగినంత కారణమున్నఁగాని విడువను.

జాన—కారణముల కేమికొదువ? మీ మనస్సు మాఱినప్పుడెన్నియో కారణములు కన్పట్టకపోవు.

రామ—ఇంతీ! నామాటనమ్ముము. నీవే కారణము చేతనో నేను మొదటఁ బెండ్లియాడిన కాంతవలె నుంటివి. ఆమెను దైవసాక్షికముగాఁ బరిణయమైనట్టులే నిన్నును వరించితినని నమ్మి నా చెట్టఁబట్టి సంగీకరింపుము. నీవేమికోరిన నది యిచ్చెదను.

జాన—దైవసాక్ష్యము లీకాలమున వ్యర్థములే. ఆమెను దోసిపుచ్చినటులే నన్నును గావింతురేమో! ఎవ్వరెఱుఁగుదురు?

రామ—నీవెట్టి బాసలు చేయుమన్నఁ జేసెదను. నీకు నా యాస్తియంతయు వ్రాసియిమ్మన్న నిత్తును.

జాన—మీరు పరిక్కృతమును నొక కాంతను, సర్కసులో సాములు చేయువానిని, జేరఁదీసికొని యుంచితివి కాదా? ఆమెతో నాకెట్లు సరిపడును?

రామ—ఆమెకును నీకును సంబంధమే యుండదు.

నీవు నా పూనమల్లి బంగాళాలో నుందువు. ఆమె పల్లవరము లోనుండును.

జాన—అయ్యా! పాప మామె పేరిమను నేను బంచుకొని మీతో సుఖమనుభవించుట న్యాయముగాదు. ఆమె యొక యిల్లాలయ్యు నెంతగా మిమ్ము వలచుటచే మీయొద్దికి వచ్చియున్నదో! అట్టియామె కుత్సాహాభంగము గల్గించుట నాకుఁ దగదు. వలదు. నాతోడిపొందు మీరు కోరవలదు.

రామ—మనోహారిణీ! నీవిన్ని మాటలాడవలదు. ఆమెను బూర్తిగా నిరాకరింపుమందువేని, నేఁడే కొంతభరణ మామెకేర్పాటుచేసి యామెను బంపివైతును.

జాన—సరియే. ఆమె పైఁగాఁ దెచ్చికొనఁబడినది గావున, మీరు కొంకక భరణమిచ్చి పంపివైతురు. మీ పెండ్లి పెండ్లాముమాట యేమందురు? ఆమె మంచిదిగావున మీయాటలు సాగుచున్నవి. ఆమెవచ్చి మిమ్ము నలుసతిలోఁ బెట్టిన నేమిసేయుదురు?

రామ—ఆమెకుఁగూడఁ గోరినభరణమిచ్చి వదలుచ్చుకొందును. నీవు రూపముచేతను, గంధర్వనిచేతను, నచ్చుముగ నా పెండ్లిపెండ్లామువలెనేయుంటివి. నీవిఁక భావముచేతఁగూడ నా పెండ్లిపెండ్లామవై పొమ్ము.

నటీ—సుందరీ! అన్నివిధముల సతఁడు నిన్నుఁ గోరుచున్నాఁడు నీవు మాఱుమాటడక సమ్మతింపుము.

జాన—సమ్మతింతును. కాని ముందుగా సర్కసుకాం

త కొక లేఖ, విడాకులైనట్లు తెలుపుచు, వ్రాసి, యామె కీయఁ దలఁచుకొన్న భరణ మిచ్చి వేయుఁడు. అవలఁజూతము.

రామ—అందున కెంతో కాలము గావలయునా! ఇదిగో 'చెక్కుబుక్కు.' ఇది సదా నాజేబులోనే యుండును. ఇప్పుడే దానికొక చెక్కువ్రాసి యందులోనే యొకకమ్మయు వ్రాసి యిచ్చుచున్నాను.

అనుచు 'చెక్కుబుక్కు' తీసి యెంతమొత్త మీయనా యని యించుక యోజించి మోటారుదీపము కడకరిగి యిరువది యైదువేల కొక చెక్కువ్రాసి మఱియొక కాగితముపై నొక లేఖ యిట్లువ్రాసెను.

''గంగాబాయి! మనమిరువురము మూఁడేండ్లు స్వర్గసౌఖ్య మనుభవించితిమి. కాని కారణాంతరముచేత నేను నిన్ను విడచిపెట్టవలసివచ్చినది. నీవును రోగపీడితురాల వగుటచేత నా సౌఖ్యమున కుపయోగపడవు. నేనన్యసాహాయ్యముపై నాధారపడకతప్పదు. నేనిట్లు లొనర్చుచున్నందుల కన్యథా తలంపక, నేనిందుతోఁ బంపియున్న 'చెక్కు'ను స్వీకరించి, యందుగుర్తింపఁబడిన విత్తముతో నీవును నీకూఁతురును నెందేని కాలక్షేప మొనరింపుఁడు. నా దర్శనము నీకిఁక దొరకదు-రామయ్య చెట్టి''

లేఖయు చెక్కును రామయ్య యాసుందరిచేతిలోఁ బెట్టెను. ఆమెయు మోటారుదిగి యాకాగితములం జదువుకొని తృప్తిఁజెంది వానిని సటేశము చేతికిచ్చి ''అయ్యా! తమరీకా

గితములను గంగాబాయి కందఁజేయుఁడు. నేను మీసెలవుప్రకారము రామయ్యచెట్టిగారి చేతఁబట్టెద" ననెను. రామయ్య యనిర్వాచ్యానందమును బొంది చప్పున నామె కరమునుబట్టి "యిప్పుడే నాతో నీవు రాకతప్పదు. ఒక్కనిముసము తడవైనను నేను భరింపఁజాల" నని తన మోటారులోనికి లాగుకొని పోయెను. ఆమె "నేఁడువలదు. రేపువత్తు" నని మొరపెట్టుచున్నను వినక "నీవు నేఁడేరావలయు. రాకున్న నాయుసురులు నిలువ" వని పల్కుచు నామెను జెంతఁ గూర్చుండఁబెట్టుకొని "అన్నా! నీ వీమెకారెక్కి బసకేఁగుము. రేపు గలసికొంద" మని సంతోషముతో వచించెను.

రామయ్య నాఁటిరేయి నాయింతితో భూలోక స్వర్గ సుఖ మనుభవించుచునుండెను. రెండుమాసము లిట్లుగడిచిన తర్వాత నామెతల్లియు సోదరుఁడును దేనాపేటనుండి వచ్చిరి. వారిలో నత్తగారి నతఁడానవాలుపట్టి, "మీరేల నాయింటికి వచ్చితి"రని యడిగెను. ఆమె "మాయమ్మాయిఁగొనుకువచ్చితి" మనెను "మీయమ్మాయి యెవ"రన "నెదుటఁ జూచుటలేదా?" యని జానకీని జూపెను. రామయ్య యాశ్చర్యపడెను. అప్పుడు జానకి తానాడిన కపటనాటక విధమంతయు సవిస్తరముగాఁ దెల్పెను. తాను మోహాధిక్యముచే నాడినమాటలు నిక్కువములయ్యెనని మిగుల సంతసపడి యత్తగారిని మఱఁదిని బ్రీతిమైనాదరించి, యదిమొదలుకొని భార్యనెడఁబాయక రామయ్య సుఖించుచుండెను.

## ౧౬ మరలుఁబాటు

గంగాబాయి పలుచని పాఁగ్రీచీరఁగట్టి, పువ్వుల తెల్ల రవికఁ దొడిగి, కాళ్ళకు సున్నితములైన మైజారులు ధరించి కాంచనవర్ణముగల కాశ్మీరపుసేలువు మేలిముసుఁగుగా వైచుకొని, మందిరమునకు నడుమనున్న 'హాలు'లో నొకకురిచీమీఁద విలాసముగాఁ గూర్చుండియుండెను. ఆమె యిప్పుడు చాలఁ గృశించియుండెను. సహజసౌందర్యముగలవారికిఁ గార్శ్యము కూడ నొకవింతయందమును దెచ్చును. చిక్కిపోయియు గంగాబాయి యొకవిధమగు శృంగారమునే వహించియుండెను. కడచినరాత్రి రామయ్యసెట్టి యామెబసకు రాలేదు. కొన్నిదినములనుండి యాతనివైఖరి యించుక మాఱియుండెనని గంగమ్మ యనుమానించుచుండెను. దానికిఁదోడు గతరాత్రి యింటికిరాఁడయ్యె. ఆమె కేమియుందోఁపక చిన్నఁబోయియుండెను. తనపూర్వచరిత్రయెల్ల జ్ఞప్తికిఁదెచ్చుకొని తనయవివేకమునకుఁ గుందుచుండెను. చెక్కిటఁజేయిఁజేర్చి యోజనాదృష్టితోఁ గూరుచుండి యామె నడుమనడుమ దీర్ఘనిశ్వాసములం బుచ్చుచుండెను.

అట్టులుండ నటేశము వచ్చెను. ఆమెలేచి నిలువఁబడెను. చేటికయొకతె నటేశమునకొకకురిచీవైచెను. ,,గంగాబాయి! నీవుకూడ నాసీనవుగమ్ము. బొత్తుగా నీరసస్థితియందున్నావు" అని యతఁడు పలికెను. గంగాబాయి, ,,అయ్యా! నాకిప్పుడు నీరసముగాలేదు. మనస్సులోమాత్ర మాందోళన

ము గల్గుచున్నది. కారణము చెప్పఁజాలను." అనెను.

నటే—ఆయాందోళనము నీనరములు బలములేమి చేఁ గల్గినది. నీతోఁ గొంత మాటాడవలయును. ఒరులెవ్వ రును వినరాదు. నీచేటిక నావలకుఁ బొమ్మనుము.

గంగ—(చేటికనుదూరముగాఁబొమ్మని యాజ్ఞయిచ్చి) అయ్యా! రాత్రి చెట్టిగారింటికిరాలేదేమి? వారు సుఖు లేకదా!

నటే—వారుసుఖులేఁ వారంపిన సందేశము నీకెఱింగిం చుటకే నేనిటకు వచ్చితిని.

గంగ—(ఆత్రముతో)సందేశమా ! ఏమని ?

నటే—ఇదిగో నీయుత్తరమే యన్నియుఁదెలుపును. (అనుచు నొక సంచిలో నుంపఁబడిన జాబును 'చెక్కు'ను'జేతి లోఁబెట్టెను.

గంగాబాయి తొందరతో దానివిప్పి చదువుకొనుచు మొగమున నాశ్చర్యము, నాందోళనము, విషాదము, మున్నగు భావములను వెల్లడించుచుండెను. లేఖ సాంతముగాఁజదివి యామె నటేశముతో, ‹‹అయ్యా ! నాకాఁపురముఁ జెడఁదీసి నన్నిటకుఁ దీసికొనివచ్చి నాకిట్టి ద్రోహముచేయుట చెట్టిగారి కిఁదగునా ?" యని యడిగెను.

నటే—అందునకు నేనేమిజవాబు చెప్పఁగలను? అతఁ డెప్పుడును నమ్మఁదగినవాఁడు కాఁడు. స్థిరత వానికడ నున్న దేయున వచ్చును.

గంగ—ఆమాట మొదటనే నాకేల చెప్పకపోయితిరి?

నటే—మొదటఁజెప్పిన, వాఁడు నాగొంతు కోయుకఁడా?

గంగ—ఇప్పుడు నాకేదిదారి? ఉభయభ్రష్టత్వముపరి సన్యాస మనుసట్లయినది నాబ్రతుకుఁ

నటే—నేనొక యుపదేశ మొసర్తును. దాని నాచరింతువేని నీకష్టములు గట్టెక్కును. నీవెట్టిచింతయుఁ బొందనక్కఱ లేదు.

గంగ—అదేదో సెలవిండు.

నటే—మొదట నీదివ్యసుందరరూపముంగాంచి నీపై వలపునిలిపినవాఁడను నేను. అవల రామయ్య నిన్మోహించి నాఁడు. మాయిరువురిలో నతఁడు చిన్నవాఁడగుటచే వాని కోర్కెఁ దీర్చుటయే మంచిదని చెప్పి మీయుభయులనడుమ నేనడ్డము రాకుంటిని. నీవెప్పటికైన నాపాలఁ బడుదానవేయని మొదటనే తలఁచితిని. రామయ్యతో నీవిన్నాళ్ళదాఁక నుందువనియే నేనుదలఁపలేదు. ఏదో నీకు ఋణమున్నంత కాలముంటివి. నీవిఁక నాకడకురమ్ము. అతఁడిచ్చిన 25 వేలును నీకూఁతుపేర 'బ్యాంకి'లో వేయింతును. నీవు గోరునంతధనము నేనిత్తును. ఐశ్వర్యమునకు నేను రామయ్యకేమియుఁ దీసిపోని వాఁడనని నీవే యెఱుఁగుదువుగదా? కావున మారుమాటాడక నేఁడే నీవు మాయింటికిఁ బయనముకమ్ము. నాభార్యచే నీకూడిగముఁ జేయింతును.

గంగ—(క్రోధరక్తిమ కన్నులలోను జెక్కుటద్దముల యందును దోఁప) అయ్యా! మీయింటికిని మఱియొకరియింటికిని వచ్చి మీసుఖమున కుపయోగపడుటకు నేను బడవుఁగత్తెను గాను. నాకర్మగతిచే, నాబుద్ధిగడ్డితిని, నేనీతప్పుదారిఁ బట్టి చరించితిని. నాయజ్ఞతకు నాహృదయమే యొక్కొకతఱి నగ్నిహోత్రపుంజమై నన్ను దహించుచుండెను. అట్టులుండ మరల నీకడకురమ్మందువా? నా కాతఁడొసఁగిన ధనమక్కఱలేదు. ఇదివఱకే నాచరితము దురితపూరితమయ్యెను. ఇంకను నారకవహ్నిఁ గాల్చఁబడుమందువా? చాలును. నీవు, నీతమ్ముఁడును శాశ్వతముగా సుఖింపుఁడు. నాకుఁదిండిలేకున్న బిచ్చమెత్తుకొనెదను. కాని నీవంటి పాపాత్ముని చెట్టఁబట్టనని నమ్ముముఁ ఇదే యతఁడిచ్చిన చెక్కు చించివేయుచున్నాను. (అనుచు ముక్కలుముక్కలుగావించి వెక్కివెక్కి యేడ్చుచు) ఓదైవమా! నేను మహాపాపాత్మురాలిని. పూతచరిత్రుఁడైన నాభర్తను మోసపుచ్చి యిట్టిదుర్నీతిని గైకొనిన దులకు నాకుఁ దగిన శిక్షయే గావించితివి. ఇంకను నాకుఁజేయఁదగిన శిక్ష యేదేని యున్నఁ జేయుము. నా పాపపంకమును గడిగివేయుము.

నటే—నీ కనుభవించెడు యోగములేనప్పుడు, పరు లేమిచేయఁగలరు? నీకర్మమునీది. పొమ్ము. చిలుకకుఁజెప్పినట్లు చెప్పినను వినవుగా?

గంగ—పోనయ్యా! ఇన్నియేండ్లు మీఁదఁబడియు నీకు బుద్ధిరాకున్నది. చిలుకకుఁజెప్పినట్లు చెప్పితివా? చిలుక

వలెనే నీవు నేర్పుమాటలాడుచు నీయస్థిపంజరములో బంధింపఁబడుట కియ్యకొనుచుందువా? ఇఁక నధికప్రసంగము మాని పొమ్ము.

అనుచు గంగాబాయి లేచి చివచివ లోనికేఁగి యుయ్యెలలో నిద్రించుచున్న చిన్నబిడ్డనెత్తుకొని కట్టుగుడ్డతోనే వీధిలోనికిఁ బోయెను. ఆమెతీరుఁజూచి చేటికలాశ్చర్యపడి వెంటరాఁగా గంగమ్మ ''అమ్మలారా! నాకిఁక నిచ్చటనుండఁ బనిలేదు. చెట్టిగారు వేరొకకాంతను జేపట్టి నాకు స్వస్తిఁ జెప్పించినారు. మీరిఁక నా సేవకురాండ్రు గారు. నే నేవేని యపరాధము లొనర్చియున్న, నన్ను క్షమింపుఁడు. నా వెంట రాక వెనుకకు మరలుఁడు'' అని వారిని వారించెను. దాని వెంబడి నొక 'జట్కా' పోవుచుండ దాని నద్దెకుఁగట్టించుకొని చెన్నపురిలోని తిరువళిక్కేణికిఁబోయి యందు వీరరాఘవ మొదలియారు వీధిలోనున్న సుబ్బులక్ష్మమ్మకడకేఁగెను. ఏఁగి తనకుఁ దటస్థించిన యవమానమెల్లఁ దెల్లముగఁ జెప్పెను. సుబ్బులక్ష్మమ్మ గంగమ్మ దురవస్థకు మిగులవగచి ''కర్తవ్యమేమి?'' యని యడిగెను. ''అమ్మా! నాయందుఁ గృపవహించి నాయీచిన్నికందును మీయొద్దనుంచుకొని మీమనుమలతోఁబాటంతయన్నముంబెట్టి పెంపఁగోరెదను. మీరు మాఱుమాటాడక నేనిచ్చు నీభూషణముఁ గైకొని దీనికగు వ్యయముం జేయుఁడు. (అనుచుఁ దనమెడనున్న కట్టుకాసులపేరుతీసి యామెచేతికిచ్చెను.) ఇది నాకొఱకు బెంగగొనునేని

నాయొద్దికి రావించుకొందునులెండు. నేనిప్పు డెక్కడికిఁబోయె దనో చెప్పఁజాలను. ఎక్కడనున్నను నాయునికినిగూర్చి మీకెఱింగింతును. నాకీయుపకారముమాత్రి మొనరింపుఁడు." అని గంగమ్మ సుబ్బులక్ష్మమ్మ పాదములపైఁ బడెను.

సుబ్బు—అమ్మా! నీబిడ్డను సాకుట కేయభ్యంతర మును మాకులేదు. కాని యిది పెంకఁబెట్టుకొనినఁ జాలకష్ట పడవలసివచ్చును. దీనికే మంతవ్యయమగును? నీవిచ్చు కాసులపేరు దీనిమెడలోనే యుంతునులెమ్మా. (అని కాసులపేరు శిశువు మెడలోవైచెను.) తప్పనిసరివచ్చిన దానిని విక్రియించి వలయు ఖర్చు లొనర్తును.

గంగ—(బిడ్డను సుబ్బులక్ష్మమ్మ చేతికందిచ్చి గోలుగోలున నేడ్చుచు.) అమ్మా! ఇది మీబిడ్డయనియే యెంచుఁడు కనుటయే నావంతైనది. ఇఁక దీనిముద్దుముచ్చటలఁ జూచు నదృష్టము నాకులేదు. (కూఁతువంకఁదిరిగి) తల్లీ! ఇఁక నీకును నాకును ఋణము చెల్లినది. నిన్ను నాకుఁ బ్రసాదించిన యాదయామయుఁడగు భగవంతుఁడు నీకు దీర్ఘాయురారోగ్యము లిచ్చి సమస్తైశ్వర్యములను సమకూర్చుఁగాత. నీకీ సుబ్బులక్ష్మమ్మగారే తల్లిదండ్రులు. (అని మరల నొకసారి దగ్గఱకుఁదీసికొని పలుమాఱు ముద్దుపెట్టుకొని కన్నీరు కాల్వవలె పాఱుచుండఁగా దానిని గ్రిమ్మఱ సుబ్బులక్ష్మమ్మ కరములందుంచెను.)

బిడ్డ తెలతెలఁబోవుచు ,,అమ్మా! ఎత్తో" యని చేతులు చాపుచు మీఁదికి వచ్చుచుండఁగా గంగమ్మ దాని నెత్తుకొని చాలసేపు దుఃఖించి, లక్ష్మమ్మ యేవో తినుబడి వస్తువులు తెచ్చియీయఁగా వానిని దినిపించుచుఁ గొంతతడ వుండి, యవల నొకతొట్టెలో దానిని బండుకొనఁబెట్టి, జోకొట్టి నిదురఁబుచ్చెను. సుబ్బులక్ష్మమ్మ యొకటి రెండుదినములు తమ యింట నాఁగుమనియు, బిడ్డతనతోను దనబిడ్డలతోను మచ్చిక పడినవెనుక నెచటికేఁగినను భయములేదనియు, గంగమ్మతోఁ జెప్పనామె యందులకు సమ్మతించి, బిడ్డనిదురనుండి మేల్కాంచులోపలఁ దానొకసారి భర్తకై యన్వేషించుట యొప్పని యొకరిక్షా కుదుర్చుకొని వై. యమ్. సి. యే. భవనముల కేఁగెను. అప్పలసామిజాడ యెవ్వరెఱుఁగమనిరి. అతఁడాంధ్ర భవనములో నున్నాఁడని యొకఁడు చెప్పఁగా గంగమ్మ యచటి కేఁగెను. ఆతఁడచ్చటనుండి బసమార్చి వేఱొకచోట నున్నట్టు తెలియవచ్చినది. ఆమె యాతని నెందునుగానక మరల లక్ష్మమ్మగారి యింటికివచ్చి సాయంతనపువేళల ,బీచ్' ప్రక్కల నాతనికై వెదకఁజొచ్చెను. మూఁడు దినములదాఁక నతఁడు కన్పట్టలేదు. మూఁడవనాఁ డప్పలసామి యొక నికుంజము చెంత నాతఁడొక్కఁడే కూర్చుండి, ,,తండ్రీ! సింహాద్రిప్పన్నా! నేనెంతకాల మిట్టులొంటియుంట? ఎన్నెన్నటికేని నీపాదములసరసకు రావించుకొందువా? నా ప్రియురాలిని మరల నాకంటఁ బెట్టుదువా?" అనిపల్కుకొనుచు (కూర్చుండియుం

డెను. అప్పటికి రాత్రిజాముమీఱినది. అదివెన్నెలరేయి బిడ్డను నిదురఁబుచ్చి గంగమ్మ దిరిగితిరిగి యలసి యొకచోఁ జేదఁ దీర్చుకొననుద్దేశించి చెంతనేయున్న యాబీదియందలి నికుం జముసు జేరెను. అయ్యెడ నప్పలసామి పల్కులు వినఁబడ నామె యతనిపాదములపైఁబడి హెూరు హెూరుననేడ్చి, "ప్రాణకాంతా! నేను మహాపరాధినిని. మీకుఁ దోఁచినశిక్ష నాకువిధించి మరల నన్నుఁ బరిగ్రహింపుఁడు. నేనింతకాలము వెఱ్ఱియెత్తి తిరిగితిని. ఎందుంటివని నన్నడుగకుఁడు. భ్రష్టురాల నైతిననుట సత్యము. నాపాపాగ్నులు నన్ను దహించుచు న్నవి. మీ సదయశీతలకటాక్షములచే వానిని జల్లార్చి నన్నుఁ గైకొనుఁడు. నాకు మీరేగతి." యనిపలికెను.

అప్పలసామి యామెవిధముంజూచి మిగుల జాలిపడి తానింతదనుకఁ బ్రార్థించుచుండిన శ్రీనృసింహస్వామియే తన భార్యను దనచెంతకుఁ బంపెనని తలఁచి యామెం గౌఁగిటం గ్రుచ్చియెత్తి, కొంతసేపు తానునుదుఃఖించి, యవల "గంగా! నీకోర్కెప్రకారము నిన్నే ప్రశ్నము లడుగకుండఁగనే గైకొం దును. నీతప్పులనెల్ల క్షమింతును. నీవుమాత్రి మిఁక నన్ను విడివి యొక్కనిముసమునైనఁ నుండననియు, దుష్టులతో స్నేహముచేయననియు వాగ్దాన మొసఁగువేని మనము రేపే బయలుదేఱి మన గోపాలపట్టణమునకుఁబోయి యెప్పటి వ్యావ సాయ వృత్తితో సుఖజీవన మొనర్తము." అని వచియించెను.

“ప్రాణేశ్వరా! మీయాజ్ఞకు జవదాటుదునేని, నాశిరః ఖండనము సేయుఁడు. ఇదివఱకు మీకొనర్చిన యపరాధమే కాక యింకనుం జేయుదునా?” యని యామె మాఱు పల్కెను. ఇరువురును లేచిరి. అప్పలసామి భార్యను దనబసకు రమ్మని కోరెను. కాని గంగమ్మ తనస్నేహితురాలగు లక్ష్మమ్మ తనకొఱకె దురుచూచుచుండుననియుఁ దానారాత్రికి భర్తబసకు రాఁజాలననియుఁ బల్కె. యతఁడు తనకు దగ్గఱగనే ‘అక్బర్ సాహెబు’ వీధిలో నుంట తెలిసికొని, యతనికడ, సెలవుఁబుచ్చుకొని పోయెను.

ఆరాత్రి యామె సుబ్బులక్ష్మమ్మగారి యింటనే యుండి తెల్లవాఱుజామున లేచి, నిదురించుచున్న బిడ్డను బల్మారు ముద్దిడుకొని, యాఁపఁజాలని కన్నీటిప్రవాహముం బ్రవహింపఁజేయుచుఁ గొంతసేపేడ్చి, యవల గుండెకుదురు పరుచుకొని భర్తకడకుఁ బోయెను. బిడ్డలేచి “అమ్మమ్మా! మా యమ్మయేది?” యనియడుగ, సుబ్బులక్ష్మమ్మ యేవో మాటలు చెప్పి దానినొప్పించి తనమనుమలతో నాడించుచుఁ గాలక్షేపముఁ జేయుచుండెను. నాఁటిసాయంకాలమే గంగమ్మయు నప్పలసామియుఁ జెన్నపురినీడి గోపాలపట్టణమునకై ప్రయాణమైరి అప్పలసామి తాను బ్యాంకిలో దాఁచుకొన్నసొమ్మునఁ గైకొని తనసామగ్రియంతయుఁ గూర్చుకొని మిత్రులకడ సెలవుఁ బుచ్చుకొనెను.

మరునాఁటి మధ్యాహ్నము రెండుజాములు మీఱిన ప్పటికి వారు వాల్తేరుచేరిరి. అక్కడినుండి బండిచేసికొని వారు సాయంకాలమునకు గోపాలపట్టణముం జేరుకొనిరి.

## ౧౭ ఆశ్లేషము.

గోపదంపతులను స్టేషన్ కడనే యూరొమ్మగముపిళ్ళగారు చూచి పరామరిశించిరి. ఆయనకు గంగమ్మయుదంతమెల్ల నత్తమామలవలనఁ దెలిసినది. అతఁడు వారికి నొచ్చుమాటల నాడక, వారిక్షేమోదంతములు మాత్రమే యరసి నాఁటికిఁ దమయింట నాఁగుఁడనిబలవంతపెట్టెను. కానియప్పలసామికిఁ దమిళులతోఁ బొందన్న నొకవిధమైన గోఁతయు భయమును గల్గియుంటచే, నతఁడందులకియ్యకొనక, యూరిలోనికిఁబోయి, కరణముగారియింట బసచేసెను. కరణముగారు గోపులరాక కెంతోసంతోషించి వారి కారాత్రి తమయింట విందుఁజేసిరి. భోజనానంతరమున గంగమ్మకరణముగారి యాఁడువాండ్రతోఁ దమయిడుములంగూర్చి సవిస్తరముగాఁజెప్పి యేడ్చెను. కాని తాను రామయ్యచెట్టితోఁ గొంతకాలముండిన వృత్తాంతము చెప్పలేదు. తనకుఁ గొన్నేఁడులు మతిచలించియుంటచేఁ దాను భర్తనువీడి పరస్థలమున నుండవలసివచ్చెననియు నవల మదికుదురుపడుటచే మరల భార్యాభర్తలు కలసికొనుభాగ్యము గల్గెననియు,నామె వచించెను. వారామాటలకు గంగ

మ్మకు నిజముగా నున్మాద మేకలిగెననియు, దాననున్మాద వైద్యశాలకుఁ గొంపోఁబడి చికిత్సలో నుంపఁబడెఁగాబోలుననియుఁ దలంచిరి. కాని సత్యవృత్తాంత మెఱుంగలేకపోయిరి. అప్పలసామియు గరణముగారితో భాషించుచుఁ దనయవస్థం దెలిపెను. మొదటఁ దానెట్లు కీర్తిధనముం గొల్లఁగొనఁగల్గెనో, యవలఁ దనభార్యకూడనెట్లు సాముగరిడీలలోఁ బాల్గొనివన్నెకెక్కెనదో, యనంతరమామె తమిళులసద్గోష్ఠికి లోనై మతిఁజెడఁగొట్టుకొని తిరిగినదో, కర్రిమ్మఅనామె యెట్లు తనకులభించినదో యది యంతయుఁ బూసఁగుచ్చినట్లు తెలిపెను. తానుసయితమామె దుశ్చరిత మెఱుఁగకపోవుటచేత నందునుంగూర్చి యేమియుఁ బలుకకుండెను. చాలరేయిగడచువఱకు వారిట్లు సంభాషించుకొనిరి.

మఱునాఁడు కరణముగారు తమబసను సమీపమందు నొకయిల్లు మనయప్పలసామికి నద్దెకిప్పించి, యతని నందు విడియించిరి. అప్పలసామి కొలఁదిధనము తనకడ నుంచుకొని మిగిలినదెల్ల విశాఖపురికేఁగి యందలి 'బ్యాంకి'లో దాఁచుకొనెను. అతని కేవృత్తియు నవలంబింపవలెనని యిచ్ఛలేదు. తనకున్న ధనముపై వడ్డిచెచ్చుకొని యనుభవింప వలయునని యే యాతని కోర్కె. అప్పుడు వ్యవసాయముచేయుదమన్న వీలుగానికాలము. ఇఁక రెండునెలలలోఁ గరణముగారికిచ్చిన

ంతవులు, కాలము మఱియును. అప్పటికి వ్యవసాయమందధి లాభము పుట్టునేని చూచుకొందమని యతఁడూరకుండెను.

ఇప్పుడప్పలసామియు గంగమ్మయుఁ దమజీవనపథములను బూర్తిగా మార్చుకొనవలసియున్నది. సుమారు నాలుగేండ్లనుండి యలవాటుపడిన కాఫీముఖ్యములు హఠంబున మానివేయుట కష్టము. ఆంధ్రభవనమునందున్నపుడు మాతఁడు రుచ్యములగు పాల్పావాలు, పర్బత్తులు, మిఠాయీలు, తరుచుగాఁ దినుచునేయుండువాఁడు. రాజాన్నభోజన మొనర్చిన గంగమ్మ మఱియు సున్నితములైన యాహారమున కలవడిన దని వేరు,గఁజెప్పనక్కఱలేదుగదా! కొలఁదిదినములదాఁక వారు ప్రాతఃకాలమున రొట్టెలు కాఫీయు నింటియొద్దనే తయారుచేసికొని తినుచుండువారు. అనలనాయలవాటుకూడఁ దప్పించుకొని, మునుపటివలెఁ జాలలోఁ దోడుపెట్టియుంచిన యన్నమే యలవాటు చేసికొనిరి. రకరకముల జరీచీరలకును, లేసు పువ్వులచే నొప్పువింతవింత 'జాకెట్టు' లకును 'రిబ్బను' లకును 'సెంటు' లకును పౌడరులకును నలవాటు పడియున్న గంగమ్మ, యిప్పుడు 'సాదా, నేఁత చీరలును గుత్తంవు రైకలును దొడిఁగికొనుట కారంభించెను. రిబ్బనులజడమాని వ్రేలుముడి వైచుకొనుచుండెను. విదేశ సుగంధతైలములను విడిచి కొబ్బరనూనె రాచికొనుచుండెను. సబ్బుతో నొడలుతోముకొనుట మాని కుంకుడుకాయలును సీకాయలును నుపయోగించుకొనుచుండెను. చేతులకొకజత బంగారుగాజులు, కాళ్ళ

కొక్క కడియములజతయు, మెడలో నొకటిరెండు పేరులును, చెవులకు దుద్దులును ధరించి తక్కుంగల నగలెల్ల నమ్మించి గంగమ్మ సొమ్ముగా మార్పించెను. మరల రెండు గేదెలను రెండావులను గొని వాని పాల్పెరుగులమ్మించుటకారంభించెను. కాని, భర్తయాజ్ఞచే నామె స్వయముగా నింటింటి కేగి పాల మ్ముపద్ధతి మానుకొనెను. ఒకరిద్దరు నౌకరుల నింటనుంచుకొని యాపనులెల్ల నామె జాగ్రత్తగా నెఱవేర్చుచుండెను. అప్పల సామి నిప్పుడెల్లరు నాయఁడుగారని పిలుచుచుండిరి. ఆతఁడు వెనుకటికన్న నిప్పుడెక్కువ ధనము గలవాఁడౌటచే వానియూరి లోనివారందఱునింతుక యెక్కువగౌరవముతోఁ జూచుచుండిరి.

ఇట్లు రెండుమాసములు గతించెను. కరణముగారు సాగుచేయుచున్న తనమాన్యము నప్పలసామి పుచ్చుకొని, మరల వ్యవసాయమునకు దిగెను. మున్నున్నవృత్తియే యతనికి సుఖప్రదమై యుంటచే, నతఁడుదానికే పూనుకొనెను. తాను వ్యవసాయవృత్తియు, గంగమ్మ పాలమ్ము వ్యాపారమును జేయుచుండిరి. భర్తయానతిపై గంగమ్మ యారోగ్యముపిళ్ళ గారి యింటికిఁబోవుట పూర్తిగా మానినది. ఆమెనొక్కసారి తనయింటికి రాఁగోరుచు సుందరమ్మ నాలుగైదుమారులు తనదాసీజనముచేఁ దెలియఁజేసినను, నామె యేదోనెపమిడి పోవకుండెను. సుందరమ్మ యొకటిరెండు పర్యాయము లామె బసకు వచ్చినప్పుడునైతము కొంచెముగా మాటాడెను. కాని మునుపటివలెఁ జనవున భాషింపకుండెను. తానొనర్చిన తప్పుఁ

బనినై సిగ్గుపడి యామె యట్టులున్నదికాఁబోలునని యామెను గూర్చి సుందరమ్మ యభిప్రాయ పడుచుండెను. కాని యది యామెభర్త యాజ్ఞవలనఁ గలిగినదని సుందరమ్మ యెఱుఁగ కుండెను.

గోపదంపతులిట్టులుండఁ జెన్నపురిలో సుబ్బులక్ష్మమ్మ కడనున్న శకుంతల తల్లికై బెంగఁగొని నానాఁట కృశించు చుండెను. ఎన్నివిధముల మఱపించినను దల్లిని మఱవకుండెను. ఎన్నివినోదములఁ జూపినను దృప్తిఁ జెందకుండెను. నిద్దురలో సైతము "అమ్మా! యెక్కడ! నువ్వే బువ్వపెత్తు" అని కలవ రించుచుండెను. ఆ బెంగచే బిడ్డకొకవిధమైన జ్వరముపట్టి పీడించుచుండెను. వైద్యులకాపల్లను జూపిరి. వారాబిడ్డజబ్బునకు మందులు పనిచేయవనియు దల్లికడకుఁ గొంపోవుటే కర్తవ్య మనియుఁ జెప్పిరి. వారిఁకఁ జేయునదిలేక తల్లి బిడ్డకొఱకిచ్చిన సొమ్ములోనే కొంతవ్యయపఱిచి సుబ్బులక్ష్మమ్మను బిడ్డతో గోపాలపట్టణమునకుఁ బంపివేసిరి.

ఒకనాఁటిసాయంకాలమున నైదుగంటలకు సుబ్బు లక్ష్మి శకుంతలనెత్తుకొని సుందరమ్మను దోడుగానుంచుకొని యుప్పలసామి యింటికేఁగెను. అప్పటి కప్పలసామిపొలములో నుండెను. కావున, వారు నిరాటంకముగా లోనికరిగిరి. చిక్కి శల్యమైయున్న కూఁతుఁను జూచినతోడనే గంగమ్మ చేతులు చాఁచి "మాతల్లి, మాయమ్మ, మాచిట్టిశకుంతల!" యని పల్కుచు నెత్తుకొని యక్కునంజేర్చి ముద్దిడుకొనెను. బిడ్డ తల్లి

నానవాలుపట్టి బేరుమనియేడ్వఁగాఁ దల్లి గుండెచెదరి తానును బిగ్గఱగా నేడ్వఁజొచ్చెను. అయ్యెడ సుందరమ్మయు నామె తల్లియు గంగమ్మ నూరార్చిరి.

ఇప్పుడు గంగమ్మ యేమిచేయుటకును బాలుపోని ద్వైధభావముతో నుండెను. కన్నకడుపుగావునఁ బిల్లనొల్లనని పలుకఁజాలదు. కట్టుకొన్న మగఁడుగావున, నతనియాజ్ఞ నతిక్రమింపఁజాలదు. కడుపుఁదీపి యొకవైపున భర్తృభయ మొకవైపున, నామె నాకర్షించుచుండెను. ఆమెయేపక్కకును బోవఁజాలకుండెను. ఏదోయొక పక్కకుఁబోవకతీరదు. చెదరినమది పదిలపఱుచుకొని యామె యిట్లనియె. "సుందరమ్మతల్లీ! నాబిడ్డను మీయింటనుంచి కాపాడకతప్పదు. ఇయ్యెడ నాకు మీరుతప్ప నితరదిక్కు లేదు. నేను బ్రతికినమున నేదోయొకవేళను మీయింటికి వచ్చి నాబిడ్డ నించుక సేపు లాలించి వచ్చుచుందును. మంచిమాటలచేత దీని నూరడించి మఱి వచ్చుచుందును. దీనికగువ్యయమెల్ల నేనే భరింతును. నాకుఁ బుత్రికాభిక్షముం బెట్టుటకై, దీనిని మీశిశువులతోఁ బాటు కొంతకాలము సాఁకకతీఱదు. అమ్మా! ఇదే పాదములంటి వేఁడుదాన", నని గోలుగోలున నేడ్చెను.

సుందరమ్మయు నామెజననియు సందుల కియ్యకొనిరి. భర్త పొలమునుండి వచ్చువేళయైనదనియు, నేఁటికి వారు బిడ్డతో గృహమునకేఁగుటయే మంచిదనియు గంగమ్మచెప్పి, శకుంతలను సుబ్బులక్ష్మమ్మచేతి కందిచ్చుచుండెను. అట్టితఱిని

నప్పలసామి క్షేత్రమునుండి యింటికివచ్చెను. వానికెదుటఁ
దమిళులు కనఁబడుటచేఁ దనయాజ్ఞదప్పి చరించుచున్నదని
యాతఁడు భార్యపైఁ గినిసెను. కాని కినుకచూపుటకిది సమ
యముగాదని యెంచి తనగదిలోనికిఁ బోవుచుండెను. దారిలోఁ
దనభార్య సుబ్బలక్ష్మమ్మచేతికిచ్చు శిశువువంకఁజూఁచి యాఁగి
పోయి, "యీపిల్ల యెవ"రని వారలనడిగెను. వారిలో సుబ్బ
లక్ష్మమ్మ మామనుమరాలని చెప్పి గంగమ్మ మానముఁ
గాపాడెను. అప్పలసామి మరల బిడ్డవంకఁ దేఱిపాఱఁజూచి
"నేనానడుమఁ జెన్నపురిలో నొకపిల్లను, బండికై పరువెత్తిపో
వుచు వంతెనక్రింది యేటిలోఁ బడిపోవనున్నదానిని, నపాయ
మునుండి తప్పించి కాపాడితిని. ఆబిడ్డ రామయ్యచెట్టిగారి
కూఁతురని యవ్వలఁ దెలిసినది. ఈశిశువుఁగూడ నచ్చు మాశి
శువువలెనే యున్నది." అనెను. వారందఱుఁ దెల్లవోయిరి.
"ఏల యట్లు తెల్లతెల్లఁబోవుచున్నా"రని యతఁడు వారినడు
గఁగా, సుబ్బలక్ష్మమ్మ, "మఱేమియుఁగాదు. నాఁడాపిల్ల
ప్రాణములిచ్చినది మీరా, యని యాశ్చర్యపడుచున్నాము.
మే మారామయ్యచెట్టిగారింటికి విందునకుఁబోయితిమి. అప్ప
టికి బిడ్డను గాపాడినవానిపే రెవ్వరికిఁ దెలియకుండెను. నేఁడప్ర
యత్నముగా మీరేయని వినుటచే వెఱఁగుపడి యట్లుంటి"
మని మాటుపలికెను. నాఁడు తనకూఁతు ప్రాణములఁగాచిన
పుణ్యాత్ముఁడు తనప్రాణకాంతుఁడే యని తెలిసినప్పుడు గంగ
మ్మ మరల వెనుకటి హేయజీవనమును జ్ఞప్తికిఁదెచ్చుకొని

యిట్టి మహాపాపకారశీలిని నిట్టి మహామహిమాన్వితుని, నిట్టి పురుషపుంగవుని వీడి యొక్క చంచలహృదయుని, మదాంధుని కపటశీలినిం జెట్టంబట్టి తనదేహము, హృదయము, ఆత్మయు, నపవిత్రపఱుచుకొంటింగదా యని లోలోన నత్యంతదుఃఖముం బొందెను.

అప్పలసామి యట్లుపలికి తనగదిలోనికిం బోయెను. తమిళులు గంగమ్మకడ సెలవుంబుచ్చుకొని బిడ్డతో నింటికిం బయనమైరి. వారిని వీధిగుమ్మముదాఁక వెళ్లి సాగనంపందలంచి గంగమ్మకూడ నడచెను. వారు వీధిలోని కేఁగినపిమ్మట గంగమ్మ సుబ్బలక్ష్మమ్మతో మెల్లఁగా, ,,తల్లీ! మీరు మూఁడునాల్గు దినములాఁగి, బిడ్డ సుందరమ్మగారితోను వారిబిడ్డలతోను బరిచయముఁగల్గించుకొని యించుక చనవుతోఁ దిరుగాడువఱకుఁ జూచి మఱిపోవలయును. (బిడ్డవంకఁదిరిగి) అమ్మా! రేపు నీదగ్గఱకు వచ్చి నేనే బువ్వపెట్టెదను. నేఁటి కమ్మమ్మగారే నీకన్నముఁ బెట్టుదురు. అక్కడ నీకన్నయ్యలు, అక్కయ్యలు, చిన్నపాప—వీరందఱు గలరు. వారితో నాడుకొనుచుందువు. (ముందువెన్కలుచూచి ముద్దుపెట్టుకొని) పొమ్మా" అనిపల్కి వారిననిచి, లోనికిఁబోయెను.

ఇప్పట్ల నామెహృదయావేగము వర్ణింపఁబూనుటకన్న నూహించుకొనుఁడని చదువరులకే విడిచిపెట్టుట మేలని మానితిమి. అప్పలసామి భార్యను దమిళులతో సంపర్కమువలదని మరల గట్టిగాఁజెప్పి నాయంస్నానమునకుఁ బోయెను.

# ౧౮ మాతృప్రేమ.

అప్పలసామి పాలమునకో పట్టణమునకో మఱియొక చోటికో యేఁగఁగాఁజూచి, గంగమ్మ ప్రతిదినము స్టేషను మాష్టరుగారి యింటికిఁబోయి బిడ్డనుజూచి కొంతసేపాడించివచ్చుచుండును. బిడ్డకు జ్ఞానమువచ్చినకొలఁదిఁ దల్లిని దఱుచుగాఁ జూడఁగోరుచుండెను. దానిపోరుపడలేక సుందరమ్మ యేదాసి చేతనో గంగమ్మను రమ్మని కబురు, పంపుచుండెను. దినమునకు రెండుసారులు కొన్నికొన్నిపట్ల మూఁడుసారులు గంగమ్మ కూఁతుకడకుఁ బోవుచుండెను. అప్పలసామి యూరలేనప్పుడు బిడ్డనుదీసికొని తమిఖులే గంగమ్మయింటికివచ్చుచుండిరి. కొన్నాళ్లు రహస్యముగాఁబోయిరాఁగల్గినది. కానియీవలఁటిరహస్యము దాఁగినదికాదు. తానెఱిఁగినవారలలో నొకరు కనఁబడి పలుకరించుచుండువారు. వారితో నేవో యబద్ధములు పల్కి యామె పోవుచుండెడిది. ఎన్నాళ్లిట్టు లన్యతమాడి నెగ్గుకొని రాఁగలదు? ఆమెయందుఁ జాలమంది కనుమానము గల్గి భర్తతో నామెనిత్యము స్టేషను మాష్టరుగారి యింటికిఁ బోవుటను గూర్చి చెప్పుచుండిరి. అప్పలసామి కోపించి భార్యను దిట్టుటయు నొక్కొకతఱిఁ గొట్టుటయుఁగూడఁ బ్రారంభించినాఁడు. తన చర్య బయలుపడినప్పుడెల్ల నేదో యొకసాకుఁ గల్పించి మగనితోఁ జెప్పి యతనిని సమాధానపెట్టఁజూచుచుండెను. సుందరమ్మ గంగమ్మగుణములఁ జెఱిచి యామెను దన మగనికో మఱియొకనికో ఆర్చుచున్నదనియు నప్పలసామి

యనుమానంపడుచుండెను. క్రమముగా గంగమ్మ మాటల యందాతనికి నమ్మకము చెడఁజొచ్చెను. "అయ్యో! నేనెట్లు భరింతు? కన్నకడుపగుటచేఁ గూఁతు నుపేక్షింపఁజాలను. దాని నుపేక్షింపకుండవలయునన్న భర్తను మోసము చేయక తప్పదు. మోసముచిరకాలముదాగదు. అయ్యో! దైవమా! నాకీవిషమసమస్య లేలకల్పించితివి? నిజమాడి నాకూఁతు కొంప కాతమిళులయింటి కరుగుచుంటినని నాభర్తతోఁజెప్ప దునేని, మున్నున్న గోపమును బెంచుచుఁ నేనింత భ్రష్టురాల నైతినని యాయనకుఁదెలియదు. తెలిసిన, విడాకులేగదా? ఈశ్వ రా! నాకేదిదారి? ఏదోదారిఁజూపి రక్షింపుము. కాకున్న, నా ప్రాణములంగొని నా బాధలుడుపుము", అని గంగమ్మతనలోఁ దాను బల్కికొనుచుండెనుఁ

అప్పలసామి కనుమాన మెక్కుడైన కొలఁది వ్యవసా యపుఁబనులడుగంటుచుండెను. అతఁడిల్లుకదలి యూవలావ లకు వెళ్లుటమానుచుండెను. ఎక్కడికేని పోయినను త్వరితగతిని మరలివచ్చుటకు మొదలిడెను. తానిలువిడిచి యెక్కువసేపెక్క డనైన నుండవలసి వచ్చినయెడలఁ దనభార్య చర్యఁ గనుచుం డుఁడని యొకరిద్దరునౌకరులను వేగులవాండ్రనుగా నియోగిం చుచుండెను. ఇట్టులామె బ్రతుకడకత్తెరలోని పోఁకచెక్కవలె నుండెను.

గంగమ్మ పగటివేళ సుందరమ్మగారి యింటికిఁబోవుట మాని, రాత్రులయందు మగఁడు నిద్దురవోయినతర్వాత,

నింటిపనులు చేయుచుండునట్లు నటించి, కూఁతుకడకరిగి చూచి, నిద్రించుబిడ్డనులేపి, యెత్తుకొని, యేవో యాహారపదార్థములం బెట్టి లాలించివచ్చుచుండెను. శకుంతలకుఁ దెలివిదేటలువచ్చినకొలఁది నూరటగలుగుచుండెను. అది తనయీడుబాలబాలికలతో నాటలాడుకొనుట కలవాటుపడెను. కాని తల్లినిజూడకుండ నొక్కనాఁడేని నిలువలేకుండెను.

ఈరీతిగాఁ గొన్ని నెలలు గడచెను. వృద్ధులపాలిట మృత్యుదేవతయగు హేమంత మేతెంచెను. గోపాలపట్టణము పర్వతప్రాంత ప్రదేశమగుటచేత నందుఁ జలి మిక్కుటముగా నుండెను. అప్పుడు చేలకుఁ గోఁతలు జరగురోజులు గావునఁ గర్షకజనులు రేయింబవలు బొటలయందుఁ దిరుగుచుండిరి. సీతుబాధ గణింపక కూఁతుపైఁగల మమకారముచేత గంగమ్మ యర్ధరాత్రమున నిలువెడలిచనుచుండ నామెనెఱిఁగిన పాలికాఁపులిద్ద ఱొకసారి కనఁబడి "అమ్మా! ఇంతనడిరేయి నెక్కడికిఁబోవుచున్నా"రని ప్రశ్నింపఁగా, నామె యాలోచించిచెప్పుటకుఁ గాలముచాలక "యొకపనిమీఁదస్టేషన్ మాష్టరుగారియింటికిఁ బోవుచున్నా" నని మారుపల్కెను. చలియక్కువగా నున్నప్పుడెల్ల నామె తనబిడ్డయెట్లులున్నదో యని భయపడుచుండును. తరుచుగా నాబిడ్డకుఁ జలిగాలితగిలి యూపిరితిత్తులు చెడినట్లులో జ్వరముతగిలినట్లులో మఱియే యితరవ్యాధియో కలిగినట్లులో యామె యూహించుచుండును గాని, బిడ్డయానందముతోఁ దోడిబిడ్డలతో నాడుకొను

చుండుననికాని, సుఖముగా నిద్రించుచుండుననికాని, తలఁపదు. అత్యాదరః పాపశంకి ,,యని పెద్దలు చెప్పుట కామెయే ప్రబల నిదర్శనము.

వేఱొకనాఁ డెప్పటియట్ల మగనినిద్రించుచ్చి గంగమ్మ సుందరమ్మయింటికిఁ జనుచుండెను. దారిలో వెనుకటిపాలి కాఁపులును, వారికామందగు నొకక్షత్రియుఁడును నామె కంటఁ బడిరి. ఆమె చెట్టుచాటునకుఁబోయి దాఁగికొనఁ జూచెను. కాని వారు లెస్సఁగాఁ దన్నుగుర్తించిరని యెఱుఁగుట చే నది మఱింత యనుమానహేతువని యూహించి యెదుటఁ బడియెను. ,,అమ్మగారు మరల వెళ్ళుచున్నారెక్కడికో!" యని యొకపాలికాఁపనెను. ఆమెకలవరపడుచు ,,స్టేషన్ మాష్టరుగారి యింటికే,, యని జవాబిచ్చి వెనుకవెనుక చూచుచుఁబోయెను. తామిదివఱకామెనుజూచి యొకపర్యా యము మాటాడుటయు, రెండుమూఁడుసారు లామె నిశీథ మున నారీతి మాష్టరుగారి బసకేగుచుండ దూరమునుండి చూచి గుర్తించుటయుఁ బాలికాఁపులు తమయజమానునితోఁ జెప్పిరి. ఆయజమానుఁడును నామెచర్య యనుమానాస్పదమే యని వచించెను.

మరునాఁడాక్షత్రియుఁడు పనిఁగల్పించుకొని యప్పల సామియింటికి వచ్చి ,,అప్పలసామీ! నీకు క్షేమమేకదా?,, యని యడిగెను.

అప్ప—అయ్యో! నా క్షేమమున కేకొంతయులేదు. ఏదోపనియున్నఁగాని తమరు మాయింటికిరారు.

రాజు—పనేమియులేదు. నిన్నరాత్రి రెండుజాములకు నేను బాలికాఁపులతోఁ బాలమునుండి యింటికేతెంచుచుం టినిఁ అప్పుడు నీభార్య యేదోతొందరపనిమీఁదఁ గాబోలు స్టేషన్‌మాష్టరుగారి యింటికేగుచున్నది. మాపాలికాఁపొకఁడామెను బలుకరించెను. కాని నేను మాటాడలేదు. తాను మాష్టరుగారియింటికే పోవుచున్నట్లు లామె వచించెను, అంత యర్థరాత్రిమున నొంటిమై సామె యేలపోవలయునని శంకించితిని. అప్పుడు రైలుబండ్లు వచ్చువేళయుఁగాదు. నీకేదోజబ్బు చేసినదేమోయని యనుమానించితిని. ఇనుమునకైనఁ ద్రుప్పు పట్టునుగాని, నీకు భయములేదని మరలనూహించితిని. కాని సందేహము. దీర్చికొనుటయే మేలనియిటువచ్చితిని.నీవారోగ్యవంతుఁడవై యున్నందులకు సంతోషముగానున్నది. విశేషము లెవ్వియులేవుగదా?

అప్ప—నిన్నరాత్రిముననా! నాభార్యమీకుఁ గన్పట్టినదా!మీరు మఱియొకతెనుజూచి యామెనుగాఁ దలఁపలేదు గద?

రాజు—మీాకాసందేహ మక్కఱలేదు. మాపాలికాఁపు నీభార్య యారీతిని నిశీథమున మాష్టరుగారి యింటికేఁగుచుండ బలుసారులు చూచి నాఁడఁట ఆమెమాపక్కనుండియే

పోయినది. దీపపు వెలుతురులో నామెను బూర్తిగా జూచితిని. కంఠధ్వని వింటిని.

అప్ప—ఆలాగునా! (అనితల పంకించెను)

రాజు—అలజడులెవ్వియు లేవుగావున, దృష్టపడితిని. పోయెదను.

అప్ప—చిత్తము. మీదయకు మిగుల గృతజ్ఞుఁడను.

ఇట్టు లాకుతిత్రియుఁ శౌక్యఘోరవిషబీజ మాగోపుని హృదయక్షేత్రమున నాటిపోయెను. దాని విషము త్రాఁచుఁ బామువిసమువలె నిమిషములో నప్పలసామి యొడలెల్ల వ్యాపించి యతనికొక విధమైన తాపముదయింపఁజేసెను. ఆతాపపముచే నతఁడు వేఁడినిట్టూర్పులు పుచ్చుచుండెను. మేనెల్ల స్వేదోద్గమమయ్యెను. పిచ్చియెత్తినవానివలె నతఁడు వాఁకిటఁ బ్రచారము చేయుచుండెను. ఏమిసేయుటకు నతనికిఁ బాలువోకుండెను. అతనితీరుఁజూచి గంగమ్మ మరల నేదో కీడు మూడినదని యనుమానపడినది. కాని యట్టితఱిం దానెదుటఁ బడుటకన్నఁ బరోక్షమం దుండుటయే మేలని తలఁచి యామె వంటయింటనే కూరుచుండియుండెను. అంత నప్పలసామికొక యుపాయము తోఁచెను. అది మనస్సునకు సరిపఱుచుకొని, యతఁడు తాపము నించుక చల్లార్చుకొని, తాత్కాలికముగాఁ దనకుఁగల్గిన భావోద్రేకము నడంచుకొని, యెప్పటివాలకమునే పూని, నాఁడింట మెలంగుచుండెను. తనవెనుకటిచర్య జ్ఞప్తికివచ్చికాఁబోలు నతఁడట్టులుండెనని యూహించి గంగ

మ్మయుఁ దనగుట్టు వెల్లడికాలేదనియే నమ్మి యూరట వహించి యుండెను.

రాత్రి యెప్పటివలె మగఁడును దానును భుజించిరి. మగఁడు కొంతతడవు పుస్తకమొకటి చదువుకొనుచున్నట్లు కనఁబడఁ దాను జాలసేపు పసువులమేఁతలు పాఁడిసవరణలుఁ మున్నగుపనులయందు నిమగ్నయై యున్నట్లు నటించెనుఁ నేఁడు తనచర్య నటనమని యాతఁడు గ్రహింపఁగల్గెను. కాని యాతనిచర్యయు నటనమేయని గంగమ్మ గ్రహింపలేక పోయెను. అప్పలసామి పదిగంటలరాత్రివఱ కటులే చదువుచున్నట్టులుండెను. గంగమ్మ యింకను బనిఁజేయుచున్నట్టులున్న నతఁడనుమానించునని తలఁచి పనులెల్లముగించుకొని, శయనమందిరమునకుఁ బోయెను. అప్పలసామియుఁ బడకఁజేరెను. అప్పటికి గంగమ్మమేనువాల్చి నిదురనటించుచుండెను. అప్పలసామి యామెను మాటాడింపక తానును మేనువాల్చెను. గంగమ్మ కన్నులుమూసి దీర్ఘనిశ్శ్వాసములతో నిద్దరవోవుచున్న దాని భూమికంగొని జయప్రదముగా నటించెను. అప్పలసామియుఁ గన్నులుమూసికొని కొంతసేపు చిన్నిచిన్నియూర్పులును, గొంతతడవు పెద్దపెదయూర్పులును, నవల గుఱ్ఱుతో గూడిన యూర్పులును బుచ్చి తనపాత్రముంగూడ లెస్సఁగాఁ బోషింపఁగల్గెను. మగఁడు గాఢనిద్రయే చెందుచుండెనని గంగమ్మ నిశ్చయించి చప్పుడుచేయకుండ మెల్లఁగలేచి పిల్లివలె నడుగులిడుచు, వాఁకిటికివచ్చి మరల నింకొకసారి భర్తవంకఁ

జూచి యతఁడింకను గుఱ్ఱుపట్టి నిద్రించుచున్నటులేగాంచి, పెరటి గుమ్మము తెఱచి, పైనిగొండెమునుంబెట్టి చప్పచప్పన, సుందరమ్మ యింటికేఁగుచుండెను.

అది కృష్ణపక్షైకాదశి. పదునొకండుగంటలు దాఁటినను జంద్రోదయముకాలేదు. నక్షత్రములకాంతి యుండెనుగాని, దానివలనఁ జెట్లచే దట్టముగాఁగప్పివేయఁబడినబాట తిన్నఁగాఁ గాన్పింపకుండెను. ఆమె హృదయములో నెలుఁగు ప్రేమ జ్యోతియే దేదీప్యమానములైన కాంతులను ముందు పంపు చుండఁగా, గంగమ్మ నిర్భయముగా నడచి పోవఁజొచ్చెను. ఆమె వీధిలోని కేఁగుటఁగని యప్పలసామిలేచి, కఱ్ఱకత్తియొ కటి చేఁబూని తానును జప్పుడుచేయకుండఁగనే వీధిలోనికి సింహాద్వారముగుండ వచ్చినిలిచెను. అప్పటికి గంగమ్మ సుమారిరువది గజముల దూరమునఁ బోవుచున్నది. అతఁడొక తాళము వీధిగుమ్మమునకు వైచి, తానుగూడ నామె వెను వెంటనే బయలుదేఱి బాటప్రక్కలనున్న పొలాలగట్ల మీఁద నడుచుచు వచ్చుచుండెను. గంగమ్మ తన్నెవ్వరేని వెంబడించుచున్నారేమోయని నడుమనడుమ వెనుకకుఁదిరిగి చూచుచుండెడిది. కాని యప్పలసామి యామెకు గోచరింప కుండ నడుచుటచే నామె కనిపట్టలేకపోయెను. స్టేషన్మాష్టరు గారి పెరటిగుమ్మము తలుపులు గంగమ్మకొఱకు వేయింబ వలు తెఱువఁబడియే యుండునుగావున, నామె యాద్వార

మున లోనికరిగెను. అప్పలసామియు నామె వెనువెంటనే వచ్చి యాగుమ్మముకడ నాఁగెను.

గంగమ్మ లోనికేఁగుటయు, నందు వసారాగదిలోఁ దూఁగుటుయ్యెలలోఁ బండుకొని నిద్రించుచున్న బిడ్డను ,,అమ్మా! శకుంతలా! లే. తల్లీ!" యనిపిలిచి లేపుటయు, పిలిచినంతనే యులికిపడి యాబిడ్డలేచి గంగమ్మను గౌఁగిలించుకొని, ,,అమ్మా! ఇప్పలా! వచ్చావు? నేను బువ్వతిన్లేదు" అని చెప్పటయు, ,,అయ్యో! వెఱ్ఱితల్లీ! నారాక కొంచెమాలస్య మైనంతమాత్రమున నీవు బువ్వతినవలదా? అత్తయ్యగారు తినుపించలేదా?" యని యామె బిడ్డనడుగుటయు, లేదని బిడ్డమాఱ్వలికి యేడ్చుటయు, నామె బిడ్డనెత్తుకొని దగ్గఱనున్న యొకచిన్న 'బీరువా' కడకేఁగి యందున్న పెట్టెలోని 'బిస్కట్లు' కొన్నితీసి పెట్టుటయుఁ, గడపట బిడ్డనక్కాలలో వైచుకొని పాలుడిపి నిద్రబుచ్చుటయు, నప్పలసామి కాంచెను. అతని కాశ్చర్యము, భయము, శోకము, క్రోధము, మఱియు నేవేవో జనించెను. కాని గభీరహృదయుఁడగుటచే వేనిని బైకిరానీయలేదు. ,,ఆహా! ఈచర్యఁ గప్పిపుచ్చుటకే కాఁబోలుఁ నిది 'యెందుంటివని నన్నడుగకుఁడు. భ్రష్టురాలనై తినుట సత్యమని, నాశో నలనాఁడు వచించినది! ఇది యెంత జగవెంత! ఎంతమోసకత్తె! ఆనడుమ నొక ముసలిదానితో సుందరమ్మ వచ్చినప్పుడీ బిడ్డనే యిదియెత్తుకొని యున్నది. దీనిపై ఖరంజూడ నీశిశువు దీని కుపభర్త వలనఁ గల్గి

నదనుట కెట్టిసందియమును లేదుగదా? రామయ్యచెట్టి బిడ్డను నేనొకతఱిఁ గాపాడితినని చెప్పినప్పుడిదియుఁ దక్కుంగల తమిళస్త్రీలును నివ్వెఱపడిరి. ఆనివ్వెఱపాటున కర్థమిప్పుడు గోచరించుచున్నది. ఈబిడ్డయే రామయ్యచెట్టి బిడ్డకావలయును! ఇదినేను సందేహించినట్టుగా రామయ్యచెట్టితో లేచిపోయియుంటనిజమే. ఆహా! వాఁడెంతమోసగాఁడు! 'అమ్మతోడు. నేనెట్టి పాపకార్యమును జేసియెఱుఁగ' నని కల్లబొల్లిమాటలాడి నాకు నమ్మకముం బుట్టించినాఁడు. తమిళదేశపు మోసమంతయు వానికడనే యున్నదిగదా! నాతో మాటాడునపుడు స్నేహరస మొలికించుచు వికటమందహాస మొనర్చుచు మాటాడినాఁడు. వాని వాలకముంగాంచి, వాఁడు విశ్వాసార్హుఁడనుకొంటిని. నాకొంప దీసినాఁడు. పయోముఖవిషకుంభము, గోముఖవ్యాఘ్రము! ఇదియామూరనే నన్నుఁగికురించి పరపురుషునితో వేశ్యవలెఁ గాఁపురముఁ జేయుచు మూఁడేండ్లుండుట నేను గ్రహింపకపోయితినే! నావంటి మందుఁడుండునా? నేను బెండ్లాడినకాంత పరపురుషునిఁ జేపట్టి వానివలనఁ గన్నకూఁతునకు వర్ధంత్యుత్సవముం జేయుచుండఁగా, నెట్టి యనుమానమును లేక నేనాయుత్సవమునందుఁ బాల్గొని విందుఁగుడువ నేఁగితినిగదా! నాకన్న గొప్పయవివేకి లోకములోనుండునా? (ఒకనిట్టూర్పువుచ్చి) ఇప్పుడేమి చేయవలయును? ఇది భ్రష్టయని మున్నెఱిఁగియున్నను, దీనిమరితర హాస్య మామూలముగా నెఱుఁగకపోవుటచే నేనూరటఁ గాంచి

మరల దీనితోఁ గాఁపురమున కియ్యకొంటిని. ఇది యొనర్చిన పాపము రూపముఁదాల్చినాయెట్టయెదుటఁగన్పట్టుచుండ నేనిఁక నెట్లుసహింపఁ గలుగుదును? ఓదైవమా! నాకేదారి కల్పింతువు? నేనుదీనిని విసర్జింపఁ జూచినను, నాపరితాప మడంగదు. ఇదియు దీనిబిడ్డయు నాకంటఁ బడునప్పుడెల్ల నాయువమానాగ్ని రగిలి నన్ను దినదినము దహించి వేయుచుండునుగదా? ఆయగ్నిచే దహింపఁబడి దినక్రమమున నేనాఁడో చచ్చుటకన్న, నేఁడే యేయుపాయముచేతనో ప్రాణములు గోలుపోవుట యుత్తమమార్గమగునుగదా! ఓయీశ్వరా! నన్నీ భూలోకరంగమున నవతరింపఁజేసి నాచే నాడింపఁదగిన నాటకమాడించితివి. నీవు నేపథ్యమున నిల్చి నన్ను నీకడకురమ్మని పిలిచెడు ఘంటానాదము నీవుచేయుచున్నట్లు నాకు గోచరించుచున్నది. ఇఁక నీపాత్రి నిర్వ్క్రమింప వలసినదే. ఇదేవచ్చుచున్నాను. ఉన్నపాటుననే వచ్చుచున్నాను. నేను సవరించుకొనవలసినదేదియు లేదు. అయిన నొక్కసారి నాభార్యతో మాటాడి మఱివచ్చుచున్నాను." అని తనలోఁదాను బల్కికొని, జోలపాటలఁబాడుచుఁ దనబిడ్డను జోకొట్టుచున్న భార్యనుబిలిచి యిట్లుప్రసంగించెను.

అప్ప—గంగూ! (అని పిలుచునప్పటికి గంగమ్మయులికిపడి బిడ్డనచ్చటనే దిగవిడిచి యావలకువచ్చెను.) నిన్నొక్కప్రశ్నముమాత్రమే యడిగెదను. దానికిసరియైన జవాబు,

దేవుఁడేసాక్షిగా నున్నాఁడనియెంచి, వెంటనే చెప్పుము. ఆశిశువునకును నీకునుగల సంబంధమేమి?

గంగ—(తనులత వడఁకుచుండ నిలిచియున్నది, యొక్కపాటున నతనిపాదముల పై వ్రాలి) ప్రాణేశ్వరా! మహాపాపాత్మురాలనగు నేనింకను దాఁపఁగలనా? ఆబిడ్డ నేను గన్నకూన. దానిపైఁగల మోహముచే నేను మీయాజ్ఞ నతిక్రమించి యిటకు వచ్చుచున్నాను. కడుపుఁదీపిని దోఁయఁజాలకయుఁ దమయానతి దాఁటఁజాలకయు నాపడుతాప మాయీశ్వరునికే యెఱుక. గుప్రక్కుఁడు ప్రాణమునేకదా, యేలవిడువరాదని యూహించితిని. కాని నేను మృతినొందిన, నాబిడ్డగతి యేమగునో, యదికూడ నన్ను వెంబడింప వలసియుండునేమోయని సంకోచించి యాప్రయత్నము మానితిని. రూపొందిన నాపాపముం దమకుఁ జూపుట యధికతాపహేతువని యందునకు సాహసింపనైతిని. నాగుట్టు బట్టబయలయ్యెను గనుక, నేనికజీవింపరాదు. నన్ను మీచేతులతోఁ జంపి యీపిల్లనుమాత్రము కాపాడుఁడు. నాయాత్మకు శాంతి గలుగును.

అప్ప—ఇప్పుడు నిన్ను శిక్షింపవలసిన పనేమియులేదు. పుత్రికామోహముచే నీవాచరించిన యీరహస్యచర్య యంతగానింద్యముగాదు. బుద్ధిపూర్వకముగా నీవుచేసిన ఘోరపాపమునకై నీవు పశ్చాత్తాపపడుటకును వలనుగాకుండ, నీకాబిడ్డయడ్డంకియైనది. అంతేకాక యది నీదురితములను బెఱుఁగఁ

జేయుచున్నది. కాని యది నోరెఱుఁగని కూనయగుటచే, దాని నేమనఁగలను? నేను మాత్రమిఁక నీకడనుండఁజాలను. ప్రజలమొగములు చూడఁజాలను. నేనెందేనిపోయెద. నాకిఁకఁ బ్రపంచముతోఁ బనియేలేదు.

గంగ—అయ్యో! హృదయేశ్వరా! మీరేయెందేని పోయిన, నిఁకనేనా? నాబిడ్డకిప్పుడు కొంచె మింగితము గలుగుచున్నది. ఇఁక నెవ్వరో దానిని గాపాడకపోరు. కావున నేను మీవెనువెంటవత్తును. దయతో నారాకననుమతింపుఁడు. మిమ్ముఁవిడిచి నేను మనఁజాలను.

అప్ప—అదివట్టిమాట. మూఁడేండ్లు మనలేదా?

గంగ—నాచపలబుద్ధి నన్నట్లు లీడ్చుకొనిపోయినది. అందుసకు నేనుబడు తాపము నాహృదయమునకేగాని యొరులకెఱుకపడదు. మున్నెట్లు వర్తించినను, నిఁకముందట్లు మీయెడఁబాటునుసహింపఁజాలను. మిమ్ముఁవీడినయుత్తరక్షణమున నేను గుండె వ్రీలఁజనిపోవుదును. నామాట నమ్ముఁడు. అది నిశ్చయము.

అప్ప—నేనునమ్మను. ఇఁకనీదారినీది. నాదారినాది. నాకు భగవంతుని యాహ్వానము వచ్చినది. అతఁడొనర్చు గంభీరవిషాణధ్వని నాకువిస్పష్టముగా వినఁబడుచున్నది. నేనిఁకఁ బోవకతప్పదు.

అని చివాలున నతఁడు వెనుకకుఁ దిరిగిరొక్కపరువుఁ

బోవఁజొచ్చెను. "నేను మి మ్మనుగమించుదాననే" యనుచు గంగమ్మయు నాతని వెంబడిఁ బరుగిడెను.

---

## ౧౯ నిధనము.

—)o(—

అప్పలసామి చంగుచంగున దుముకుచుఁ బొలముల వెంబడిఁ బరువెత్తి యొకయేటిలోదిగి దాని నవలీలనీఁది యావలనున్న కొండనెక్కి వేగముగాఁ బోవుచుండెను. అతనికి గమ్యస్థాన నిర్ణయములేదు. పోవుటకొఱకే పోవుచుండెను. గంగమ్మ యాతని ననుసరించి యేటిదాఁకఁ బరుగెత్తఁగల్గెను. కాని యామె కీఁతరాదు. కనుక నేటిలోదిగి ముందునకుఁ బోలేక, యేటిగట్టువెంబడిని గొండకావలిప్రక్కకుఁ ద్వరితగతిని బోవుచుండెను. మనస్సు చలించి యొక్కమచ్చుననే పరుగిడు నప్పలసామి కొండకొనఁ జేరినతర్వాత నడుగులు తడఁబడుటచే జాఱిపడెను. ఆపాటుచే నతఁడు మూర్ఛిల్లి రాలపై దొరలి పోవుచు నడుమనొకభూరివృక్షమడ్డురాఁగా దానిచే నాఁపఁబడి యుండెను. అతనికిఁ జైతన్యమే లేదు. దేహమంతయు గాయములయ్యెను. మనస్సులోనిగాయము చెప్పనక్కఱయే లేదు కదా! ఏటిగట్టునఁ బరుగులిడు గంగమ్మ మఱియొక కొండ నారోహించి భర్తకై వెదకుచుండెను. "నాథా! నాప్రాణ నాథా!" యని పిలెలుంగునఁ బిలుచుచు నామెపోవుచుండెను.

అప్పటికిఁ జంద్రోదయము కానున్నది. ఆకసమించుక ధావళ్యముఁ వహించి యుండెను. ఆమె యొక్కతీరునవే పర్వత శిఖరమునకుఁ బరుగుపరుగునఁ బోయెను. అక్కడనిలిచి మరల "ప్రాణనాయకా! ఎచ్చటనున్నావు? నన్నిట్టి విషమపరీక్షకు లోనుగావించుట తగవుగాదు." అని యఱచెను. గొంతెత్తి యేడ్చెను. కాని యామెది యరణ్యరోదనమయ్యెను. అంతఁ గ్రమముగాఁ జంద్రుఁడుదయించుటయుఁ దత్కిరణములు వృక్షాగ్రములును గొండకొనలను నెక్కుటయుఁ దటస్థించెను. వెన్నెల వెలుంగునకుఁ గరంబు మఱుంగుచేసికొని గంగమ్మ యన్నిప్రక్కలం గలయం జూచెను. ఎదుట నింకొకకొండయు, రెండుకొండలకును మధ్యమందొక ప్రవాహమును నామెకుఁ గాన్పించెను. తానిందాఁకఁ దరింపఁజాలకపోయిన యేఱదియే కాఁబోలు ననియుఁ, దాను భర్తయెక్కినకొండకాక వేఱొక కొండ నెక్కితిననియు, నామెగ్రహింపఁ గల్గెను. క్రమ్మఱఁ గంఠమెత్తి భర్తను బిలిచెను, ఆకొండమీఁద నతఁడు కాన్పించునేమోయని తన విశాలనయనముల నింకను విశాలతరములు గావించి యరసెను. అప్పుడొకమూలుగు వినఁబడెను. ఆమె మఱియు నాత్రముతో నారయఁ జొచ్చెను. తన కెదుటి కొండ చరియమీఁద నొకతరువును బట్టుకొని యొకమనుజుఁడు పండుకొనియున్నట్టు లామెకుగోచరమయ్యెను. మఱియుం బరికించి చూడ నామనుజుండు తొడిగికొన్న తెల్లనిచొక్కాయ గంగమ్మ కనిపట్టఁగల్గెను. తనభర్తయు నట్టిచొక్కాయనే

నాఁడుదొడిగికొని వచ్చుటచే, నతఁడు తన నాథుఁడేయని నిశ్చయించి, వేగముగా నాతనికడకుఁ బోవలెనను కుతూహలము చేతఁ దానెక్కిన కొండ చరియ యందుఁబరువిడుచుఁ గ్రిందికి దిగఁ జొచ్చెను. ఆపరువున నామెకును గాలు జాఱెను. తూలి పడెను. ఆమె పడినచోటించుక సమముగానుంటచే నామె క్రిందికి జాఱిపోవుచుండెను. పట్టుకొనుట కాధారమేమియు నామెకుఁ లభింపకుండెను. రెండునిముసములట్లు జాఱుచున్న, నామె తప్పక క్రింది లోయలో నియేటఁబడును. తుదకామె కొక పాషాణశృంగ మవలంబముగా దొరకి దానిం బట్టి వ్రేలాడుచుండెను. కాని యామె పైకెగఁబ్రాకుట కేమియు వీలు లేకుండెను. ఇట్టులుండి యామె తన వెనుకతట్టుననున్న కొండ చరియమీఁదఁ బడియున్న భర్తనుద్దేశించి, “నాథా! నేనీ యేటఁ బడి పోవుచున్నాను. నాప్రాణసంరక్షణముం జేయవా? ఆయాసముచేఁ బట్టుదప్పుచున్న” దని కేకలిడెను.

వెన్నెలసోఁకుటచే నప్పలసామి మూర్ఛనుండి తేఱుకొనెను. ఆతఁడా యార్తనాదమువిని లేచిచూడ నెదుటనున్న కొండమీఁద నొక ఱాతికొనను బట్టుకొని వ్రేలాడుచున్న తనభార్య గాన్పించెను. అతఁడామెను గాపాడనామానవాయని యించుక తర్కించుకొని, యవల నెట్టివారలైనను నార్తిఁ జెంది రక్షణముఁ గోరునప్పుడు రక్షణముంబొంద నర్హులేయని తలఁచి భార్యను గావనిశ్చయించుకొని, తనదగ్గఱనున్న చెట్టు మీఁదుగాఁబోయి, దాదాపుగా నావలికొండ నంటియుండు

దానిశాఖల కొనలకుఁబోయి చూచెను. భార్యబారెఁడు దూరములోనున్నది. కాని యందునిలిచి చేతులుచాపిన, నందకున్నది. అప్పుడతనికి మున్నుసర్కసులోనేర్చిన విద్యయేయాధారముగాఁదోఁచి, తనపాదములు రెండును జెట్టుఁగొమ్మకుఁదగిలించి గట్టిపట్టుచేఁ దనదేహమునునిలుపుకొని, తలక్రిందుగా వ్రేలాడుచుఁదనచేతులతో భార్యపాదములం బట్టయత్నించుచు నూఁగులాడు చుండెను. ఆచెట్టువ్రేళ్లుగల తావు గుల్లనేలయగుటచేత, బరువుగల మానిసియొకఁడు దాని కొనఁగొమ్మలం బట్టివ్రేలుట చేత, నది క్రమముగా వంగి, దానివ్రేళ్లు తెగిపోవుచుండెను. మఱిమూఁడునాలు గూఁపులలో నతఁడు గంగమ్మ యడుగుల నందికొనఁగల్గెను. ఇప్పుడు తరువున కిరువురి భారము గలుగుటచే మూలములు పూర్తిగా విచ్ఛేదనమందెను. ఇద్దఱు నేటఁగూలుదురవస్థ గలుగవచ్చునని యప్పలసామిభయపడి భార్యను బ్రవాహపు టొడ్డుననుండు నిసుకతిన్నెల మీఁదికి విసరివైచెను. ఆమెయు సాముగరిడీలనేర్చిన దేకావున, నాపతనమునందు గొప్పదెబ్బలు తగులకుండ నేలఁబడెను. అంతఁ జెట్టుతోఁబాటు మనకథా నాయకుఁడును బ్రవాహములోఁ బడిపోయెను. అతఁడుపడినచోట నొకరాతిగుట్ట నీళ్లలో మునిఁగి యుండెను. దానిపై నాతఁడువ్రేత్తుగా బడుటచే నతని శిరస్సు పగిలెను, శరీరభాగములలో మఱికొన్నిటికిని గట్టిదెబ్బలు తగిలెను. తలదిమ్ము ఘటించుటచే నప్పలసామి కొంతవడి మేనెఱుంగక యుండెను. అవలఁ గొంత

తెలివివచ్చెనుగాని, యతనికి భరింపరాని యాయాసము తోcచుచుండెను. తానిcక బ్రతుకనని తలcచి యతcడెట్టులేని గట్టును జేరికొనcగోరి, యేటcబడి మెలమెల్లcగా బారలువైచు చునీదcజొచ్చెను. ఎంతోపరియాసముమీcద నతcడొడ్డునకు రాcగలిగెను. కాని వచ్చిన కొన్నినిముసములకే యధికాయాస ముచేతను, విశేషరక్తస్రావముచేతను, నతనిగుండె యాcగి పోయెను. అప్పలసామి కీర్తిశేషుcడయ్యెను.

సికతాతలంబునం బడియున్న గంగమ్మ యించుక తేటుకొని, యేటcబడిన మగcడు బయటికి వచ్చెనో లేదో చూడcగోరిc, లేచియరయుcగాc దనకించుకదవ్వున నాతcడు పడియుంటయామె గాంచి, మెల్లcగా నతనికడకేcగెను. చైత న్యము లేకపడియున్న నాథునింగాంచి యామెకలవరపడి ,,నాథా! యేలయిట్లులుంటి” రని పలుకుచుc జేతితోcదట్టిలేపెను. అతcడు మార్వలcక లేదు. కదలించినc గదలలేదు. నాసికా రంధ్రములకడ వ్రేళ్లుంచిచూడ, నూపిరివచ్చుచున్నట్లుకనc బడలేదు. ఆమెమఱియుc గలcతపడి ,,అయ్యో! ప్రాణేశ్వరా! పలుకరేమి? ”యనిదేహమంతయుcగంపింపcజేసిచూచెను. కాని జవాబు లేకుండెను. అంతనామె గుండెబాcదుకొనియుc దల నేలపైc బగులcగొట్టికొనియు నేడువసాగెను. ఆయాసముచేc బ్రాణముకడంటినదేమో మరలc గొంత సేపటికైనc దెలివివచ్చునేమోయనియామె యూcగిచూచెను. కాని యేమియు మార్పుకనంబడదయ్యె. అప్పుడామె తనభర్త తనకొఱకై ప్రాణములు గోల్పోయెననియే నిశ్చయించుకొని

దిక్కులన్నియు మార్మోయునట్లుగా బిగ్గఱగా రోదనమొన
రించెను. అది యర్ధరాత్రి మించుకమీఱియున్న సమయము.
నిర్జనప్రదేశము. ఆమెకు మార్వలుక నక్కలును గుడ్ల
గూబలును దప్ప నితరములు లేవు. ఆమెయెంత సేపేడ్చినను,
నోదార్చువా రెవ్వరును లేరు. "అయ్యో! నేనెంత దుర్మార్గు
రాలను! నా బ్రతుకాదినుండియుఁ గళంకపూరితమై యే యుం
డెఁగదా! చిన్ననాఁడు, తల్లిమాట పెడచెవినిఁ బెట్టి యామె
కిష్టములేని పెండ్లి చేసికొంటిఁగదా! దానిచే నామెమనస్సు నల
యించితిని. తరువాత నాభర్త కిష్టములేని పట్టణ జీవనమునకుఁ
బురికొల్పి యతనితోఁ బాటు మహాపట్టణమున నివసించుచు
నారోగ్యకరములగు నభ్యాసముల నాచారములను విడిచిపెట్టి,
తుదకు నీతికూడఁ బోఁగొట్టుకొని యన్యపురుషునితోఁ గాఁపు
రమొనర్చితిఁగదా! అత్తటి నేననుభవించిన వైభవములకు
గర్వపడి కన్నుగానక చరించితిఁగదా! నేనొర్చిన పాపములకుఁ
బ్రత్యక్షఫలమైన నాకూఁతునందు వెఱ్ఱిమమత నొందియుండి
యీమహానుభావునిఁ బలుభంగుల మోస మొనరించితిఁగదా!
నాచర్యఁ గప్పిపుచ్చుట కెందఱితోనో యెన్నోయబద్ధముల
నాడియుంటిఁగదా! కడపటి నిముసమందుసైతము నాకుపకృ
తియొనరించుటకే యత్నించిన నాహృదయేశ్వరునిఁ బత్తెఱం
గుల మోసపుచ్చితిఁగదా! తుదకితని ప్రాణములఁ బోఁద్రోలు
ఘోరవిపత్తును గల్పించితిఁ గదా! నేనితనిని వెంబడింపకున్న
నిట్టి యాపదరాదుగదా! (డగుత్తికతో) నేనే యీయన మరణ
మునకుఁ గారకురాలనైతిని. ఈమహామహుని నాపొట్టఁబెట్టే

కొంటిని. ఇఁకనేనీభూమిపై బ్రతికి యేమిప్రయోజనము? (అని యొకింత తడవాఁగి) తల్లీ! శకుంతలా! నాకునీతోఁ బూర్తిగా ఋణము చెల్లినది. నీవిఁక నెవ్వరి పాలఁబడుదువోగదా! నా రుపోసిన దేవుఁడు నీరుపోయఁడాయని యింతదనుక ధైర్యము వహించి నిన్ను పేక్షించుచుంటిని. ఇప్పుడు నిన్నుఁబూర్తిగా లోకమునకు విడిచిపెట్టి నాదారిని నేనేఁగుచున్నాను. తల్లీ! దయామయుఁడగు నీశ్వరుఁ డనాథబాలికవగునీయెడ ననుకంపఁబూని నీకాయురారోగ్యములొసఁగి నిన్ను సర్వదా కాపాడుఁగాత! ఈశ్వరుఁడే నీకు గాతాపితలు. ఉదారస్వభావులగు ప్రజలే నీకుఁ జుట్టములు."

అనుచు నామెపరివేదన మొనర్చి యామె భర్తకళేబరమునకు మూఁడు ప్రదక్షిణములు గావించి యతని పాదములపైఁబడి కన్నీటిచే నభిషేకమొనరించి, యచ్చటి కొండపై నున్న రాలలోఁ బెద్దదియొకటి దొరలించుకొనివచ్చి దానిని నడుమునకు, భర్త పంచకొంగుచించి త్రాడుగా నుపయోగించి, కట్టుకొని, ‚‚హర హర! మహాదేవ!" యని కేకవెట్టుచు నీటిలోనికిదిగి లోతునీళ్లలోనికిఁ బోయి యొకటిరెండు బుడగలతో మునిఁగిపోయెను. అప్పటికి మూఁడుజాములరాత్రి మీఁటి యున్నది. పక్షులు రెక్కలాడించుచున్నవి. ఆమె వైచినకేక మాపరిక్క నడుచుచున్న యొక పాలికాఁపునకు వినఁబడ నతఁడు వేగముగా నదిలోనికిదిగి చూచెను. వాఁడు మంచి యీఁతగాఁడగుటచే నేఱంతయుఁ గలయనీఁదెను. గంగమ్మ ప్రాణవాయువులు విడిచియే యున్నను, రాతి బరువుక్రింది

కాఁమె దేహమును గ్రుంగఁజేయుటచే నది పైకిఁదేలకుండెను. వాఁడట్టు కొంతతడవీఁదఁగా నవల వానికొకచోట బుడగలు వచ్చుచున్నట్టులు, చేఁపలు తండోపతండములుగా నందుఁజేరి యున్నట్టును బొడఁగట్టెను. అతఁడక్కడ నొక్కమునుకవైచి తడవిచూడ గంగమ్మదేహము సోఁకెను. వాఁడా దేహమునుబట్టి యొడ్డున కీడ్చుకొనివచ్చిచూడఁగా నొకస్త్రీ, తానెఱిఁగిన గంగమ్మయే. ఈమె బలవన్మరణముం గూర్చి యీమెభర్తకుఁ దెలియఁజేయుట యొప్పనితలఁచి యతఁడు త్వరితగతిని నడచి పోవుచుండఁగా, దారిలోఁ గాలికి మఱియొకశవము తగిలెను. దానిం బరికించిచూడ నది యప్పలసామిశవమే యయ్యెను. అతఁడా దంపతుల మరణమున కాశ్చర్యపడి, దానిని గ్రామాధికారుల కెఱింగింతమని యూరిలోనికిఁ బోయి కరణముగారిని లేపి యావద్వృత్తాంతమును జెప్పెను.

మఱునాఁటి యుదయమునకా యూరివారెల్ల నా యేటిదరికి వచ్చిరి. బిడ్డతో నారొమ్మగము పిళ్లగారును, సుందరమ్మయును వచ్చిరి. బలవన్మరణమగుటచేఁ బోలీసువారుకూడ వచ్చిరి. పండ్రెండుగంటల వఱకుఁ బంచాయితీ జరగుచునే యున్నది. ఆరొమ్మగముపిళ్లగారు గంగమ్మ దుశ్చరితమెల్ల నచ్చటఁ గూడినవారికి వినిపించిరి. సుందరమ్మ కడచిన రేయినప్పలసామి తనయింటికివచ్చి భార్య బిడ్డనులాలించుచుండఁ జూచి యామెతోఁ బ్రసంగించుటను గూర్చి సవిస్తరముగఁ దెలిపెను. ఉభయులును బ్రతుకులపై రోసి ముందప్పలసామియు నవల గంగమ్మయు నేటఁబడి

ప్రాణములు విడిచిపెట్టిరని నిశ్చయించి, తీర్పట్లు వ్రాయించి, రెండుశవములను గలయఁగట్టించి శ్మశానవాటికిఁ గొంపోయిరి. ఆశవముం గొనిపోవునప్పుడు గ్రామములోని గొల్లలందరు మరలఁ గోలాటములతోను, రామభజనలతోను గూడ నడచి యూరంతయు నూరేఁగించుచుఁ బోయిరి.

ఆ గోపదంపతుల మరణవార్త గోపాలపట్టణమందే కాక విశాఖపురిలోఁ గూడఁ దెల్లవారుసరికిఁ దెలిసెను. కర్ణాకర్ణి నావార్త గోడేవారి లోఁగిటనుం దెలిసెను. అక్కడ నూడిగముచేయుచున్న మాణిక్యమ్మ యావార్తవిని ఒక్కపెట్టున నేడ్చుచు గోపాలపట్టణమున కేతెంచెను. ఆమె వచ్చుసరికి శవములు దహనము చేయఁబడుటకుఁ జితిపై నెక్కింపఁబడెను. కూఁతుశవముపైఁ బడి యామె చాలసేపేడ్చి తానును నచ్చటివారితోఁ బాటన్ని బియ్యమా శవముల నోళ్లనిడి గంగమ్మకూఁతును జూచుటకు స్టేషన్‌మాష్టరుగారి యింటి కేఁగెను.

ఇట్లు మనకథకు నాయికానాయకులగు నాగోపదంపతులు కథావశేషులైరి. వారి జీవచారిత్ర మాంధ్రులకే గాక హైందవులకెల్లర కనేకనీతుల బోధించుచున్నది. వానినెల్ల సరయుపని చదువరులకే విడిచిపెట్టి మేము నుడువమానితిమి.—

---

## ౨౦ ఉపసంహారము.

మాణిక్యమ్మ "కూఁతురా, కూఁతురా" యని పెద్దపెట్టున నేడ్చుచు స్టేషన్మాష్టరుగారియింటి కేఁగునప్పటికి, సుం

దరమ్మ శకుంతలకు స్నానముఁ జేయించి తలతుడిచి యెత్తుకొని లాలించుచుండెను. శకుంతల బిక్కమొగము వైచుకొని, సుందరమ్మ బుజ్జంపుమాటలనేమియుఁ జెవినిబెట్టక, వెలవెలఁబోయి చూచుచుండెను. అమ్మమ్మ యాక్రందనధ్వని విని పిల్లకూడ నేడువఁజొచ్చెను. మాణిక్యమ్మ సుందరమ్మ యొడిలోనున్న మనుమరాలినెత్తుకొని, బిగ్గఁగౌఁగిలించుకొని బిట్టువాపోవఁ జొచ్చెను. "అమ్మా! నోరెఱుఁగని యీకూన గుండెచెదరఁ గొట్ట నెట్లొడ్డఁ దగునా? నీవు గర్భశోకమును లోలోన నిమిడ్చికొనవలయుఁ గాని యీబిడ్డకెఱుక పఱుపరాదు. నీకీబిడ్డయే కూఁతురు. గంగమ్మమాట తలపెట్టకు" మని యోదార్చెను. మాణిక్యమ్మ బిడ్డయడలునని పొరలిపొరలి వచ్చుదుఃఖమును దిగమ్రింగుచు లోలోనఁ గుములుచుఁ గూరుచుండెను.

కొంతతడవున కాగ్మాగము పిన్నగారుకూడ స్టేషనునుండి యింటిలోనికివచ్చి మాణిక్యమ్మను బరామర్శించిరి. గోపదంపతులు గతజీవన విధానమంతయుఁ బూసగ్రుచ్చినట్లు లామెతోఁ జెప్పిరి. ఈరీతిఁ గొంతసేపు జరగినతర్వాతఁ బిళ్ళగారు మాణిక్యమ్మను శకుంతలను వెంటఁబెట్టుకొని గ్రామములోనికేఁగి కరణముగారెని దర్శించి యప్పలసామి కాఁపురమున్న యింటిలోనికిఁ బోయిరి. కరణముగారు గ్రామమందున్న గౌరవనీయులగు మనుజులను గొందఱిని బిలిపించి, వారియెదుట నప్పలసామియాస్తియంతయు మాణిక్యమ్మకిచ్చి శకుంతలకు యుక్తవయస్సు వచ్చినతర్వాత దానిని దుర్వినియోగము చేయకుండ నప్పగించు పద్ధతిమీఁద నొకటివ్రాయించి యందు మాణిక్య

మ్మ చేవ్రాలు చేయించి కరణకపరిభృతులచే సాక్షివ్రాళ్లు చేయించి, యప్పగించిరి. అప్పలసామి చరాస్తియంతయు బండ్లపై నెక్కించి పిళ్లగారు తమబసకుఁ గొనిపోయి, బిడ్డకాశౌచ దినములు గడచిన పిమ్మట నొక శుభముహూర్తమున మాణిక్యమ్మతో బిడ్డను విశాఖపురికిఁ బయనముచేసి పంపిరి. సుందరమ్మకూడ నొకటి రెండువారములు బిడ్డ ముత్తవ్వయొద్ద నలవాటు పడువఱకు నుండుటకు నిశ్చయించుకొని యేఁగెను.

మాణిక్యమ్మ తానూడిగముచేయు జమీందారిణి యొద్దకు బిడ్డను గొనిపోయి దానియవస్థయెల్లఁ జెప్పి యంగలార్చెను. జమీందారిణి యాబాలికపై ననుకంపఁబూని యెన్నో చొక్కాయలును గట్టించి యాడుకొనుటకుఁ బెక్కు కీలుబొమ్మలిచ్చి యాదరించెను. పిళ్లగారొకనాఁడు విశాఖపురికిఁ బోయి యప్పలస్వామి బ్యాంకిలో దాచుకొన్న సొక్కమంతయు బిడ్డపేరవ్రాయించి దానికి శాశ్వతోపకార మొనరించి తమభార్యను తీసికొని సొంతబిడ్డనువీడినను జననీ జనకుల వలెఁ గంటఁ దడిపెట్టుకొనుచు గోపాలపట్టణమునకుఁ జనిరి.

శకుంతల శుక్లపక్ష శశాంకునివలె దినదిన ప్రవర్ధమానయగుచు నమ్మమ్మయింటఁ బెరుఁగుచుండెను. ఆమె రూపరేఖావిలాసములకుఁ దెలివిదేటలకు నెల్లవారును ముచ్చటపడుచుండిరి. దానికిఁ దల్లియందమునుదండ్రి యౌదార్యమును గల్గుటచే, నది మిగుల దర్శనీయమై యున్నది. దాని చుఱుకుఁదనముఁ జూచి రాణిగారు దానిని దొరతనమువారి బాలికాపాఠశాలకుఁ బంపి చదువుఁ జెప్పింపఁ దొడఁగిరి. అది యేఁటే

టఁ బరీక్షలలోఁ బ్రథమురాలుగాఁ గృతార్థయగుచు వి
బహూకృతులను గాంచుచుండెను.

పౌరులెల్లరును దాని సుగుణసంపదను గొనియాడు
చుండ, స్వజాతి గోవులెల్ల నట్టివిద్యావతి గుణవతి తమకు
ములోఁ గలదని గర్వపడుచుండ, గర్భశోకమును మఱచిపోఁ
మాణిక్యమ్మ దానికెల్ల ముచ్చటలను దీర్చుచుఁ గాలము
గడుపుచుండఁ దా నభిమానము వహించి పోషించుచున్న ఓ
భావియుగమునఁ బ్రసిద్ధిఁ గాంచఁగలదని జమీందారిణి యానంద
ముతో నెదురుచూచుచుండ, స్వర్గపురమున నెడతెగని యా
నంద మనుభవించుచున్న గోపదంపతులు తామీలోకమునఁ
నాటివిడిచిన మొలక యీశ్వరకృపవలన లెస్సగా వృద్ధిపొం
దుచున్నదని కని మోదమందుచుండ, శకుంతల నేఁటికిని విశా
ఖపురియందే యమ్మమ్మయింటనే పెరుఁగుచున్నది. విద్య నేర్చు
చున్నది. సాటివిద్యార్థినులతోఁ జకచక నడుచుచు బడికిఁ
బోవుచున్నది. ఆటపాటలయందు విద్యాగ్రహణమందు తిరం
తరోత్సాహినియై యున్నది.

శకుంతలకు దీర్ఘాయురైశ్వర్యాదు లొసంగి యీశ్వ
రుడు రక్షించుఁ గాతమని కోరుచుఁ గథాకథనమును విరమిం
చుచున్నాము. గోపదంపతుల సత్యనీతివర్తనములఁ గూరి
చదువరులే యరుదురు గాక.

ఓమ్ తత్సత్.